మానవి
గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


హైదరాబాద్

fb.com/vaartha Digital

ఇక నిమిషకు రక్ష 'బ్లడ్‌మనీ' ఒక్కటే!
5లో
పగలు తేనెలూరే మాటలు..
రాత్రి బాంబు దాడులు

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 164 పేజీలు: 10+4 వెల: 6.50



## అలనాటి మేటి నటి, 'పద్మభూషణ్' బి. సరోజాదేవి ఇక లేరు

### తెలుగు, కన్నడ, తమిళం, హిందీలోనూ అధిక చిత్రాలు

**బెంగళూరు, జులై 14:** బహుభాషా నటి బి. సరోజాదేవి వృద్ధాప్యసమస్యలతో సతమతం అవుతూ కన్ను మూసారు. మల్లేశ్వరంలోని తన నివాసంలో ఆమె స్పృహ కోల్పోయి ఉన్న స్థితిలో ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు ఆమె చనిపోయినట్లు ప్రకటించారు. కన్నడ,తెలుగు, తమిళం, హిందీ భాషాల్లో సుమారు 200కిపైగా చిత్రాల్లో సరోజాదేవి నటించారు. చతుర్భాషా తారే (నాలుగుభాషల నటి) అన్న టైటిల్‌ను మొట్ట మొదటి కన్నడ నటిగా ఆమె గెలిచారు. 1953లో >>2



## హైకోర్టు కొత్త సిజెగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

### ప్రస్తుత తాత్కాలిక సిజె కోల్‌కతాకు బదలీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** దేశంలో పలువురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల బదలీలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు సిఫార్సులను రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర న్యాయశాఖ బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో తెలంగాణ హైకోర్టు కొత్త సిజె(ప్రధాన న్యాయమూర్తి)గా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఇంతకు ముందు త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ పనిచేశారు. ఇక >>2

# 'స్థానిక' రణానికి సిద్ధంకండి





## రేవంత్, చంద్రబాబు రేపు భేటీ

### జల వివాదాలపై ఢిల్లీలో చర్చలు

### కృష్ణ, గోదావరిలో వాటాలపై గట్టిపట్టు పట్టాలని సిఎం రేవంత్ నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల జల వివాదాలపై చర్చకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. 16వ తేదీ(బుధవారం) మధ్యాహ్నం ఢిల్లీలో భేటికి ఏర్పాట్లు చేసిన కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఇద్దరు సిఎంలను ఆహ్వానిస్తూ కేంద్ర జలశక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేస్తూ ఇద్దరు సిఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని కోరింది. కృష్ణా, గోదావరిలో వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడికి సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయిం >>2

### దేవాదులనుంచి తుంగతుర్తికి గోదావరి నీళ్లు తెప్పిస్తా

### కాళేశ్వరాన్ని కూళేశ్వరంగా మార్చిన బిఆర్ఎస్

### 2034దాకా కాంగ్రెస్‌దే అధికారం

### పేదలకు ఆయుధం రేషన్ కార్డులు

### తిరుమలగిరిలో కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిన సిఎం రేవంత్



సోమవారం తిరుమలగిరిలో జరిగిన సిఎం సభకు హాజరైన జనసందోహం




సోమవారం తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు, ఉత్తమ్, కోమటిరెడ్డి, పొంగులేటి, లక్ష్మణ్ ,కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు

**నడిగూడెం,(సూర్యాపేట), జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 18 మాసాలలో ప్రతిష్టాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతిష్టాత్మక పథకాలైన సన్నబియ్యము, రేషన్‌కార్డుల పంపిణీ పేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుస్తుందన్నారు. రాష్ట్రంలో 5.61 లక్షలమందికి కొత్తగా రేషన్‌కార్డులు ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా రేషన్ కార్డులలో 26 లక్షల మంది పేర్లు మార్చే విధంగా అవకాశం కల్పించామన్నారు. దీంతో మూడు కోట్లమంది సన్నబియ్యం తీసుకునే అవకాశం కలిగిందన్నారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలన్నారు. 65లక్షల స్వయం సహాయక >>2



## అసెంబ్లీ సమావేశాలు ఆగస్టులో?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై14:** ఆగస్టులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. శాసనమండలి సమావేశాలు ఈసారి పాత భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 15లోపు శాసనమండలి భవన పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి ఆదేశించారు. శాసనసభ ప్రాంగణంలో శాసనమండలి భవనం పునర్నిర్మాణ పనులపై ఆర్అండ్, అగాఖాన్ సంస్థ, తదితర అధికారులతో చైర్మన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటి >>2

## ధాన్యం రవాణాపై ఫారెస్ట్ ఫీజు తగ్గింపు

**హైదరాబాద్, జులై 14. ప్రభాతవార్త:** తెలంగాణలోని పులుల అభయారణ్యాల గుండా ధాన్యం తరలించే లారీల నుంచి వసూలు చేస్తున్న పర్యావరణ నిర్వహణ రుసుమును అటవీ శాఖ తగ్గించింది. గతంలో రూ.525 ఉన్న రుసుమును ప్రస్తుతం రూ.300కి కుదించింది. ఎన్టీసీఏ నిబంధనల మేరకే తాము ఫీజు వసూలు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో పెద్దపులుల అభయారణ్యాల గుండా ధాన్యం తరలించే లారీల నుంచి వసూలు చేస్తున్న పర్యావరణ నిర్వహణ రుసుమును తగ్గించాలని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నిర్ణయించింది. గతంలో ఒక్కో లారీకి రూ.525గా ఉన్న ఈ రుసుమును ప్రస్తుతం రూ.300కి తగ్గించింది. ధాన్యం లారీల నుంచి ఫీజు వసూలు చేయడం ఇటీవల తీవ్ర వివాదానికి దారి తీయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లోని కొన్ని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించే లారీలు తరచుగా కవ్వాల్, అమ్రాబాద్ టైగర్‌రిజర్వుల మీదుగా వెళ్తుంటాయి. >>2

## పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు

### కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే లక్ష్యం

### 4590 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేత

### ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు: డి.సిఎం భట్టి



సోమవారం చింతకాని మండలం సభలో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**చింతకాని, ప్రభాత వార్త జూలై 14:** రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మా బాధ్యతని .. ఆ క్రమంలో మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు రాష్ట్ర డిప్యూటి సిఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు సోమవారం చింతకాని మండల కేంద్రంలో రాష్ట్ర సెర్ప్ సిఇఒ డి. దివ్య, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లతో కలిసి మధిర నియోజకవర్గం స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్‌భీమా, ప్రమాద భీమా చెక్కులు, మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడం కోసం ప్రభుత్వం రెండు కీలక నిర్ణయాలు తీసుకుందని, ఇండ్లు లేని నిరుపేదలు ఉండటానికి వీలు లేదని, ప్రభుత్వ సహకారంతో ప్రతి పేద వాడికి ఇండ్లు ఉండాలని ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం చేపట్టిందని అన్నారు... గత పాలకుల హయాంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాదయాత్రలో ఇండ్లులేక భయాందోళనలతో గడిపిన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 4 లక్షల 50 వేల ఇండ్లు 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రతివారం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు విడుదల చేస్తుందని ఎక్కడా కూడా నిధుల సమస్య లేదని అన్నారు... గ్రామ పెద్దలను పిలిచి వారి సమక్షంలో పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ >>2

## అంతరిక్షం నుండి నేడు భూమిపైకి శుక్లా

### మిగిలిన వ్యోమగాములతో కాలిఫోర్నియాకు రాక

### వ్యోమనౌక అన్‌డాకింగ్ సక్సెస్



**న్యూయార్క్,జూలై 14:** యాక్సి ఎం-4 మిషన్‌కింద అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశుశుక్లా మరో ముగ్గురు వ్యోమగాములు మరికొన్ని గంటల్లోనే భూమికి చేరుకోనున్నారు. అంతరిక్ష కేంద్రంతో శుభాంశుబృందాన్ని తీసుకువస్తున్న డ్రాగన్ వ్యోమ నౌక అన్‌డాకింగ్ ప్రక్రియ విజయవంతం అయింది. పలు కసరత్తుల అనంతరం >>2



## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

### హార్యానా: ఆషిమ్ కుమార్ ఘోష్

### లడఖ్ : కవీందర్ గుప్తా

### రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ జులై 14:** మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. గోవా గవర్నర్‌గా టిడిపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజును నియమించారు. హరియాణా గవర్నర్‌గా ఆషిమ్ కుమార్ ఘోష్ నియమితుల య్యారు. లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మిశ్రా రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో కవీందర్ గుప్తాను నియమించారు. జమ్ముకాశ్మీర్ మాజీ డిప్యూటీ సిఎంగా పనిచేసిన కవీందర్‌కు గవర్నర్ పదవి వరించింది. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. వారు బాధ్యతలు స్వీకరించిన తేదీల నుంచే ఈ నియామకాలు అమలులోకి వస్తాయని ప్రకటనలో పేర్కొంది. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, తెలుగు రాష్ట్రాల్లోని సీనియర్ రాజకీయ నేతల్లో అశోక్ గజపతిరాజు ఒకరు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా ఆయన విజయం సాధించారు. 1978లో తొలిసారి జనతా పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన అశోక్, >>2

## ఆ విమానంలో యాంత్రిక సమస్యల్లేవ్..

### • పైలట్లు ఇద్దరూ బ్రీత్ అనలైజర్ పరీక్షలో పాసయ్యారు.. • ఎయిరిండియా సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ • ఊహాగానాలు నమ్మవద్దని విన్నపం



ఎయిరిండియా సిఇఒ కాంప్‌బెల్ విల్సన్

**న్యూఢిల్లీ,జూలై 14:** ఎయిర్‌ఇండియా విమాన ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికలో ఇంజిన్ లేదా ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎలాంటి యాంత్రిక, నిర్వహణ సమస్యలు లేవని ఎయిరిండియా సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. ఇంధన నాణ్యతలో ఎటువంటి సమస్య లేదనీ టేకాఫ్ రోల్‌లో ఎటువంటి అసాధారణత లేదని చెప్పారు. పైలట్లు వారి తప్పనిసరి ప్రీఫ్లైట్ బ్రీత్ అనలైజర్‌లో ఉత్తీర్ణులయ్యారనీ, వారి వైద్య స్థితికి సంబంధించి ఎటువంటి సందేహాలు లేవని పేర్కొన్నారు. ఎయిరిండియా ఉద్యోగులను రాసిన ఓ లేఖలో కాంప్‌బెల్ విల్సన్ ఈ విషయాన్ని పేర్కొన్నారు. తుది నివేదిక సమర్పించే వరకు అనేక కొత్త ఊహాగానాలు వస్తూనే ఉంటాయని చెప్పుకొచ్చారు. గత 30 రోజులుగా అనేక ఆరోపణలు, పుకార్లు వ్యాపించాయని తెలిపారు. విమాన ఘటనకు సంబంధించి జరిగిన తప్పుడు ప్రచారాన్ని తోసిపుచ్చారు. మరణించినవారి కుటుంబాలకు, గాయపడిన వారికి అండగా ఉండడంతో పాటు వినియోగదారులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందిచడమే తమ లక్ష్యమని తెలిపారు. సమగ్రమైన విచారణ కోసం దర్యాప్తు సంస్థలతో ఎయిర్‌ఇండియా సహకరిస్తుందని తెలిపారు. ఎయిర్‌ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించి ఇటీవల ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో 15 పేజీల ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్, మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఎఎఐబి తెలిపింది. మరోవైపు అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా విమాన పైలట్లపై వస్తున్న వార్తలపై ఇండియన్ కమర్షియల్ >>2



## కెసిఆర్‌తో కెటిఆర్, హరీష్ భేటీ

### తాజా పరిణామాలపై చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై14:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును నందినగర్ నివాసంలో మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు సోమవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. తాజా రాజకీయ >>2



సోమవారం తుంగతుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు

# రణానికి సిద్ధంకండి

>> సంఘాలకు 21 వేల కోట్ల రూపాయల రుణ సౌకర్యం కల్పించామన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఆర్థిక పరిపుష్టి సాధించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నాం. 21 వేల కోట్ల రూపాయలు వెచ్చించి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశాం. తొమ్మిది రోజుల్లో 9,000 కోట్ల రూపాయలు రైతు భరోసా పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేశాం. సంక్షేమ పథకాల అమలు ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యపడుతుందని నిరూపించాం. గత వానాకాలం, యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చి దేశంలో నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. సన్న బియ్యం పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు.

కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, మూసి ప్రాజెక్టులు పటిష్టంగా ఉన్నాయి. చెక్కుచెదరలేదు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మూడు సంవత్సరాలకే కూలేశ్వరంఅయింది. లక్షకోట్లతో నిర్మించిన ప్రాజెక్టు రైతులకు ప్రయోజనాన్ని ఇవ్వడం లేదు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం. ఎస్సీ వర్గీకరణ బిల్లు శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. కులగణన చేసిన రాష్ట్రంగా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. నిరుపేదలు రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని ఆలోచించాం. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని నిర్ణయించి కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టాం. రేషన్ కార్డులు పేదలకు ఆయుధం లాంటిదని అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వక ఇబ్బందులు ఎదుర్కొన్న పేదలను ఆదుకునేందుకు కొత్తగా రేషన్ కార్డులో అందజేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవినీతిని ప్రజలంతా గమనిస్తున్నారని సమర్థించుకునేందుకు భారత రాష్ట్ర సమితి నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు. తప్పుడు మాటలు మాట్లాడుతున్న వారిని ప్రాజెక్టు వద్దే ఉరితీయాలి అన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా అని భారత రాష్ట్ర సమితి నాయకులకు ముఖ్యమంత్రి సవాల్ విసిరారు.

2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందని, వరుసగా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరుగుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గంజాయి లాంటి కలుపు మొక్క అయినా భారత రాష్ట్ర సమితిని స్థానిక సంస్థల ఎన్నికల్లో మట్టి కరిపించాలన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజాప్రతినిధులుగా గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పార్టీ శ్రేణులను కాపాడుకుంటూ కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. 4 ఎమ్మెల్సీ స్థానాలకు గాను మూడు ఎమ్మెల్సీ లు నల్లగొండ జిల్లాకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇద్దరు సీనియర్ మంత్రులు, 11 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ తరఫున ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ నల్లగొండ కాంగ్రెస్కు కంచుకోట అని అన్నారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ అవినీతి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ప్రాజెక్టుల అవినీతిలో చోటు చేసుకున్న అంశాలపై చర్చించేందుకు తాను ఎప్పుడు సిద్ధమేనని ఆ పార్టీ నేతలకు సవాల్ విసిరారు. తెలంగాణలో కొత్తగా 3.5 8 లక్షల రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. తెలంగాణలో 95.5 6 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారన్నారు. పేదవారి ఆకలిని తీర్చే గొప్ప ఆయుధం రేషన్ కార్డులు అని అన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో వర్షం వచ్చినప్పటికీ కరెంటు లేకపోయినా సెల్ ఫోన్ లైట్లతో సభలో పాల్గొన్న తుంగతుర్తి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సభకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షత వహించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నేడు పండుగ రోజు అని పేర్కొన్నారు. సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయడము పేదలకు వరం లాంటిది అన్నారు. ఐదు లక్షల 61 వేల మందికి కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు పేదల ఆకలి తీరుస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డులలో కొత్త పేర్లు చేర్చే అవకాశాన్ని కూడా కల్పించిన ఘనత కాంగ్రెస్‌కు దక్కిందన్నారు. గడచిన వానాకాలం, యాసంగి సీజన్లో 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం పండించినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండల చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, అద్దంకి దయాకర్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మురళి నాయక్, బాలు నాయక్, వేముల వీరేశం, అధికారులు తదితరులు పాల్గొన్నారు. 5.30 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. 3.75 కోట్ల ఖర్చుతో నాగారంలో తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులకు, నాలుగు కోట్లతో నాగారంలో మండల పరిషత్తు భవన నిర్మాణ పనులకు, 3.50 కోట్ల రూపాయల ఖర్చుతో నాగారంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వెలుగు పల్లిలో పదివేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాముల నిర్మాణానికి గాను శంకుస్థాపన చేశారు.1170.00 లక్షల వ్యయంతో ఈ గోదామును నిర్మిస్తున్నారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.



సోమవారం బెంగళూరులో మహిళలకు ఉచిత బస్ టిక్కెట్లు పంపిణీ చేస్తున్న కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డి.సిఎం శివకుమార్

# జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

>> ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. ఇదిలా ఉండగా, అపరేష్ కుమార్ సింగ్ (ఎకె సింగ్) 1965, జులై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. అనంతరం 1990 నుంచి 2000 వరకూ ఉత్తర్ ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకూ జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి సాధించారు. కాగా, తాజాగా తెలంగాణ హైకోర్టు సిజెగా నియమితులయ్యారు. ప్రస్తుతం జార్కండ్ హైకోర్టు సిజెగా ఉన్న జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావును త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ కెఆర్ శ్రీరామ్‌ను రాజస్థాన్ హైకోర్టు సిజెగా బదలీ చేశారు. రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాత్సవను మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదలీ చేశారు. మరోవైపు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఎపి హైకోర్టుకు బదలీ చేశారు. గతంలోనూ ఆయన ఎపి హైకోర్టు జడ్జిగా పనిచేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదలీ చేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక సిజెగా ఉన్న జస్టిస్ సంజీవ్ సచ్‌దేవకు పదోన్నతి కల్పించి అదే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ విభుభక్రును పదోన్నతి కల్పించి కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియామకం చేశారు. పాట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అశుతోష్ కుమార్‌కు పదోన్నతి కల్పించి గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియామకం చేశారు. పట్నాహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలికి పదోన్నతి కల్పించి అదే రాష్ట్ర హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లోక్ సింగ్ చౌహాన్‌కు పదోన్నతి కల్పించి జర్కాండ్ హైకోర్టు సిజెగా నియమించారు.

# రేవంత్, చంద్రబాబు రేపు భేటీ

>> చారు. ఈ మేరకు సిఎం సూచనలతో కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ లేఖ రాశారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు, కృష్ణా, గోదావరి బేసిన్‌లలో సమస్యలపై వెంటనే చొరవ చూపాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. రాష్ట్రానికి రావాల్సిన జలాల సద్వినియోగానికి, కృష్ణా, గోదావరి జలాల సద్వినియోగానికి ఒత్తిడి పెంచాలని సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా నదిపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థికసాయంపై కేంద్రాన్ని కోరనున్నామని సిఎం తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలు పరిరక్షించుకోవాలి అని తెలిపారు. గతంలో అన్యాయానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలని సిఎం చెప్పిన విషయం తెలిసిందే. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ భేటీలో రాష్ట్ర నీటి వాటాల సాధనకు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు, పట్టుబట్టాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు.

**నేడు ఢిల్లీ వెళ్లనున్న ఎపి సిఎం చంద్రబాబు**

ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీకి చేరుకోనున్నారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్,సిఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు తిరిగి విజయవాడకు చంద్రబాబు చేరుకోనున్నారు.

# ఆగస్టులో?

>> వరకు పూర్తయిన పనులపై సిఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారని, వచ్చే శాసనమండలి సమావేశాలు పాత భవనంలోనే నిర్వహించాలని సిఎం ఆదేశించారని వివరించారు. పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా, వేగం పెంచాలని, వచ్చేనెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

## దక్షిణ మధ్య రైల్వే అదనపు జిఎంగా సత్య ప్రకాష్

**గుంతకల్లు రైల్వే, జులై 14,ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా భారతీయ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్ క్యాడర్‌కు చెందిన సత్యప్రకాష్‌ను,నిర్మాణాల విభాగం ముఖ్యపరిపాలన అధికారిగా యం రణదీర్‌రెడ్డిలను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే సోమవారం ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం అదనపు జీఎంగాపనిచేస్తున్న నీరజ్ అగర్వాల్ ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్నారు.

# బి. సరోజాదేవి ఇక లేరు

>> ఆమె మొదటిసారిగా శ్రీరామ పూజాచిత్రంతో రంగప్రవేశంచేసారు. మహాకవి కాళిదాస చిత్రంతో ప్రాచుర్యం పొందారు. కన్నడభాషలోని మొట్టమొదటి రంగుల చిత్రం అమరశిల్పి జకనాచారిలో హీరోయిన్‌పాత్రను పోషించి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే స్వాతంత్ర్య సమరయోదుడు కిట్టూర్ రాణి చెన్నమ్మ పాత్రపోషించి శక్తివంతమైన హీరోయిన్‌గా నిలిచారు. తమిళంలో సరోజాదేవి జగమెరిగిన నటిగా గుర్తింపుపొందారు.ఎంజి రామచంద్రన్‌తో 26 చిత్రాల్లో నటించారు. అలాగే శివాజీ గణేశన్, జెమిని గణేశన్‌లతోకూడా అనేక చిత్రాల్లో ఆమె కీలకపాత్రలుపోషించారు. ఇక తెలుగు భాషాపరంగాచూస్తే అక్కినేని నాగేశ్వరరావు,ఎన్టీరామారావులతో అనేక సినిమాల్లో కలిసి పనిచేసారు. దిలీప్‌కుమార్, రాజేంద్రకుమార్, షమ్మికపూర్, సునీల్‌దత్ వంటి ప్రముఖ హిందీనటులతో కలిసి నటించిన సరోజాదేవి మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటు అని ఆమె అభిమానులు పేర్కొంటున్నారు. చలనచిత్ర నటనా రంగంలోసరిహద్దులు చెరిపేసిన చతుర్భాషా నటిగా ఆమెకు బిరుదు లభించింది. 1967లో శ్రీహర్షను వివాహంచేసుకున్నారు. ఆయన 1986లో చనిపోయారు.ఆమెకు ఇద్దరు పిల్లలు. భారత ప్రభుత్వంనుంచి 1969లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. వొక్కలింగ కుటుంబంలో నాలుగో కుమార్తెగా ఆమె జనినమంచారు. మైసూర్‌పోలీస్ అధికారి భైరప్ప,రుద్రమ్మలకు ఆమె జన్మించారు.

# ఫారెస్ట్ ఫీజు తగ్గింపు

>> ఈ ప్రాంతాల్లో లారీల నుంచి ఫీజు వసూలు చేయడం మంచిర్యాల జిల్లాలో పెద్ద వివాదంగా మారింది. దీంతో జిల్లా యంత్రాంగం అటవీ శాఖకు లేఖ రాసి.. ధాన్యం తరలించే వాహనాలకు పర్యావరణ రుసుం వసూలు చేయొద్దని కోరింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో గిరిజన రైతులు అధికంగా ఉండటంతో ధాన్యం తరలింపు లారీల నుంచి ఫీజు వసూలు చేస్తున్న ఫారెస్ట్ డిపార్ట్ మెంట్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మంచిర్యాల జిల్లాలో పోలీసులకు ఫిర్యాదు కూడా అందినట్లు తెలుస్తోంది. ఫారెస్ట్ అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం.. ఫారెస్ట్ యాక్టులు, టైగర్ రిజర్వు నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నామని అన్నారు. టైగర్ రిజర్వుల్లో పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణ ముఖ్యమని.. అడవిలో తిరిగే వాహనాలతో వాటి ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని అంటున్నారు. అందుకే వేగ నియంత్రణ, భారీ వాహనాల రాకపోకలపై నిషేధం అమలులో ఉందని చెప్పారు. ఎన్టీసీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) నిబంధనల ప్రకారం టైగర్ రిజర్వుల్లోకి లారీలు, భారీ వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు. రైతుల ధాన్యం తీసుకెళ్తున్నాయన్న ఉద్దేశంతోనే రెండు నెలలుఅనుమతి ఇస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ రహదారుల మీదుగా వెళ్లే ధాన్యం లారీలకు టోల్‌ప్లాజాల వద్ద టోల్ ఫీజు చెల్లించడం లేదా అని ఫారెస్ట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇతర వాహనాలకూపర్యావరణ ఫీజును వసూలు చేస్తున్నామని.. ఇలా వచ్చే మొత్తం టైగర్ రిజర్వు ఫండ్‌కు వెళుతుందని స్పష్టం చేశారు. పులుల సంరక్షణకు ఈ నిధులు కీలకమని ఫారెస్ట్ అధికారులు తెలియజేశారు.

# భూమిపైకి శుక్లా

>> భూవాతావరణంలోకి ప్రవేశిస్తున్నది. ఈ వ్యోమనౌక 21 గంటలు ప్రయాణించి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సముద్రజలాల్లో దిగుతుంది. అనంతరం వారిని అక్కడినుంచి క్వారంటైన్‌కు తరలిస్తారు. సుమారు వారంరోజులపాటు వ్యోమగాములు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలోనే ఉంటారు. యాక్సియం-4 మిషన్‌లోభాగంగా శుభాంశు బృందంగత నెల 25న నింగిలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. 28 గంటలప్రయాణం తర్వాత ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. సుమారు 18 రోజులపాటు ప్రయోగాలుచేసిన ఈబృందం మంగళవారం భూమికి చేరుతోంది. ఖగోళంలోని జీరోగ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగేనష్టంపై శుక్లా అధ్యయనంచేసారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక విడియోను భారత విద్యార్థులకోసం రూపొందించారు. మానసిక ఆరోగ్యంపైనే పలు అధ్యయనాలు చేసారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులివ్వండి

## కేంద్ర జలశక్తి మంత్రికి మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, జులై 14,ప్రభాతవార్త:** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని కృష్ణానదిలో జిడబ్ల్యుడిటి అవార్డుకు అనుగుణంగా 45 టిఎంసిల నీరు వాడుకోవడానికి పర్యావర్ణశాఖ సిసి. ఇసి జారీచేయాలని డిమాండ్ చేస్తూ కేంద్రజలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్‌కు రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు.పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు ఇప్పటికీ క్లియరెన్స్ రాలేదు. ఈ ప్రాజెక్టులకు ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ వస్తే కేంద్రం నుంచి గ్రాంట్లు, ఆర్థిక సాయంతో పాటు నాబార్డ్ లాంటి ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీతో రుణాలు పొందే వీలుంటుంది. 2021 సెప్టెంబర్ 21న కేంద్ర జలసంఘానికి సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ డిపిఆర్ సమర్పించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి నోఆబ్జెక్షన్ లేనందున ఇంటర్‌స్టేట్ మ్యాటర్స్ డైరెక్టరేట్ నుంచి క్లియరెన్స్ ఆలస్యమవుతోంది. ఛత్తీస్‌గఢ్ సూచనలను, నిబంధనల ప్రకారం అక్కడి భూ యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు.

ముంపు విషయంలో ఖరగ్పూర్ ఐఐటీ ఇచ్చిన నివేదిక లోని సిఫారసులను పాటించేందుకు సిద్ధంగా ఉంది. కృష్ణా బేసిన్లో శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు అవశేష ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటి మళ్ళింపును అడ్డుకోవాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి +880 అడుగుల వద్ద 1.5 లక్షల క్యూసెక్స్ కంటే ఎక్కువ సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లిస్తోంది. ఏకంగా 841 అడుగుల నుంచి రోజుకు 8 టిఎంసి ల నీటిని మళ్లించేలా ఆంధ్రప్రదేశ్ కాల్వల నిర్మాణాలు చేపట్టింది. 797 అడుగుల వద్ద రోజుకు 3 టిఎంసిలు తీసుకెళ్లే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తో పాటు ముచ్చుమర్రి, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మించింది. కృష్ణా నది నుంచి వరద నీటిని బేసిన్ వెలుపల ప్రాంతాలకు డైవర్ట్ చేస్తుంది. శ్రీశైలం అట్టడుగు నుంచి నీటిని డైవర్ట్ చేసే నిర్మాణాలతో రిజర్వాయర్ ఖాళీ అవుతోంది.

శ్రీశైలం, నాగార్జునసాగర్ మీద ఆధారపడ్డ జల విద్యుత్తు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. రోజుకు 10 టిఎంసి ల చొప్పున 20 రోజులలో 200 టీఎంసీలు డైవర్ట్ చేసే సామర్థ్యముండటంతో తెలంగాణలోని ఇన్‌బేసిన్ అవసరాలకు విఘాతం కలుగుతోంది.

నీటి ప్రవాహాలను ఖచ్చితంగా లెక్కించేందుకు టెలిమెట్రీ అమలు చేయాలి. తుంగభద్ర నుండి అవార్డు అనుగుణంగా ప్రవాహాలు కృష్ణా నదికి రావాల్సిఉన్నా రాకుండా ఎపి అడ్డుకొంటుందని ఉత్తమ్ ఆరోపించారు. .శ్రీశైలం రిజర్వాయర్ అడుగు నుంచి (+797 అడుగుల వద్ద) రోజుకు 3 టిఎంసిల నీటిని అవతల బేసిన్కు లిఫ్ట్ చేసేలా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ను ఏపీ ప్రభుత్వం చేపట్టింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఇచ్చినా పనులు కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభమయ్యే ముందు పూర్వ స్థితికి పునరుద్ధరించమని ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా చూడాలి. శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ డిశ్చార్జ్ కెపాసిటీని అనధికారికంగా పెంచుకుంది. 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకుంది. 44 వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న ఈ కెనాల్ కు ఇటీవల 89 వేల క్యూసెక్కులకు పెంచుకుంది. శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ప్రమాదకరంగా మారింది. ఆదిలాబాద్లో తుమ్మిడిహెట్టి నుంచి 160 టీఎంసీల నీటిని 7 ఉమ్మడి జిల్లాలలో 16.40 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించింది. 2010లోనే కేంద్ర జలసంఘం ఈ ప్రాజెక్టుకు అనుమతించింది. 2016లో తెలంగాణ, మహారాష్ట్ర మధ్య ఒప్పందం కుదిరింది. ఇప్పుడున్న 20 టీఎంసీల కేటాయింపులను 80 టిఎంసిపెంచాలి.

గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల వాటాలో నుంచి 80 టీఎంసీలు ఈ ప్రాజెక్టుకు సర్దుబాటు చేయాలి. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఏఐబీపీ కింద ఆర్థిక సాయం అందించాలి. జాతీయ నదుల అనుసంధాన ప్రణాళికలో భాగంగా ఇచ్చంపల్లి కావేరి లింక్ కెనాల్ ప్రతిపాదనలున్నాయి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి 148 టీఎంసీల నీటి బదిలీలో 50 శాతం తెలంగాణకు ఇవ్వాలని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ 2024 మార్చిలో లేఖ రాసింది. గోదావరి బేసిన్ నుండి ఇతర బేసిన్‌లకు నీటిని బదిలీ చేసే విషయంపై చర్చలు జరగాల్సిన అవసరముంది.తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అవసరాలు తీర్చేందుకు 200 టీఎంసీల వరద నీటిని ఉపయోగించుకునేలా ఇచ్చంపల్లి వద్ద కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించాలి. గోదావరిపై పోలవరం, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు చేపట్టమని జిడబ్ల్యుడిటి పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు సమకూర్చుతున్నందున, అంతే సమానంగా ఇచ్చంపల్లి ప్రాజెక్ట్‌కు కేంద్రం నిధులు సమకూర్చాలని ఆయన కోరారు.

## వారం - వర్జ్యం

15-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
పంచమి రా.10.37
శతభిషం ఉ.6.26
వర్జ్యం : మ.12.38-2.12
దు.ఉ.9.19-9.11, రా.11.57-12.49
శుభసమయం:ఉ.7.30-8.30, సా.6.45-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు ఎదుర్కొవలసి వుంటుంది. అంతర్గత శత్రువులు అధికమై సమస్యలు సృష్టించవచ్చు.

**వృషభం :** ఎంత శ్రమించినా ఫలితం అంతంత మాత్రంగా వుంటుంది. రుణ వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలు ఆలోచించి చేపట్టడం అన్ని విధాల మంచిది. ఆరోగ్యం విషయాలలో నిర్లక్ష్యం తగదు.

**కర్కాటకం:** అనుకున్న పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**సింహం:** కీలక నిర్ణయాలలో నిదానంగా వ్యవహరించడం మంచిది, తొందరపాటు తగదు.

**కన్య :** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కొత్త విద్యల పట్ల ఆసక్తి చూపుతారు.

**తుల :** దీర్ఘకాలిక రుణాలు తీరి ఊరట చెందుతారు. ఇంటా బయటా మీదే పై చేయిగా వుంటుంది.

**వృశ్చికం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు. ధనలాభాలు.

**ధనుస్సు:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. రెండు, మూడు విధాలుగా డబ్బు అందుతుంది.

**మకరం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు. ఆరోగ్యంపట్ల మెలకువ అవసరం.

**మీనం :** సన్నిహితులు నుండి సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కో.ని. హైదరాబాద్

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

>> ఆ తర్వాత టిడిపిలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు. టిడిపి తరఫున విజయం సాధించారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి జయకేతనం ఎగురవేసి కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో అశోక్‌గజపతిరాజు పలు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్టీఆర్ హయాంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మంత్రిగా, చంద్రబాబు హయాంలో ఆర్థిక, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. చాలా కాలంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. మరోవైపు గవర్నర్‌గా బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. 2019 నుంచి 2025 వరకు ఆయన గవర్నర్‌గా పనిచేశారు. 2019లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియామకమైన ఆయన, ఏడాదిన్నరపాటు సేవలు అందించారు. అనంతరం హరియాణా గవర్నర్‌గా దత్తాత్రేయ నియామకమయ్యారు. అక్కడ దాదాపు నాలుగేళ్లపాటు సేవలందించించారు. ఇక పశ్చిమబెంగాల్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఆశిమ్‌కుమార్‌ఘోష్‌ను హర్యానా కొత్తగవర్నర్‌గా నియమించారు. బెంగాల్ చీఫ్‌గా 1999నుంచి 2002వరకూ పనిచేసిన ఘోష్ పార్టీ బలోపేతానికి కృషిచేసారు. ఇపుడు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ స్థానంలో ఆయన నియమితులయ్యారు. అలాగే లడక్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయిన కవీంద్రగుప్తా జమ్ముకాశ్మీర్‌లో డిప్యూటీ సిఎంగాను, స్పీకర్‌గా కూడా పనిచేసారు. జమ్ములోని జానిపూర్ గ్రామానికి చెందిన 66 ఏళ్ల గుప్తా జమ్ము మేయర్‌గా మూడుసార్లు పనిచేసారు. బిజెపి జాతీయ కమిటీలో సభ్యుడుగా కూడా కొనసాగుతున్నారు. ప్రస్తుత గవర్నర్ బిడి మిశ్రా స్థానంలో ఆయన నియమితులయ్యారు.

# ఆ విమానంలో యాంత్రిక సమస్యల్లేవ్..

>> పైలట్స్ అసోసియేషన్ స్పందించింది. తాము తీసుకున్న శిక్షణకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించారని స్పష్టం చేసింది. సవాళ్ల సమయంలోనూ వారు సరిగానే వ్యవహరించారని, ఊహాగానాలతో వారిపై నిందలు వేయొద్దని అభిప్రాయపడింది. తుది నివేదిక వచ్చే వరకూ ఎటువంటి ఊహాగానాలను అంగీకరించబోమని చెప్పింది. అలాంటి ప్రచారాన్ని ఖండించాల్సిందేనని ఐసిపిఎ స్పష్టం చేసింది. విమానంలోని పైలట్ ఒకరు ఆత్మహత్యకు పాల్పడటంవల్లే ప్రమాదం జరిగిందని కొందరు చేస్తున్న ఆరోపణలను తప్పుబట్టింది. వీరితో పాటు ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్‌పీఏ) కూడా స్పందించింది. ఎయిర్‌ఇండియా విమాన ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తులో తాము భాగం కావాలని కోరుకుంటున్నామని వెల్లడించింది. అందుకుగల చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నామని వివరించింది. ఇదే అంశంపై విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఎఎఐబి) మాజీ అధిపతి అరబిందో హాండా కీలక వ్యాఖ్యలు చేశారు. అహ్మదాబాద్‌లో ఎయిర్‌ఇండియా విమాన ప్రమాదం మీద వచ్చిన ప్రాథమిక దర్యాప్తు నివేదికతోనే పైలట్ల పాత్రపై నిర్ధారణకు రావడం తొందరపాటే అవుతుందని తెలిపారు. తుది నివేదిక మాత్రమే కచ్చితమైన కారణాన్ని వెల్లడించగలదని అభిప్రాయపడ్డారు. దర్యాప్తును పారదర్శకంగా, పక్షపాతం లేకుండా పూర్తి చేయడానికి ఎఎఐబిని అనుమతించాలని సూచించారు. ఎఎఐబిలో ఉన్నప్పుడు 100కుపైగా విమాన ప్రమాదాలపై దర్యాప్తును నిర్వహించారు.

# కెసిఆర్‌తో కెటిఆర్, హరీష్ భేటీ

>> పరిణామాలపై కెసిఆర్‌తో కెటిఆర్, హరీష్‌రావు చర్చించారు. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా.. ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, కల్వకుంట్ల కవిత మధ్య రాజకీయంగా వైరం నడుస్తోంది. సంగారెడ్డిలో జరిగిన బిసిల ఆత్మీయ సమావేశంలో ఇటీవల మల్లన్న పాల్గొన్నారు. ఆ సభలో కవితపై మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారు. బిసిలతో కవితకు ఏం సబంధమని ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్‌లపై రేవంత్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువస్తే కవితసంబురాలు ఎందుకు చేసుకుంటుందని నిలదీశారు. ఈక్రమంలో ఆదివారం మల్లన్నకి సంబంధించిన క్యూ న్యూస్ మీడియా కార్యాలయంపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడి చేశారు. కవితపై మల్లన్న మాట్లాడిన మాటలను ఖండిస్తూ ఈ దాడిచేశామని, మల్లన్న వెంటనే కవితకు క్షమాపణలు చెప్పాలనిజాగృతి కార్యకర్తలు డిమాండ్‌చేశారు. అయితే ఈ దాడిని అడ్డుకోవడానికి మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో జాగృతి కార్యకర్తకి గాయాలయ్యాయి. ఆ తర్వాత కవిత, మల్లన్నలు పోటాపోటీగా ఆరోపణలు చేసుకున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కవిత కలిశారు. ఎమ్మెల్సీగా మల్లన్నని సస్పెండ్ చేయాలని కోరారు. కాగా, సోమవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని తీన్మార్ మల్లన్న కలిసి కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని వినతిపత్ర అందజేశారు.

## అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన సిజెఐ గవాయ్



**న్యూఢిల్లీ, జూలై 14:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ అస్వస్థతకు గురయ్యారు. ఇన్ఫెక్షన్ వల్ల ఆయన ఆస్పత్రిలో చేరారు. ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స జరుగుతోంది. ట్రీట్‌మెంట్‌కు ఆయన స్పందిస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. శనివారం ఆయన హైదరాబాద్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. నల్సార్ న్యాయవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవం లో ఆయన పాల్గొన్నారు. ఒకటి లేదా రెండు రోజుల్లో ఆయన కోలుకునే అవకాశం ఉన్నట్లు అధికారి తెలిపారు. ఈ నెల 12న సీజేఐ హైదరాబాద్ వచ్చారు. హైదరాబాద్ పర్యటనలో సిజె భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ అనే అంశంపై జస్టిస్ గవాయ్ ప్రసంగం చేసారు. డా.బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగశిల్పి భారత రాజ్యాంగం పేరిట పోస్టల్ కవర్ కూడా విడుదల చేసారు.

## ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీగా వెంకటేశ్వరబాబు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో అడిషనల్ ఎస్పీగా వెంకటేశ్వరబాబు సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టులో పనిచేసిన భాస్కర్ పదవీవిరమణ పొందారు. ఖాళీగా ఉన్న ఈ పోస్టులోకి మెదక్ ఇంటెలిజెన్స్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న వెంకటేష్‌బాబు ఎక్సైజ్‌శాఖలోకి వచ్చారు. పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్‌ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీంను, అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ల డీఎస్పీలు తుల శ్రీనివాసరావు, తిరుపతియాదవ్, సీఐ వెంకటేశ్వర్లు, నాగరాజులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుతో బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్ భేటీ

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సోమవారం బేగంపేట టూరిజం ప్లాజాలో ప్రముఖ బాలీవుడ్ నటుడు, జీ టీవీ రామాయణంలో రాముడి పాత్రధారి, బుద్దిజం ప్రచారకులు గగన్‌మాలిక్ మర్యాదపూర్వకంగా కలిశారు. గగన్‌మాలిక్‌ను బుద్ధవనం ప్రాజెక్ట్‌స్పెషల్ ఆఫీసర్‌గా మల్లేపల్లి లక్ష్మయ్య.. మంత్రి జూపల్లికి పరిచయం చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచ దేశాల్లో ప్రాచుర్యం కల్పించడం, వివిధ బౌద్ధదేశాలను బుద్ధ వనానికి రప్పించడం, వారి సాంస్కృతిక కేంద్రాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయడంతో పాటు ఈ యేడాది అక్టోబర్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన బౌద్ధభిక్షువులు సుమారు 100 మందితో గుల్బర్గా మీదుగా బుద్ధవనానికి పాదయాత్రగా రావడం తదితర అంశాలను చర్చించారు.

## సహజనటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన సరోజాదేవి

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటి బి.సరోజాదేవి సహజ నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవారని ఆమె మృతి సినిమా రంగానికి ఎంతోలోటని పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. ప్రముఖ సినీనటి, పద్మభూషణ్ పురస్కారగ్రహీత బి.సరోజాదేవి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో తన సహజనటనతో కోట్లాది ప్రేక్షకుల అభిమానం చూరగొన్నారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. సరోజాదేవి కుటుంబసభ్యులకు, ఆమె అభిమానులకు సర్వశక్తిమంతుడైన దేవుడు విషాదసమయంలో వారి మనోధైర్యం పెంచేందుకు తోడ్పాటు నివ్వాలని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ప్రగాఢ సంతాప సందేశంలో పేర్కొన్నారు. సరోజాదేవి భారత సినీరంగానికి అందించిన సేవలు చిరస్మరణీయ మని వివరించారు. ఆమె నటనకు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయని, ఆమె మృతి సినీలోకానికి తీరనిలోటని అభిప్రాయపడ్డారు.

## ఎఐసిసి బిసి సలహా సమావేశాలకు తెలంగాణ నుంచి ఏడుగురికి ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** ఎఐసిసి బిసి సలహా మండలి బెంగుళూరు సమావేశాలకు హాజరుకావడానికి తెలంగాణ నుంచి ఏడుగురు బిసి నాయకులను ఆహ్వానించారు. మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరితో పాటు పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వి.హనుమంతరావు ఎంపి అనిల్‌యాదవ్, మాజీ ఎంపి మధుయాష్కీలకు హాజరు కాబోతున్నారు. తెలంగాణలో జరిగిన కులగణనపై వివరించడంతో పాటు, రాబోయే రోజుల్లో విద్య, ఉద్యోగంతోపాటు అధికారంలో కూడా 42శాతం బిసిలకు వాటా ఇవ్వడానికి చేస్తున్న కృషిని వివరించనున్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ వీటిపై మాట్లాడుతారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య నాయకత్వంలో 24మందితో ఎఐసిసి ఓబిసి డిపార్టుమెంట్ సలహాకమిటిని వేశారు. పొన్నం ప్రభాకర్, మహేష్ కుమార్‌గౌడ్, హనుమంతరావులకు రాష్ట్రం నుంచిచోటు లభించింది. కొండా సురేఖ, వాకిటి శ్రీహరి అనిల్‌కుమార్, మధుయాష్కీలకు ప్రత్యేక ఆహ్వానితులుగా మిగితా వారికి అవకాశం కల్పించారు.

## కల్లు కంపౌండులపై ప్రత్యేక దాడులు..


### ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** కల్లు కంపౌండులు, కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. వారం రోజులు పాటు కల్లు అమ్మకాలు జరిగే కంపౌండులపై దాడులకు ఎస్‌టిఎఫ్ ( స్టేట్ టాస్క్ ఫోర్స్ టీమ్‌లు), ఏసీ ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌లు డిటిఎఫ్ ( డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు) దాడులు చేపట్టనున్నాయి. ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది కూడ కల్లు దుకాణాలపై నిఘా పెట్టి అకస్మీక దాడులు నిర్వహిస్తారని, ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ షానవాజ్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లు కంపౌండులపై నిరంతరం ఎక్సైజ్‌శాఖ దాడులు నిర్వహించి శాంపిల్స్ సేకరిస్తున్నారని, కల్తీకల్లుగా అని తేలితే వారిపై కేసులు నమోదులు చేస్తున్నారని ఆయన తెలిపారు. కూకట్‌పల్లి పరిధిలో జరిగిన కల్తీ కల్లు ఘటనను పురస్కరించుకొని మరోమారు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఎన్ని సొసైటీలు ఉన్నాయి. సొసైటిల పరిధిలో నడిచే కల్లు దుకాణాలు ఎన్ని? కల్లుదుకాణాల్లో అమ్మకాలు జరుపుతున్న కల్లు ఎక్కడి నుంచి వచ్చింది వంటి వివరాలే కాకుండా కల్లు అమ్మకాలు ఎక్కడ జరుపుతున్నారు అనే వివరాలను కూడా సేకరిస్తున్నారు. అమ్మకాలు జరుపుతున్న కల్లు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించడం చేయాలన్నారు. వీటితో పాటు అక్రమంగా ఉన్న కల్లు దుకాణాలను సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కల్లును అక్రమ రవాణ చేసిన, కల్తీ కల్లుగా తయారు చేస్తున్న కూడ వారిపై కఠినంగా వ్యవహించనున్నారు. లైసెన్స్‌లు లేని కల్లు దుకాణాలను సీజ్ చేయనున్నారు. కల్లు దందాల్లో సిండికేట్ వ్యవస్థను కూడ ట్రేస్ చేయాలనిదాడులు టీమ్‌లకు అదేశాలు ఇచ్చారు.

# తూర్పు ఇండొనేసియా ప్రాంతంలో భూకంపం

### రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.9గా నమోదు

**జకార్తా, జూలై 14:** ఇండోనేసియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.9గా నమోదైంది. అయినప్పటికీ ఎలాంటి సునామీ ముప్పు లేదని ఫసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, తూర్పు మలుకు ప్రావిన్స్‌లోని తువాలుకు పశ్చిమాన 177 కి.మీ దూరంలో 80 కిమీ లోతులో భూకంపం కేంద్రీకృతమైంది. పశ్చిమ ఇండోనేసియాలో మధ్యాహ్నం 12:49 గంటల సమయంలో భూకంపం సంభవించింది. దీని ఫలితంగా తూర్పు ఇండోనేసియాలోని అనేక చిన్న పట్టణాల్లో ప్రకంపనలు సంభవించాయని ఆ దేశ విపత్తు ఉపశమన సంస్థ (ఇండోనేషియా డిజాస్టర్ మిటిగేషన్ ఏజెన్సీ) తెలిపింది. మరోవైపు జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు ఇప్పటికే రంగంలోకి దిగి, సహాయక చర్యలు ప్రారంభించాయి. అనేక ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బ తిన్నాయని, నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



**రింగ్ ఆఫ్ ఫైర్**

సుమారు 27 కోట్ల జనాభా కలిగిన ఇండోనేషియా పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ అనే ప్రాంతంలో ఉంది. ఇది అత్యంత క్రియాశీల భూకంప కేంద్రాల జోన్. ఇక్కడ భూమి లోని క్రస్టులో వివిధ ప్లేట్లు కలుస్తాయి. కనుక ఇవి ఒకదానికొకటి ఢీకొనే టప్పుడు లేదా దూరంగా జరిగినప్పుడు భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇండోనేసియాలో 2004లో 9.1 తీవ్రతతో ఏర్పడిన భూకంపం వచ్చింది. దీని తరువాత హిందూ మహాసముద్రంలో వచ్చిన సునామీ అనేక దేశాల్లో తీవ్ర విషాదం నింపింది. ఒక్క ఇండోనేషియాలోనే ఈ సునామీ ధాటికి దాదాపు 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 2018లోనూ ఆ దేశంలోని పాలూ ప్రాంతంలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ తరువాత వచ్చిన సునామీ కారణంగా 2,200 మందికి పైగా మృతి చెందారు. ఇక 2021లో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంకా వేలాది మంది నిరాశ్రయులు అయ్యారు.

# బిసిల ఉద్యమాన్ని ఆపాలనే కవిత కుట్ర

### ఆమె ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయాలి

### శాసన మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డికి తీన్మార్ మల్లన్న ఫిర్యాదు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** దొరసానికి బిసిల భాష ఏం తెలుసని, చిల్లర పనులు మానుకోవాలని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న విమర్శించారు.. కవిత, ఆమె ప్రేరేపిత గూండాలు చేసిన అరాచకంపై సోమవారం శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశానని తెలిపారు. కవిత వాదంపై దాడి చేస్తోందని ఆక్షేపించారు. కవితకు అధికారం పోయినా అహంకారం తగ్గడం లేదని విమర్శించారు. బిసిల రిజర్వేషన్లు తగ్గించింది కెసిఆర్ కాదా అని తీన్మార్ మల్లన్న నిలదీశారు. బిసిల ఉద్యమాన్ని ఆపాలనే కవిత కుట్ర చేస్తున్నారని మల్లన్న ధ్వజమెత్తారు. కవిత సభ్యత్వాన్ని రద్దు చేయాలని చింతపండు నవీన్ డిమాండ్ చేశారు. తెలుగు పదాలు, వ్యాకరణ భాషపై తనకు పట్టు ఉందని ఏ పదాలు వాడాలి, ఏ పదం వాడకూడదనేది తనకు తెలుసునని వివరణ ఇచ్చుకున్నారు. 'కంచం పొత్తు మంచం పొత్తు' అంటే బిసిల భాషలో వియ్యం పొత్తు అనే అర్థం వస్తోందని గుర్తు చేశారు. వాళ్ల భాషలో 'మంచం పొత్తు' అంటే ఏమిటో తనకు తెలియదని విమర్శించారు. 2017 తెలుగు మహాసభల సందర్భంగా అప్పటి సిఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం ప్రచురించిన పుస్తకంలోనే 'మంచం పొత్తు, కంచం పొత్తు' అని ఉంటుందని పేర్కొన్నారని ఆ పుస్తకానికి ముందుమాట రాసింది ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ అని గుర్తు చేశారు. సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కవితపై విచారణ చేస్తామని గుత్తా సుఖేందర్‌రెడ్డి తనకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కవిత బిసి

# కల్తీకల్లు ఘటనలో పదికి చేరిన మృతులు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనలో సోమవారం తాజాగా మరొకరు మృతి చెందారు. ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 10కు చేరింది. కామారెడ్డికి చెందిన పుట్టి గంగామణి(41) హైదర్‌నగర్‌లో నివాసముంటున్నారు. కూలీనాలీ చేసుకునే ఆమె కల్తీకల్లు సేవించి అస్వస్థతకు గురి కావడంతో గాంధీ ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆమె స్వల్ప అనారోగ్యం తోడై ఆదివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల్లో 58వరకు చికిత్స పొందుతున్నారు. కల్తీకల్లుకు కారణమైన ఓ పార్టీనేత కూన సత్యం గౌడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నది తెలిసిందే. అదేవిధంగా ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను కూడా అరెస్టు చేశారు. వీరు హైదర్‌నగర్, ఎస్పీనగర్, ఇంగ్రానగర్‌లలో కల్లు దుకాణాలు నడిపిస్తున్నారు. ఈ మూడు దుకాణాల్లోని కల్లు శాంపిల్స్‌లో ఆల్ప్రాజోలం కలిపి నట్లు తేలింది. అయితే కల్తీకల్లు దందాపై చర్యలు తీసుకోకపోవడంతో బాలానగర్ ఎక్సైజ్ సీఐ డీ. వేణుకుమార్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. డీటీఎఫ్ నర్సిరెడ్డి, ఏఈ ఎస్‌లు మాధవయ్య, జీవన్‌కిరణ్, ఈఎస్ ఫయాజ్ తదితరులపై విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా మేడ్చల్ జిల్లా జీడిమెట్ల రామ్‌రెడ్డినగర్‌లో మరో కల్తీకల్లు ఘటన కలకలం సృష్టించింది. ఆదివారం జీడిమెట్లలో కల్లు తాగిన నిజామాబాద్‌కు చెందిన దంపతులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండటంతో సికింద్రాబాద్ గాంధీ దవాఖానాకు తరలించారు. చెట్టుకల్లు అలవాటు ఉండడంతో మందు కల్లు తాగడంతో ఇలా వ్యవహరిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# సిమి పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** నిషిద్ధ ఉగ్రవాద సంస్థ స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్ మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)కు సుప్రీం కోర్టులో చుక్కెదురయ్యింది. సిమిపై కేంద్రం మరో ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తూ గత ఏడాది జనవరిలో ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. దీనిని సిమి తరపు న్యాయవాదులు సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం సోమవారం నాడు డిస్మిస్ చేసింది. సిమిని కేంద్రం చట్టంలోని సెక్షన్ 3 (1) కింద చట్టవిరుద్ధ సంస్థ సంఘంగా పేర్కొనడం సబబేనని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా పేర్కొంది. సిమిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం ట్రిబ్యునల్ (యుఎపిఎ) గత ఏడాది జూలై 24వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను విచారించేందుకు న్యాయ మూర్తులు విక్రంనాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. సిమిపై 2024 జనవరి నెలలో ఐదేళ్ల పాటు నిషేధం పొడిగిస్తూ కేంద్రం నిర్ణయించడం తెలిసిందే. దీని తరువాత యుఎపిఎ ఏర్పాటయ్యింది. సిమిని నిషిద్ధ సంస్థగా ప్రకటించడానికి తగిన కారణం వుందా...? అనే దానిపై తీర్పు ఇవ్వడానికే దీనిని ఏర్పాటు చేశారు. ఈ ట్రిబ్యునల్ కూడా సిమిని నిషిద్ధ సంస్థగా పేర్కొంది. దీంతో సిమి తరపున కొందరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో సవాల్ చేయగా దీనిపై విచారించేందుకు ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. కాగా సిమిని 2001లో తొలిసారిగా నిషేధించారు. అప్పటి నుంచి ఈ నిషేధం కొనసాగుతూ నే వుంది. సిమి ఉగ్రవాదాన్ని పెంపొందించడంతో పాటు మత విద్వేషాన్ని పెంచి పోషి స్తోందని కేంద్రం ఇప్పటికే ప్రకటించింది.

# హైదరాబాద్‌లో అస్థిపంజరం లభ్యం



పాడుబడిన ఇంట్లో దొరికిన అస్థిపంజరం

### నెలల క్రితమే హత్య చేసినట్లు పోలీసుల అనుమానాలు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** నెలల క్రితమే హత్య చేసి కేవలం ఎము కలతో కూడిన అస్థిపంజరం సోమవారం హైదరాబాద్‌లో కలకలం రేపింది. నాంపల్లి లోని ఓ పాడుబడిన ఇంట్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీ సులకు సమాచారం అందించడంతో వెలుగు చూసింది. హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై దర్యాప్తు చేపట్టారు. బయట ఎక్కడో హత్య చేసి ఎవరికీ తెలియకుండా ఇక్కడ పడేసి ఉంటారని పోలీ సులు భావిస్తున్నారు. ఏడు ఏళ్లుగా సదరు ఇంటి ఓనర్ విదేశాల్లో ఉండ డంతో కలుపుమొక్కలు పెరగడంతో బయటకు కనిపించ కుండా ఉంటుంది. ఘటన స్థలిని సౌత్‌వెస్ట్‌జోన్ డిసిపి చంద్ర మోహన్‌ను సందర్శించారు. ఇది హత్యగానే పరిగణించవచ్చని, పురుషుడు, మహిళ హత్యనా? అనేది నిర్ధారించాల్సి ఉంది. సీసీఫుటేజ్‌లు పరిశీలిస్తే ఏమైనా ఆధారాలు లభ్యం కావొచ్చనే కోణంలో కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. యేడాది ఫుటేజిని పరిసరప్రాంతాలు, చుట్టుపక్కల నివాసాలో ఉన్న వాటిని సేకరిస్తున్నారు.

# మందుబాబుల్లో పైలట్లు కూడా!

### 2024లో 54 మంది పైలట్లు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షల్లో ఫెయిల్.. ఒకరి డిస్మిస్

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలు పెరగడానికి మద్యం సేవించి వాహనాలు నడపడం ఒక కారణంగా పోలీసు, రవాణా శాఖ అధికారులు చెబు తుండడం తెలిసిందే. దీనిని సరిదిద్దేందుకు పోలీసులు తరచూ డ్రంకన్ డ్రైవ్ దాడులు చేస్తుండడం విదితమే. ఈ దాడుల్లో ఆ యా ప్రాంతాలలో వందల సంఖ్యలో మందు బాబులు పట్టుబడుతుండగా వీరిలో మొదటిసారిగా దొరికిపోయిన వారికి జరిమానాలు, రెండోసారి, మూడవసారి పట్టుబడ్డ వానికి భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించడం, డ్రైవింగ్ లైసెన్స్‌లను కొన్ని నెలల నుంచి రెండు మూడేళ్ల పా టు లేదా శాశ్వతంగా రద్దు చేస్తుండడం జరుగుతోంది. రహదారులపై మందు బాబుల విషయం ఎలా వున్నా విమానాలు నడిపే పైలట్లలోనూ కొందరు మద్యం సేవించి విధులకు హాజరవడం, కొన్నిసార్లు ఏకంగా విమానాలు నడపడం వంటి ఘటనలూ వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇటీవల కా లంలో విమానా ప్రమాదాలు పెరగగా ఇందులో భారత్‌లోనూ పెరగడం గమనార్హం.

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొ న్ని నిమిషాలకే కూలిపోయి 241 మంది ప్రయాణీకులతో పాటు సమీపంలోని మెడికల్ కాలేజికి చెందిన 29 మంది మరణించడం సంచలనం రేపి ంది. ఈ ఘటనకు విమానంలోని రెండు ఇంజన్లకు ఇంధన సరఫరా క్షణాల వ్యవధిలో ఆగిపోవడం కారణమని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఇంధన సరఫరా చేసే స్విచ్‌లు వున్నట్లుండి ఆగిపోవడం ఇందుకు కారణంగా తేలింది. అయితే ఈ స్విచ్‌లను కో పైలట్ ఆపివేసినట్లు ప్రధాన పైలట్ భావించి, దీనిపై కో పైలట్‌ను అడగడం, తాను ఆఫ్ చేయలేదని ఆయన బదులివ్వడం, వెనువెంటనే క్షణాల్లోనే విమానం కూలిపోవడం జరిగింది. అయితే ఈ విమానంలోని ఇద్దరు పైలట్లు అనుభవం కలిగిన వారుగా, ఎలాంటి దురలవాట్లు లేనివారుగా పౌర విమానాయాన సంస్థ పేర్కొంది. ఈ విషయం అలావుంచితే గడచిన కొన్నేళ్లుగా ఇండియాలో విమానం నడిపే పైలట్లతో పాటు క్యాబిన్‌లో పనిచేసే ఇతర సిబ్బందిలో కొందరు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు పౌర విమానాయాన సంస్థ పరిశీలనలో తేలింది. ఈ క్రమంలో ఒక పైలట్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ కూడా చేశారు. 2020 నుంచి 2024 మధ్య కాలంలో 724 విమానయాన సిబ్బంది బ్రీతింగ్ పరీక్షల్లో ఫెయిల్ అయినట్లు పౌర విమానాయాన సంస్థ గణాంకా లు చెబుతున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే ఇది తక్కువే అయినా అభివృద్ధి చెందుతున్న దేశంగా వున్న భారత్‌లో ఇప్పుడిప్పుడే విమానయాన రంగ ం పురోగమనంలో వున్న తరుణంలో ఈ తరహా ఘటనలు ప్రయాణీకులపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. 2020లో 26 మంది పైలట్లు మద్యం తాగి విధులకు హాజరు కాగా 2023లో ఈ సంఖ్య 33కు పెరిగింది. వీరితో పాటు 97 మంది క్యాబిన్ సిబ్బంది సైతం బ్రీతింగ్ పరీక్షలో ఫెయిల్ అయ్యారు. 2024లో ఈ సంఖ్య 54కు పెరిగింది. 2024 ఫిబ్రవరి నెలలో థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీకి వ చ్చిన విమానం పైలట్ డ్రంకన్ డ్రైవ్ పరీక్షల్లో విఫలం అవడంతో ఎయిర్ ఇండియా సంస్థ అతన్ని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసింది. ఈ ఘటన అ ప్పట్లో సంచలనం రేపింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జైపూర్ నుంచి హైదరాబాద్ వచ్చిన చార్టెడ్ విమానం పైలట్ కూడా బ్రీతింగ్ పరీక్షలో ఫె యిల్ అయ్యారు. పైలట్లు మద్యం తాగి విమానం నడిపినా అంతకు ముందు జరిగే బ్రీతింగ్ పరీక్షల్లో ఫెయిల్ అయినా మొదటిసారి మూడు నెల లు, రెండవసారి అయితే మూడేళ్లు లైసెన్స్ సస్పెండ్ చేస్తారు. మూడవసారి అయితే శాశ్వతంగా లైసెన్స్ రద్దు చేస్తారు. విమానయాన సిబ్బంది తమ విధుల్లో నిక్కచ్చిగా వుండాలని పౌర విమానయాన సంస్థ తరచూ హెచ్చరికలు జారీ చేస్తూనే వుంటుంది. ఇందులో మద్యం తాగి విధుల రావడం, మద్యం సేవించి విమానాలు నడపడం, విధుల్లో వుండడం వంటి విషయాలల్లో పౌరవిమానయాన సంస్థ పైల ట్లతోపాటు ఇతర సిబ్బందికి కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని ప్రభుత్వ విమాన సంస్థలతో పాటు ప్రైవేటు ఎయిర్ లైన్స్ కూడా కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఎస్‌పి నేత వాంగ్మూలం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల వాంగ్మూలం నమోదు కొనసాగుతోంది. ఇప్పటి వరకు కాంగ్రెస్, బిజెపి నేతలు వాంగ్మూలం ఇవ్వగా సోమవారం నాడు తొలిసారిగా బిఎస్‌పి నేత ఒకరు వాంగ్మూలమిచ్చారు. గత అసెంబ్లీ ఎన్ని కల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి బిఎస్‌పి నుంచి పోటీచేసిన వట్టే జానయ్య ఫోన్ అప్పట్లో ట్యాపింగ్‌కు గురయ్యిందని గుర్తించిన సిట్ అధికారులు దీనిపై ఆయనకు నోటీసు ఇవ్వడంతో సోమవారం నాడు ఆయన జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయానికి వచ్చి వాంగ్మూలం ఇచ్చారు. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సంభాషణలను సిట్ అధికారులు జానయ్యకు వినిపించి నాటి ఘటనలపై వివరాలు తీసుకున్నారు. విచారణ అనంతరం జానయ్య మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ చాలా దుర్మార్గమైన చర్యగా తెలిపారు. అప్పట్లో మంత్రి జగదీష్ రెడ్డి తన ఫోన్‌ను ట్యాపింగ్ చేయించాడని ఆరోపించారు. దీనికి సంబంధించిన తన వద్ద వున్న ఆధారాలను సిట్ అధికారులకు అందించారు. ఫోన్ ట్యాపింగ్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## రాష్ట్రంలో డెయిరీ కోర్సుల దరఖాస్తుల అహ్వానం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** తెలంగాణలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన డెయిరీ కోర్సులకు ఇటీవల బాగా డిమాండ్ పెరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని వెటర్నరీ వర్సిటీకి అనుబంధంగా ఉన్న కామారెడ్డి ప్రభుత్వ బీటెక్ కళాశాల డెయిరీ కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికి సంబంధించి విడుదల చేసిన ఒక నోటిఫికేషన్‌లో ఇంటర్‌లో ఎంపీసీ చదివిన విద్యార్థులకు ఎప్‌సెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ లభించనున్నది. మొత్తం కళాశాలలో 44 సీట్లు ఉంటే, వీటిలో 6 సీట్లను రైతు కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు కేటాయించనున్నారు. కాగా కొంతకాలంగా డెయిరీ కోర్సు చదివిన విద్యార్థులకు ప్రముఖ డెయిరీ కంపెనీలో మంచి వేతనంతో ఉద్యోగావకాశాలు లభిస్తుండటంతో ప్రస్తుత 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు భారీగా డిమాండ్ పెరిగినట్టు వెటర్నరీ విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు.

## ఐఇడి పేలి ముగ్గురికి గాయాలు

**చర్ల, జూలై 14,ప్రభాతవార్త :** చత్తీస్‌గఢ్ రాష్ట్రం మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ధంగోల్ గ్రామానికి చెందిన కొందరు పుట్టగొడుగులు (మష్రూమ్స్) కోసం అటవి ప్రాంతానికి వెళ్లిన క్రమంలో అప్పటికే ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ వచ్చే భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు అమర్చిన ఐఈడి బాంబు పేలి ధంగోల్ గ్రామానికి చెందిన కుడియం కవిత కొర్సే సంతోష్ చిదెం కన్నయ్యలకు తీవ్రగాయాలైయ్యాయి. వీరిని హుటాహుటిన బీజాపూర్ జిల్లా వైద్యశాలకు తరలించారు.



బలగాలు స్వాధీనం చేసుకున్న తుపాకులు

**బర్మర్ తుపాకులు**

స్వాధీనం బీజాపూర్ జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకల్గూడెమ్ పుల్పంపార డిఆర్జీ సిఆర్పీఎఫ్ 150 బెటాలియన్ సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు అడవిలో దాచి ఉంచిన నాలుగు బర్మర్ తుపాకులను కనిపెట్టి వాటిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలి

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలోని ఎస్సీలకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రభుత్వానికి అయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రత్మకమైన సామాజిక కులగణన సర్వే చేపట్టిందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషను 42 శాతానికి పెంచడానికి ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రత్మకమని చెప్పారు. కులగణన సామాజిక సర్వేలో ఎస్సీల జనాభా 15 నుంచి 18 శాతం వరకు పెరిగిందని తెలిపారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాల ప్రకారం ప్రకారం ప్రభుత్వం ఎస్సీలకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచి రాజ్యాంగ పరంగా లభించిన హక్కును కాపాడాలని సూచించారు.

## రాష్ట్రంలో 18 దత్తత కేంద్రాలు

### సర్కార్‌కు ప్రతిపాదనలు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** తెలంగాణలో నూతనంగా దత్తత, బాలల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా 18 దత్తత కేంద్రాలతో పాటు, మరో 2 బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించారు. వీటికి సర్కార్ నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పడితే మొత్తం వీటి సంఖ్య 35కి చేరనుంది. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా 5.44 కోట్ల రూపాయల మేర ఖర్చు అవుతాయని అధికారవర్గాలు అంచనా వేశాయి. ఈ మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం మేర 3.26 కోట్ల రూపాయలను భరించనుండగా, మిగిలిన 40 శాతం నిధులు 2.17 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది.

## ఎపి మంత్రి రవీంద్ర పగటి వేషగాడు: పేర్ని నాని

**విజయవాడ జులై 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కేవలం రెడ్‌బుక్ పాలన మాత్రమే సాగుతోందన్నారు మాజీ మంత్రి పేర్ని నాని. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే అలా చేసిన వారిని న్యాయస్థానాల్లో నిలబెడతాం అని హెచ్చరించారు. కొల్లు రవీంద్ర ఓ పగటి వేషగాడు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మహానటి అంటూ సైటెరికల్ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కుటుంబంపై కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. ఉప్పాల హారికపై దాడి చేసి తిరిగి ఉప్పాల రాముపై కేసు నమోదు చేయడం దారుణం దాడి చేసి తిరిగి మా పార్టీ సభ్యులపైనే కేసులు నమోదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ కార్యకర్త ఏం చేశారో అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. టీడీపీ మహిళా కార్యకర్తతో తప్పుడు ఫిర్యాదు చేసింది. ఆమె కొడాలి నాని ఫ్లెక్సీని చించేశారు. ఫ్లెక్సీని చించి చేతికి గాయం అయితే కారుతో గుద్దారని తప్పుడు ఫిర్యాదు చేశారు. తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే వారిని న్యాయ స్థానాల్లో నిలబెడతాం. చంద్రబాబు హయాంలోనే తప్పుడు కేసుల పరిపాలన కనపడుతోంది.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి
ఫైలు నెం. ఇ1/10/2025-26, టెండరు మరియు కొటేషన్ నోటీసు ప్రకటన తేది: 11.07.2025
పనుల సంఖ్య: 3, అంచనా వ్యయం: రూ.15.00 లక్షలు, బిడ్ దాఖలు ప్రారంభ తేది: 14.07.2025, ఉ.11.30 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది: 15.07.2025 మ.3.30 గం.లకు. వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర నిర్వహణ పనులకు అవసరమగు Non-SSR Item లకు ధరలు ఏజెన్సీలు/కాంట్రాక్టర్ల నుండి పై తేదీలలో కొటేషన్లు కోరనైనది. పూర్తి వివరముల కొరకు మునిసిపల్ ఇంజనీర్: 9581853956ను సంప్రదించగలరు.
సం/- కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ
DIPR.No.4961-PP/CL/Advt/1/2025-26, తేది: 14.07.2025

వార్త

మూర్ఖుడు ఏదో దూరాన సుఖం ఉందని నమ్ముతాడు, వివేకవంతుడు అది తన పాదాల దగ్గరే ఉందని భావిస్తాడు.

-జేమ్స్‌బస్పెన్ హేమ్

# 'కల్తీ'ని ఆపలేమా!

కల్తీకల్లు ప్రాణాలు తీస్తోంది. కాసులకు కక్కుర్తి పడి కలపకూడనివి ప్రాణాంతక, నిషేధిత విషపదార్థాలను కల్తీ చేస్తే జరిగేదిదే. ఈ విషయం తెలియనిదేమీ కాకపోయినా నిర్వాహకులు అధిక సంపాదన కోసం చేసే పనులు పరుల ప్రాణం మీదకు తెస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణలో 'కల్లు' సంప్రదాయం శ్రామికజనానికి ఉల్లాసంగా ఉంటుంది. దానినాసరాగా తీసుకుని కల్తీ చేయడం వలన అది గుర్తించలేకపోవడం వారి ఆరోగ్యం పాడవుతోంది. కల్తీ శ్రుతి మించితే అనారోగ్యం వెంటాడుతుంది. కల్లు కంపౌండ్‌లపై కంట్రాక్టర్ల గుత్యాధిపత్యం ఉందని అదొక మాఫియాలా నడుస్తుంటాయని ఎన్ని ఆరోపణలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆ కారణం చేతనే అకారణంగా ఎన్నో ప్రాణాలు హరించుకుపోతున్నాయి. హైదరాబాద్ నగరంలోనే అధికారికంగా 104 కల్లు దుకాణాలున్నాయి. అయితే ఒకరికే ఎక్కువ దుకాణాలుండడం వలన 'కల్తీ'కి సంబంధించి అల్ప్రజోలమ్, సోడియం, బైకార్బొనేట్ అమ్మోనియం, శాఖరిన్ వాటిని కల్తీ చేసేందుకు వీలైన యంత్రాంగం, సరంజామా సమకూర్చుకునేందుకు వీలుంటుందని కల్లుగీత కార్మిక సంఘాల విశ్లేషణ. ఇంతవరకు గ్రేటర్ హైదరాబాద్‌లో కుకట్‌పల్లి దుర్ఘటనలో కల్తీ కల్లుకు పది మంది బలయ్యారు. కల్తీ కల్లు ఎవరికందినా ప్రాణం మీదకు తెస్తోంది. మొన్నటికి మొన్న జీడిమెట్లలో కల్తీకల్లు తాగిన నిజామాబాద్ జిల్లా బోపాల్‌కు చెందిన దంపతులు రామ్‌రెడ్డి నగర్‌లోని కల్లు దుకాణంలో కల్లుతాగి మంచానపడ్డారు. కాళ్లు, చేతులు లాగడం, పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం, పిచ్చిప్రేలాపనలు వారిని నిర్వీర్యుల్ని చేసింది. శరీరంలో సత్తా ఉడిగి మంచాన పడి ఉన్నారు.నేరుగా తాటి చెట్టు నుంచి తీసే 'నీరా' శరీరానికి మంచిదేనని వైద్యులే చెబుతుంటారు. కాగా అందులో 'కల్తీ' జరిగితే ఇంకేముంది? అని కల్తీకల్లు మరణాలు సంభవించినప్పుడల్లా తేటతెల్లమయ్యేదే. కానీ ఇప్పుడున్న పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ముడిపదార్థాలు సరఫరా కాకుండా చూడడంలోనూ ప్రభుత్వ వైఫల్యం కనపడుతోంది. ఈ వృత్తి మీద దాదాపు రెండున్నర లక్షల మంది గీతవృత్తి కార్మికులు ఆధారపడి ఉంటారు. కల్తీ కల్లు విక్రయాలు కూడా నేలకు కోట్ల మీదనే ఉంటుంది. ఇంతవరకు పొడిగా లభించే క్లోరల్ హైడ్రేట్, డెజోపామ్, ఆల్ప్రాజోలంను లిక్విడ్‌గా మార్చి అసలు సిసలు కల్లులో కలపడం వల్లనే కల్తీ ప్రభావతీవ్రత ఎక్కువ కనపడుతోందని తాజా వ్యవహారంలో ఆరోపణలున్నాయి. ఇలా వచ్చే ఏ రకమైన ఆరోపణలకూ ఇటు ఎక్సైజ్ శాఖ కానీ అటు ప్రభుత్వం కానీ సమాధానమిచ్చే పరిస్థితి లేదు. ఏదో మద్యం ధరలు పెరగడం వల్లనే కల్లుకు గిరాకీ పెరిగిందని కొందరు చెప్పబోతున్నా గిరాకీని ఆసరాగా మరో చుక్కకలిపి కల్తీగా మార్చేయడం ఎలా చూసినా తప్పే అవుతుంది. కల్లులో ఎలాంటి రసాయనాలు కలపకుండా సేవిస్తే ప్రాణాలకు ముప్పేమీ ఉండదు. సామాన్యులకు ఈ విషపూరిత ద్రావకాన్ని అందించే కల్తీకల్లును నిరోధించేందుకు ఎన్నో మార్గాలున్నాయి. 'నీరా'కల్లు తప్ప మరేదీ తాగద్దని చెబుతున్నా అందులో కల్లు కలపకుండా తీసుకోవలసిన ప్రామాణికాలు ఏవీ ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు లేదు. ప్రధానంగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న తాటి, ఈత చెట్ల నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లుకన్నా ఎక్కువ పరిమాణంలోనే కల్లు అమ్మకాలు జరుగుతున్నాయని ప్రభుత్వం వద్ద లెక్కలున్నాయి. కాగా ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఇవన్నీ తెలిసినా కల్లు ప్రియుల పక్షాన కావల్సినంత కల్లుకోసం కళ్లుగప్పుకుని కూర్చుంటున్నారా అన్నట్లు వారి అజమాయిషీ ఉంటోంది. ఇదే అభ్యంతరకరం. నిషేధిత మత్తు పదార్థాలు మోతాదుకు మించి కలిపినప్పుడే కల్తీ మరణాలు సంభవిస్తాయి. లేకున్నా వికారాలకు తక్కువేం లేదు. ఆస్పత్రుల పాలవడం, ఆర్థికంగా చితికిపోవడం కూడా ఈ వ్యసన పర్యవసానమే. మిథైల్ ఆల్కహాల్, కూడా కల్లులో కలిపితే బాగా మత్తువస్తుందని, దీనిని కూడా కలుపుతారని వెల్లడి.గత కొద్దికాలంగా జంటనగరాలకు, పరిసర గ్రామాల్లో సైతం ఆధునీకరణ పేరిట రహదార్ల విస్తరణకు, ఇతరత్రా నిర్మాణ కార్యక్రమాల కోసం రోడ్డువారనే ఉన్న తాటి, ఈత చెట్లు నరికివేతతో కల్లు తక్కువగా లభ్యమవుతోందని అంచనాలున్నాయి. 'కల్తీ'కల్లు తాగి బలౌతున్నారన్న విషయం ఇవ్వాళ కొత్తేమీ కాదు. కానీ దానిని నిరోధించాలని, విస్తృత వ్యాప్తిని అరికట్టాలని దృఢసంకల్పం లేకపోవడమేఈనాటి దుర్ఘటనలకు కారణమౌతోంది. ప్రధానంగా కోరల్ హైడ్రేట్ నాడీ మండలంపై ప్రభావం చూపుతుంది. పేగును మెలి పెడుతుంది. లివర్ డ్యామేజి అవుతుంది. ఇలా కల్తీకల్లునే మరో రూపంలో సింథటిక్ కల్లు అని కూడా అంటుంటారు. చాలా మందికి ఈ దుర్వ్యసనంలో 'కల్తీ' రకాలు తాగితే ప్రాణం వదిలేయాల్సి వస్తుందని, తెలుసున్నా కల్తీ ఏదో స్వచ్ఛమైనదేదో పసికట్టలేక కానీ వ్యసనానికి ఆగలేక తాగడం మాన లేకపోతున్నారు. కల్లు ప్రియులకు ప్రభుత్వం నుంచి స్వచ్ఛమైన కల్లు సరఫరాకు భరోసా లేకపోవడం దురదృష్టకరం. కల్లు దుకాణాలపై నిఘాలో నిర్లక్ష్యం వహించిన ఎక్సైజ్ ఠాణా సిఐని సస్పెండ్ చేశారు. ఎక్సైజ్ సిబ్బందిని విచారణకు ఆదేశించారు. 2014లో కనీసం 20 మంది మృతి చెందారు. తాజా దుర్ఘటనలో ఇంతవరకు 10 మంది మృతి చెందారు. చాలా మంది ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. దుర్ఘటనను ప్రభుత్వం ఛాలెంజ్‌గా తీసుకుని కల్తీకల్లు జనానికి అందకుండా పకడ్బందీ వ్యూహంతో ముందుకు కదిలితే మరో మరణానికి అవకాశం లేని పరిస్థితులను చూడవచ్చు.

ఏమీ చేయకుండానే ఎంతో కొంత పొందాలని ఎదురుచూసే వ్యక్తులు తప్పనిసరిగా నిరాశకు గురవుతారు.



జియోర్జ్ ఎలియెట్

పాఠకుల తక్కువ సమయం తీసుకొని ఎక్కువ విజ్ఞానం అందించే రచయిత ప్రతిభావంతుడు.



సి.సి.కోల్టన్

# ఈసారైనా డీలిమిటేషన్ జరిగేనా?

***ప్రజాస్వామ్యంలో సంఖ్యా బలానిదే పైచేయి. చట్టసభలలో మెజారిటీ సభ్యుల నిర్ణయాలను మైనారిటీ సభ్యులు భరించాల్సిందే. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వ భౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ సంఖ్యాబలం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 42 స్థానాలు ఉండగా తమిళనాడుకు 39, కర్ణాటకకు 28, కేరళకు 20 స్థానాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా వున్నసమయంలో కేంద్రంలో కీలకంగా వుండేది.***



అన్నవరపు బ్రహ్మయ్య

మనదేశంలో నిజానికి 1981లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కార్యక్రమం నిర్వహించాల్సి వుంది. అయితే ఆనాడు దేశ జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందుగా దేశంలో జనాభా నియంత్రణ కార్యక్రమాలుఅమలు చేయాలన్న తలంపుతో డీలిమిటేషన్ కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో నిర్వహించే జనగణన తర్వాత చేయాలని ఆనాటి పార్లమెంటులో తీర్మానం చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితులు గమనిస్తుంటే ఈసారైనా డీలిమిటేషన్ ప్రక్రియ అసలు జరుగుతుందా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. సహజంగా డీలిమిటేషన్ ప్రక్రియను పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన 'డీలిమిటేషన్ కమిషన్' నిర్వహిస్తుంది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1951, 1961, 1971లలో జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ నిర్వహించారు. ప్రస్తుతం లోక్‌సభలో వున్న 543 నియోజకవర్గాల సీట్ల సంఖ్యను 1971జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించారు. ఆనాటి దేశ జనాభా 54.8 కోట్లు. సహజంగా జనాభా సంఖ్యను బట్టి నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయిస్తారు. కాని ప్రస్తుతం పరిస్థితుల్లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను నిర్ణయించే పక్షంలో కొన్ని రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం వుంది. అందువల్ల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సహా పలువురు ముఖ్యమంత్రులు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజను వ్యతిరేకిస్తున్నారు. 1971 జనాభా లెక్కల సేకరణ తర్వాత దేశవ్యాప్తంగా విస్తృతంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేశారు. అయితే ఆయా రాష్ట్రాల సామాజిక పరిస్థితులను బట్టి కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా అమలయ్యాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా మందకొడిగా అమలయ్యాయి. ఇదే సమయంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా పగడ్బందిగా అమలయ్యాయి. దాంతో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సరిగా అమలు కాని రాష్ట్రాలలో జనాభా ఎక్కువగా వుంటే, నియంత్రణ కార్యక్రమాలు సక్రమంగా అమలైన రాష్ట్రాలలో జనాభా తగ్గిపోయింది. ఈ స్థితిలో జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగే పక్షంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు విపరీతంగా పెరిగే అవకాశం వుండగా, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సవ్యంగా అమలు చేసిన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతాయి. ఉదాహరణకి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలు పెంచే పక్షంలో ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సభ సీట్ల సంఖ్య 80నుంచి 91కి, బీహార్ రాష్ట్రంలో 40నుంచి 50సీట్లకు పెరుగుతాయి. ఇదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వున్న 42సీట్లసంఖ్య 34కి, తమిళనాడులో 39సీట్ల సంఖ్య 31కిపడిపోతాయి. ఈ స్థితిలో డీలిమిటేషన్‌లో లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించడం మంచిదని కొంతమంది మేధావులు సూచిస్తున్నారు.




ఎందుకంటే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచడం ఆచరణ సాధ్యం కాదు. ముందుగా చెప్పుకొన్నట్టుగా 1971వ సంవత్సరంలో దేశ జనాభా 54.8 కోట్లు. ఆనాటి జనాభా ప్రకారం 543స్థానాలు వుంటే,నేటి జనాభా దాదాపు 150 కోట్లకు కనీసం 1500 స్థానాలకు పెరగాల్సి వుంటుంది. ఈ స్థానాలకు తోడు మూడోవంతు అంటే500 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలను కూడా కలపాల్సి ఉంటుంది. ఇంతమంది సభ్యులకు పార్లమెంటు భవనంలో సీట్లు కేటాయించడం కూడా సాధ్యంకాదు.కొత్తగా నిర్మించిన పార్లమెంటు భవనంలో లోక్‌సభ, రాజ్యసభలో మొత్తం 1272 సీట్లు మాత్రమే వున్నాయి. అంతేకాకుండా భారత దేశ జనాభా భవిష్యత్తులో అంటే మరో మూడు దశాబ్దాల పాటు పెరుగుతూనే వుంటుంది. భారతదేశ జనాభా సగటున 15 శాతం వంతున రాబోయే మూడు దశాబ్దాలలో దాదాపు 165170 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు.(మూడు దశాబ్దాల తర్వాత జనాభా తగ్గడం ప్రారంభం అవుతుంది). ఈ స్థితిలో ప్రతి పది సంవత్సరాలకు లోక్‌సభ స్థానాలు పెంచడం అసాధ్యం. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1913వ సంవత్సరానికి ముందు ప్రతి పదేళ్లకు జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్(పార్లమెంటు)లో సీట్ల సంఖ్య పెంచినప్పటికీ 1913 నుండి ప్రతినిధుల సభలో సీట్లసంఖ్య 435కి పరిమితం చేశారు. అమెరికా జనాభా 1911లో 9.4 కోట్లు వుండగా ప్రస్తుతం అంటే 2024 నాటికి దాదాపు నాలుగు రెట్లు పెరిగి 34 కోట్లకు చేరుకుంది. అయినా అమెరికా కాంగ్రెస్లో ప్రతినిధుల సీట్ల 435 గానే ఉంది. అదే విధంగా భారతదేశంలో కూడా పైన పేర్కొన్న అంశాల నేపథ్యంలో రాష్ట్రాలలో అసెంబ్లీస్థానాలలో మార్పులు చేర్పులు చేసినా, లోక్‌సభ స్థానాల సంఖ్యను యథాతథంగా 543 ఉండే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు. ఇదే జరిగితే దక్షిణాది, ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల మధ్య తలెత్తిన సీట్ల గొడవ కూడా సద్దుమణుగుతుంది. జనాభా ప్రాతిపదికన కాకుండా నిర్ణీత నిష్పత్తిలో 543లోక్‌సభ స్థానాలను 843కి పెంచే పక్షంలో రాష్ట్రాల జనాభాతో నిమిత్తం లేకుండా అన్ని రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు పెరుగుతాయనే ప్రతిపాదనను కూడా కొన్ని రాజకీయ పార్టీలు ప్రతిపాదిస్తున్నాయి. నిష్పత్తి ప్రకారం నిర్వహిస్తే అన్ని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి. ఉదాహరణకి పైన తెలిపిన నిష్పత్తిలో లోక్‌సభ స్థానాలు పెంచే పక్షంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సభ సీట్ల సంఖ్య 80 నుంచి 143కి, బీహార్ రాష్ట్రంలో 40నుంచి 79సీట్లకు పెరుగుతాయి. ఇదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న 42 సీట్ల సంఖ్య 54కి, తమిళనాడులో 39 సీట్ల సంఖ్య 49కి పెరుగుతాయి. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలానిదే పైచేయి. చట్టసభలలో మెజారిటీ సభ్యుల నిర్ణయాలను మైనారిటీ సభ్యులు భరించాల్సిందే. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వ భౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ సంఖ్యాబలం పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 42 స్థానాలు ఉండగా తమిళనాడుకు 39, కర్ణాటకకు 28, కేరళకు 20 స్థానాలు ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా వున్నసమయంలో కేంద్రంలో కీలకంగా వుండేది. ఉదాహరణకి కేంద్రంలో ఒక సమయంలో తెలుగుదేశంపార్టీ 36 స్థానాలతో లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించగలిగింది. అదే సమయంలో తమిళనాడు, ఆంధ్రప్రాంతానికి చెందిన అధికారులు కూడా కేంద్రంలో ఎక్కువగా వుండేవారు. దాంతో కేంద్రంలో ఏపనైనా వేగంగా జరిగేది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణ 17 లోక్‌సభ స్థానాలకు పరిమితం అయ్యాయి. దాంతో కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. •

# నైపుణ్యమే యువత భవిష్యత్ మూలధనం

వెంకటరమణ గిలకత్తుల

ప్రపంచ జనాభాలో సుమారు 16 శాతం మంది యువత (15–24 సంవత్సరాల వయస్సు) ఉండటం, మానవ వనరుల పరంగా అపూర్వమైన అవకాశం. అయితే, ఈ సమృద్ధి యువతరం సవాళ్లను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం, పేదరికం, 40 యువతకు మార్కెట్ అవసరాలకు తగినట్లు నైపుణ్య శిక్షణ లేకపోవడం వల్ల సామర్థ్యం పూర్తిగా వినియోగించబడట్లేదు. ప్రపంచం వేగంగా డిజిటల్ వైపు ప్రయాణిస్తున్న తరుణంలో, కాలానుగుణ మార్పులకు సన్నద్ధం చేయడం అత్యవసరం. నైపుణ్యాలు కేవలం ఉపాధి మార్గమే కాదు – అవి వ్యక్తిగత అభివృద్ధికి, ఆత్మవిశ్వాసానికి, ఆవిష్కరణలకు పునాది. యువత ఉద్యోగం కోసం ఎదురుచూసే స్థితిలో కాకుండా, స్వయం ఉపాధికి సిద్ధమయ్యే స్థితికి చేరే మార్గం నైపుణ్యమే. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, డిజిటల్ కంపెటెన్సీలు, వ్యవసాయం నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ప్రతి రంగంలో నైపుణ్యాలతో శిక్షణ పొందిన యువత దేశాభివృద్ధికి కీలకం. ప్రతి నైపుణ్యం ఒక విలువైన సంపదగా మారుతుంది. అది వ్యక్తిని మాత్రమే కాదు సమాజాన్ని కూడా వెలుగులోకి తీసుకురాగలదు. యునెస్కో, ఐఎల్‌వో,యునిసెఫ్, యునిడో వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ యువత కోసం స్కిల్స్ ఫర్ యూత్, డీసెంట్ జాబ్స్ ఫర్ యూత్, ఫ్యూచర్ ఆఫ్ వర్క్ వంటి కార్యక్రమాల ద్వారా శిక్షణా అవకాశాలు అందిస్తున్నాయి. నైపుణ్యాలను సమాజ సంక్షేమమే పునాదిగా, సమాన అవకాశాల కల్పన దిశగా ఈ సంస్థలు గ్లోబల్ అవగాహన పెంచుతున్నాయి. భారత ప్రభుత్వం



2015 లో ప్రారంభించిన స్కిల్ ఇండియా మిషన్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా లక్షలాది యువత శిక్షణ పొందుతున్నారు. ప్రత్యేకించి గ్రామీణ యువత, మహిళా యువత, వలస కార్మికులు వంటి వర్గాలకు చేరువయ్యే ప్రయత్నాలు అభినందనీయం. నాణ్యమైన శిక్షణ, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన కార్యక్రమాలు, ఉపాధికి అనుసంధానించే వ్యవస్థలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది. నగర, గ్రామం మధ్య నైపుణ్య భేదం తగ్గించేందుకు మొబైల్ డిజిటల్ ట్రైనింగ్ లాబ్‌లు, మెంటార్ కౌన్సిలింగ్ కేంద్రాలు, వర్చువల్, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు మరింత విస్తరించడం అత్యావశ్యం. నైపుణ్యం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, నమ్మకం పెరుగుతుంది. ఈ నైపుణ్యాలు వారిని ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చగలవు. యువతకు తగిన మార్గనిర్దేశం, శిక్షణ, కాలానుగుణ మార్పులను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని అందించడం ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, పరిశ్రమల బాధ్యత. నాయకత్వ లక్షణాలపైశిక్షణ, కమ్యూనికేషన్, జట్టు కృషి, భావోద్వేగ నియంత్రణ మొదలగు అంశాలపై శిక్షణ ఇప్పించాలి. యువత దేశ భవిష్యత్తుకు పునాది. సరైన అవకాశాలు కల్పించడం ఓ విధి మాత్రమే కాదు. అది మన భవిష్యత్తు పట్ల నిబద్ధత. నైపుణ్యం లేని సమాజం చైతన్యం లేని భవిష్యత్తుతో సమానం. నైపుణ్యం అనేది వ్యక్తిగత విజయం కోసం మాత్రమే కాదు, సమాజ సుస్థిరతకు, ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శక శక్తి. యువతను సాంకేతికత, సృజనాత్మకత, మానవీయ విలువల మేళవింపుతో తీర్చిదిద్దితే వారి చేతుల్లో ఉండే జ్ఞానం ప్రపంచ సుస్థిర భవిష్యత్తు వైపు నడిపిస్తుంది. •

# ప్రజావాక్కు

## ఎంత మందికని ఇస్తారు

మంత్రి పదవికోసం తరచు ఢిల్లీకిచక్కర్లు కొట్టడం, పైరవీలు చేయడం, మంత్రిపదవి ఇవ్వకపోతే రాజీనామా బెదరింపులు, ఫిరాయింపులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం మంత్రివర్గ విస్తరణ సమయంలో ఎమ్మెల్యేల తీరు ఇలా ఉంటోంది. శాసనసభ స్థానాలను బట్టి మంత్రి పదవులు ఇవ్వవలసి ఉంటుంది. పరిమితులు దాటి పదవులు ఇవ్వటానికి కుదరదు. ఎమ్మెల్యే ఎన్నికయిన వారికి ఈ మాత్రం తెలియదా? మంత్రివర్గ విస్తరణ జరిగే ప్రతీసారి ఎందుకు మొండిగా, మూర్ఖంగా ప్రవర్తిస్తుంటారు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

## పరిశోధనలకు కీలకపాత్ర ఇవ్వాలి

విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిమితి కాదు. జ్ఞానాన్ని సృజనాత్మకంగా అన్వేషించడమే నిజమైన విద్య. ఈఅన్వేషణలో పరిశోధనకు కీలకపాత్రఉంది. విశ్వ విద్యాలయాల ప్రతిష్ఠ, విద్యార్థుల మేధోవికాసం అన్నీ పరిశోధనపై ఆధారపడిఉంటాయి. పరిశోధన విద్యార్థుల్లో లోతైన ఆలోచనలను, సమస్యలపై విశ్లేషణాత్మక దృష్టిని పెంపొందిస్తుంది. ఇది నూతన ఆవిష్కరణలకు దారితీసే మార్గం. పైగా, సమాజానికి అవసరమైన పరిష్కారాలను అందించగల సామర్థ్యాన్ని విద్యార్థులకు కలిగిస్తుంది. ఇది కేవలం విశ్వవిద్యాలయాలకే పరిమితం కాకుండా, పాఠశాల స్థాయిలోనే ఈ సంస్కృతిని ప్రారంభించాలి. చిన్న తరగతుల్లో నుంచే పర్యావరణం, సైన్స్, సమాజశాస్త్రం తదితరాల్లో చిన్న ప్రాజెక్టుల రూపంలో పరిశోధనోన్ముఖ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవ్వాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## రాజ్యాంగాన్ని అనుసరించి పాలించండి

విశ్వాసాలు కలిగి ఉన్న వారిపైన దాడి చేస్తుండడం విషాదం. ఇక్కడ గమనించవలసిన విషయం ఇంకొకటి ఉంది. రాజ్యం తమ సొంత పౌరులపైనే దాడి చేస్తుండడం గమనించవచ్చు. దేశంలో2004లో మొదటి సారి ఉమ్మడి రాష్ట్రంలోచర్చల ప్రయోగం జరిగింది. దానికి ప్రజా మద్దతు కూడా లభించింది. భూ సంస్కరణలు గిరిజనులు 1/70 చట్టం లాంటివి చాలా వరకు చర్చకు వచ్చాయి. ఇవ్వాళ ప్రజా ఉద్యమాల వల్లనే ఉపాధి హామీ చట్టం భూ సేకరణ చట్టం లాంటివి రూపుదిద్దుకున్నాయి.

- భారత శ్రీరాములు, ముత్తారం

## విమానంలో తెలుగు భాషకు పట్టం

తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష వినియోగంపై భాషాభిమానులు ఆందోళనచెందుతున్న వేళ హైదరాబాదునుంచి దుబాయ్ వెళ్లే ఎమిరేట్స్ విమానంలో తెలుగు భాషకు పట్టం కట్టడం భాషా అభిమానులను ఆనందింప చేస్తోంది. ఎమిరేట్స్ విమానంలోభోజన పట్టికను అరబిక్, ఇంగ్లీష్‌తో పాటు తెలుగులోనూ ముద్రించారు. విమాన భోజన మెనూ కార్డులో తెలుగు అక్షరాలు చూసిన ఆంధ్రులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. ఇటీవల మహా కుంభమేళాలోనూ తెలుగు బోర్డులు వెలిశాయి. ఇటువంటి వార్తలు వింటుంటే తెలుగు ప్రేమికుల హృదయం ఉప్పొంగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలుగు భాష వినియోగం పట్ల శ్రద్ధ పెట్టాలి.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## చిట్‌ఫండ్ కంపెనీలతో మోసపోకండి

అనేక చిట్‌ఫండ్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టి తర్వాత దివాలా తీసేసే కంపెనీలు కొన్ని. దివాలా తీశామంటున్నారో లేక పోతే మొత్తం డబ్బులుతీసుకుని పారిపోతున్నారో ఎవ్వరికీ తెలియదు. రెండవదే నిజం. యాడ్‌లో చూసి తమ ప్రియతమ సెలబ్రిటీ ఇదిగోగోతిలో దూకమన్నాడు అని దూకి చేతులు కాలాక లోబోదిబో అంటూ రోడ్ ఎక్కేవారు కొందరు. అలాంటిదే మొన్న జరిగిన ఒక రియల్ ఎస్టేట్‌కి ఒక ప్రముఖ నటుడు ఇచ్చిన యాడ్. ఇక్కడ కొనేవారే కాక యాడ్ ఇచ్చే ప్రముఖులు కూడా ఆయా కంపెనీ క్రెడిబిలిటీ చూసి యాడ్ ఇవ్వాలి.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## ఇంటి పరిస్థితులను కూడా పట్టించుకోండి

భారత ప్రధాని నరేంద్ర మోడీ గత ప్రధానులు ఇతర దేశాల పార్లమెంట్లలో చేసిన 17ప్రసంగాలతోసమానంగా తాను ఒక్కడే గత పదకొండేళ్లలో అన్ని దేశ పార్లమెంట్లలో ప్రసంగించిన ఘనతను పొందారు. దీనితో ప్రధాని పదవిని చేపట్టిన నుండి ఇప్పటి వరకు 27 అంతర్జాతీయ అత్యధిక గౌరవ పురస్కారాలు పొందిన ప్రధాని నరేంద్ర మోడీ ఒకే ఒక్కరు గావచ్చు. ఈయన రచ్చ గెలుస్తున్నారు. ఇంటగెలిచారా అంటే అనుమానస్పదమే. ఐపి ఎస్95లో రిటైరయిన పబ్లిక్ సెక్టార్‌ఉద్యోగులు గత 11 సం॥రాలుగా నెలకు వెయ్యి రూపాయల ఫించన్ తో బతకలేక వయసు మీద పడ్డా బయట ఏవేవో చిన్నా చితకా పనులు చేస్తూ చావలేక బ్రతకలేక బ్రతుకీడుస్తున్నారు. ఇంటి పరిస్థితులను కూడా పట్టించుకోండి.

- డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ప్లాస్టిక్ బెడద నివారణకు ఓ అద్భుత శిలీంధ్రం!



యేచన్ చంద్రశేఖర్

ప్లాస్టిక్ వ్యర్థాలు, సముద్రాలు, నదులు, భూమితోసహా వివిధ పర్యావరణ వ్యవస్థలలో పేరుకుపోయి, మైక్రోప్లాస్టిక్‌లు, నానోప్లాస్టిక్‌లుగా రూపాంతరం చెందుతాయి. మారుమూల ప్రాంతాలలో సైతం కనుగొనబడే ఈ సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు వాతావరణంలో స్థిరంగా ఉంటాయి. ప్లాస్టిక్ పూర్తిగా కుళ్లిపోవడానికి, మట్టిలో కలిసిపోవడానికి వందల లేదా వేల సంవత్సరాలు పట్టేఅవకాశం ఉంది. ఏటా 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో కలవడం అత్యంత ఆందోళనకరమైన అంశం. అయితే, అమెజాన్ ఉష్ణమండల వర్షారణ్యాలలో (అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్) కనుగొనబడిన "పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా" అనే అద్భుతమైన శిలీంధ్రాలు (ఫంగస్) ప్లాస్టిక్ కాలుష్య సమస్యను పరిష్కరించడంలో సహాయపడే సామర్థ్యం ఉన్నందున పర్యావరణ శాస్త్రవేత్తల దృష్టిని అమితంగా ఆకర్షించింది. అమెజాన్ వర్షారణ్యంలో శాస్త్రవేత్తలు ఒక అద్భుతమైన శిలీంధ్రాన్ని (ఫంగస్) కనుగొన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన పర్యావరణ సమస్యలలో ఒకటైన ప్లాస్టిక్ కాలుష్యాన్ని పరిష్కరించడంలో సహాయపడుతుంది. యేల్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనం ప్రకారం, పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా అని పిలువబడే ఈ శిలీంధ్రం, ఇన్సులేషన్ నుండి పాదరక్షల వరకు ప్రతిదానిలోనూ ఉపయోగించే సాధారణ రకం ప్లాస్టిక్ అయిన పాలియురేతేన్‌ను విచ్ఛిన్నం చేసే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది వాయురహిత లోతైన ప్లాస్టిక్ వ్యర్థాల తరలింపు వాతావరణాలలో సైతం మనుగడ సాగించి ప్లాస్టిక్‌ను క్షీణింపజేయగలదు. ప్లాస్టిక్ అత్యంత ప్రబలమైన సముద్ర కాలుష్య కారకంగా మారి ప్లాస్టిక్ ఉపరితలాలు సముద్రంలో వేగంగా పెరుగుతున్న తరుణంలో హవాయి విశ్వవిద్యాలయ పరిశోధకులు ఇటీవల హవాయి సమీప తీర వాతావరణం నుండి అనేక జాతుల శిలీంధ్రాలు ప్లాస్టిక్‌ను క్షీణింపజేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని కనుగొనడంతో పాటు కొన్నింటిని వేగంగా అభివృద్ధి చేయవచ్చని తెలుసుకున్నారు. నేటి వాతావరణంలో అత్యధిక కాలంపాటు మనగలిగే ప్లాస్టిక్‌ను ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో అధోకరణం చేయడం దాదాపు అసాధ్యం అని హవాయి విశ్వవిద్యాలయం పరిశోధకులు అన్నారు. ప్రకృతి నుండి ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించడానికి, పునర్వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కొత్త మార్గాలను అన్వేషించేందుకు సముద్ర శిలీంధ్రాలు ఒక ఆశాజనకమైన అంతగా ఉపయోగించని వనరులుగా వారి పరిశోధన తెలియచేస్తుందన్నారు. ఈ ఆవిష్కరణను ముఖ్యంగా ఉత్తేజపరిచే విషయం ఏమిటంటే, శిలీంధ్రం కార్బన్ ఏకైక వనరుగా ప్లాస్టిక్‌పై జీవించగలదు. ఇతర పోషకాలేవీ అవసరం లేకుండా మనుగడ సాగించే ఈ శిలీంధ్రాలు ప్రత్యేకించి ఆక్సిజన్ లేని వాతావరణాలలో, అంటే చెత్త ప్రదేశాలలో



లోతైన పొరలలో ప్లాస్టిక్‌వ్యర్థాలను క్షీణింపచేస్తాయి. ప్లాస్టిక్‌ను అధోకరణం చేస్తున్నప్పుడు, శిలీంధ్రం దానిని పర్యావరణానికి హానిచేయని సేంద్రీయ సమ్మేళనాలుగా మారుస్తుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, సింథటిక్ పాలిమర్‌లలోని కఠినమైన రసాయన బంధాలను విడదీయగల ఫంగస్ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఎంజైమ్‌ల ద్వారా ఈ ప్రక్రియ సాధ్యమవుతుంది. కాలుష్య కారకాలను శుభ్రపరచడానికి జీవులను ఉపయోగించే ప్రక్రియ అయిన బయోరిమిడియేషన్ (బ్యాక్టీరియా లేదా ఫంగస్‌వంటి జీవుల వాడకంద్వారా పర్యావరణం నుండి కాలుష్య కారకాలను తొలగించడం) కోసం సాధనాలుగా శిలీంధ్రాల సామర్థ్యంపై ఈ ఆవిష్కరణ ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీనిని వాణిజ్యపరంగా అభివృద్ధి చేయడానికి మరిన్ని పరిశోధనలు అవసరం అయినప్పటికీ, మానవ నిర్మిత పదార్థాల వల్ల కలిగే కొన్ని నష్టాలను తొలగించడానికి ప్రకృతి మనకు ఎలా సహాయపడుతుందో చెప్పడానికి పెస్టలోటియోప్సిస్ మైక్రోస్పోరా ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ఫంగస్‌ను వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడానికి మరింత లోతైన పరిశోధనలు అధ్యయనం అవసరమైనప్పటికీ ఇది ప్లాస్టిక్ కాలుష్యాన్ని పరిష్కరించడంలో అద్భుతమైన సామర్థం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఉత్పత్తిదారులకు తక్కువ ఉత్పత్తి వ్యయం, వినియోగదారులకు చౌకైనవి, తేలికైనవి, దృఢమైనవి, మన్నికైనవి, బహుళార్థప్రయోజనకరమైనవి, అచ్చు వేసేందుకు లేదా పోత పోసేందుకు అనువైనవి కావడంతో ప్లాస్టిక్ విస్తృతంగా ఉపయోగించబడుతుంది. ఈ విలక్షణ లక్షణాల కారణంగా ప్యాకేజింగ్ నుండి నిర్మాణం ఆరోగ్య సంరక్షణ వరకు వివిధ పరిశ్రమలలో విస్తృత శ్రేణిలో ప్లాస్టిక్ ఉపయోగించబడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం ప్లాస్టిక్ వినియోగంలో ప్యాకేజింగ్ పరిశ్రమ దాదాపు 40శాతం వాటా కలిగిఉంది. ప్లాస్టిక్‌లతేలికైన స్వభావం, మన్నిక, తక్కువ ఖర్చు, ఉత్పత్తులను సురక్షితంగా ఉంచడంతోపాటు నిల్వ జీవితాన్ని పొడిగించే సామర్థ్యం కారణంగా ప్యాకేజింగ్‌లో వాటికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్లాస్టిక్‌ను ఉపయోగించే పరిశ్రమలలో బొమ్మల పరిశ్రమ ఒకటి. మొత్తం బొమ్మలలో 90శాతం కంటే ఎక్కువబొమ్మలు ప్లాస్టిక్‌తో తయారు చేయబడతాయని ఒక అంచనా. కొన్ని నివేదికల ప్రకారం 80 శాతం వరకు ప్లాస్టిక్ బొమ్మలు కొనుగోలు చేసిన ఒక సంవత్సరంలోపు నిరుపయోగంగా మారి ప్లాస్టిక్ వ్యర్థాలుగా పర్యావరణంలోకి వచ్చి చేరుతాయి. పర్యారణానికి ప్రమాదకరంగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ సమస్యను పరిష్కరించడానికి ముందుగా ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, ప్రత్యేకించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను తగ్గించడానికి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలు అవసరం. వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, పునరుత్పత్తి సేకరణ నిష్పత్తిని పెంచడంసహా సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను అమలుచేయడం ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌లకు బదులుగా పునర్వినియోగించదగిన, స్థిరమైన ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహించడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చు. గ్లోబల్ ప్లాస్టిక్ ఒప్పందం వంటి అంతర్జాతీయ ఒప్పందాలు ప్లాస్టిక్ మొత్తం జీవిత చక్రాన్ని పరిష్కరించే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆదిశగా కృషి చేస్తు న్నాయి. ప్లాస్టిక్ కాలుష్యంతో సంభవించే పర్యావరణ, ఆరోగ్య ప్రమాదాలు ప్లాస్టిక్ పై ఆధారపడటాన్ని తగ్గించడం తోపాటు దానిహానికరమైన ప్రభావాలను తగ్గించడానికి తీసుకోవలసిన చర్యల ఆవశ్యకతను నొక్కిచెబుతున్నాయి. వివిధ పరిశ్రమ వర్గాలతో పాటు వ్యక్తిగత వినియోగదారులు కూడా ప్లాస్టిక్ వినియోగం విషయంలో 3ఆర్ సూత్రాన్ని త్రికరణ శుద్ధిగాపాటించి పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించాలి. •

# ఇక నిమిషకు రక్ష 'బ్లడ్‌మనీ' ఒక్కటే!




## ఆమె మరణశిక్ష ఆపేందుకు అవకాశాలు అతితక్కువ

### సుప్రీంకోర్టులో జరిగిన విచారణ, 18కి వాయిదా

### నర్సు ప్రాణాలు కాపాడాలని జైశంకర్‌కు లేఖరాసిన సిఎం విజయన్

**ఢిల్లీ:** జులై 16న యెమెన్‌లో ఉరిశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ పిటిషన్ సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా హత్య కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న నిమిషను కాపాడేందుకు భారత ప్రభుత్వం వద్ద ఉన్న అవకాశాలు అతితక్కువని కేంద్రం తరపున భారత అటార్నీ జనరల్ సుప్రీం ధర్మాసనానికి నివేదించారు. ప్రియ ఉరిశిక్ష ఉత్తర్వును నిలిపివేయడానికి భారత ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. అయితే, బ్లడ్ మనీ సెటిల్‌మెంట్ మాత్రమే నిమిషను కాపాడగలిగే ఏకైక మార్గం అని ఏజీఐ వెంకటరమణి సుప్రీంకోర్టుకు తెలియజేశారు. నిమిష ప్రియను ఉరిశిక్ష నుంచి దౌత్యపరమైన చర్చల ద్వారా రక్షించేలా భారత ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆమె తరపు న్యాయవాది సుప్రీంకోర్టులో జులై 10వ తేదీన అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ పై విచారణ జరిపింది. కేంద్రం తరపున భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తన వాదనలు వినిపించారు. జులై 16న కేరళ నర్సు మరణశిక్షను ఆపేందుకు లేదా వాయిదా వేయించేందుకు భారత ప్రభుత్వం వద్ద మిగిలి ఉన్న అవకాశాలు అతి తక్కువని తెలిపారు. భారత్ యెమెన్‌ల మధ్య దౌత్యపరంగా సత్సం బంధాలు లేకపోవడమూ ఒక కారణమని అన్నారు. యెమెన్ సున్నితత్వాన్ని దృష్టిపెట్టు కుని కేంద్ర ప్రభుత్వం ఈవిషయంలో పెద్దగా చేయగలిగిందేమి లేదన్నారు. ఇక బ్లడ్ మనీ మాత్రమే నిమిషను కాపాడేందుకు ఉన్న చిట్టచివరి అవకాశమని, అది కూడా ప్రైవేటు ఒప్పందం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నిమిష తరపు న్యాయవాది వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు ఈ కేసు తదుపరి విచారణను జులై 18కి వాయిదా వేసింది. కేసు స్థితి గురించి ఇరువర్గాల తదుపరి విచారణలో కోర్టుకు తెలియజేయవచ్చు అని బెంచ్ తన ఉత్తర్వులో పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ సందీప్ మెహతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ లోగా ఆమె ప్రాణాలు కోల్పోతే అది అత్యంత విచారకరమని అన్నారు. అయితే, ఇప్పటికే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిమిషను ప్రధాని కాపాడాలని కోరుతూ నిన్న విదేశాంగ శాఖ మంత్రి జై జైశంకర్‌కు లేఖ రాశారు. కేరళకు చెందిన నిమిష ప్రియ నర్సు కోర్సు పూర్తి చేసి 2008లో యెమెన్‌లో ఉద్యోగంలో చేరింది. 2011లో ఆమెకు థామస్ అనే వ్యక్తితో వివాహమైంది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి క్లినిక్ తెరవాలనుకున్నారు. యెమెన్‌లో ఇతర దేశస్థులు సొంతంగా వ్యాపారం చేయడం కుదరదు. అందుకని స్థానికుడైన తలాల్ అదిబ్ మెహదితో కలిసి అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను మొదలుపెట్టారు. అయితే, 2014లో నిమిష భర్త, కూతురు ఆర్థిక కారణాల కారణంగా ఇండియాకు తిరిగొచ్చేశారు. నిమిష మాత్రం యెమెన్ అంతర్యుద్ధంలో చిక్కుకుని ఇంటికి తిరిగి రాలేకపోయింది. ఆ తర్వాత నుంచి మెహది ఆమె పాస్ పోర్టు, డబ్బు లాక్కుని చిత్రహింసలకు గురిచేశాడు. దీంతో 2016లో ఆమె పోలీసులకు కంప్లైంట్ చేసింది. అయినా ఫలితం దక్కకపోవడంతో 2017లో ఓ రోజున తన పాస్ పోర్టు తీసుకునేందుకు మెహదీకి మత్తుమందు ఇచ్చింది. దురదృష్టవశాత్తూ డోసు ఎక్కువై మెహదీ చనిపోవడంతో అతడి మృతదేహాన్ని వాటర్ ట్యాంకులో పడేసి సౌదీకి పారిపోయేందుకు ప్రయత్నిస్తూ పోలీసులకు పట్టుబడింది. అనూహ్యంగా హత్య కేసులో ఇరుక్కున్న కేరళ నర్సు నిమిషను కాపాడేందుకు బ్లడ్ మనీ మాత్రమే చివరి అవకాశం. అంటే, మృతుడి కుటుంబం నిమిష కుటుంబం ఇవ్వజూ పుతున్న రూ. 8.6 కోట్ల మొత్తాన్ని పరిహారంగా తీసుకుని క్షమించేందుకు అంగీకరించాలి. యెమెన్ చట్టాల ప్రకారం అలా ఒప్పుకుంటే నిందితుడిని వదిలేసే అవకాశం ఉంది.



## పగలు తేనెలూరే మాటలు.. రాత్రి బాంబు దాడులు

### రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ట్రంప్ ధ్వజం

**వాషింగ్టన్, జూలై 14:** ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలంటూ అమెరికా చేసిన ప్రతిపాదనను రష్యా తోసిపుచ్చింది. దీంతో ఆగ్రహించిన అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై మరోసారి మండిపడ్డారు. ఆయన తీరు తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్న ట్రంప్.. మాస్కోపై ఆంక్షలకు సిద్ధమయ్యారు. మరోవైపు, ఉక్రెయిన్‌కు అత్యాధునిక ఆయుధాలను అందించేందుకు అంగీకరించారు. 'ఆయన (పుతిన్) ఉద్దేశమేంటో అర్థమవుతోంది. పగలు ఆయన చాలా అందంగా మాట్లాడుతారు. రాత్రయితే ప్రజలపై బాంబులతో విరుచుకుపడతారు. అలాంటి ప్రవర్తన మాకు నచ్చట్లేదు' అని ట్రంప్ దుయ్యబట్టారు. ఈ సందర్భంగా మాస్కోపై ఆంక్షలను విధించే అంశాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. 'రష్యాపై కొత్త, కఠిన ఆంక్షలు అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. దీనిపై ఏం చేద్దామో సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) చూద్దాం' అని అన్నారు. కాగా మాస్కోపై ఆంక్షల కోసం ఓ ద్వైపాక్షిక బిల్లును యుఎస్ సెనెటర్లు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రష్యాకు సాయం చేసే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధించేలా ఈ బిల్లును రూపొందించినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ తెలిపారు.


**ఉక్రెయిన్‌కు ఆయుధాలు:** మరోవైపు, రష్యాతో సుదీర్ఘంగా పోరాటం చేస్తోన్న ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించేందుకు ట్రంప్ అంగీకారం తెలిపారు. పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను కీవ్‌కు పంపించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి ఆ దేశానికి చాలా అత్యవసరమన్నారు. అయితే, ఎన్ని ఆయుధాలను పంపిస్తామన్న విషయాన్ని మాత్రం ఆయన చెప్పలేదు. ఉక్రెయిన్‌కు కీలక ఆయుధాల సరఫరాను నిలిపివేస్తామని ఇటీవల ప్రకటించిన ట్రంప్ కొద్ది రోజులకే తన నిర్ణయాన్ని మార్చుకున్న సంగతి తెలిసిందే. ఆ దేశానికి రక్షణాత్మక ఆయుధ వ్యవస్థలను అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఆయుధాలను తాము ఉచితంగా ఇవ్వబోమని తెలిపారు. వీటికి 100 శాతం చెల్లింపులు జరుగుతాయని, మేం వ్యాపారం చేస్తామని స్పష్టం చేశారు.



## యునెస్కో వారసత్వ సంపదలో 'మరాఠా కోటలు'

**ప్యారిస్, జూలై 14:** పారిస్‌లో జరిగిన 47వ యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో భారతదేశం మరో చారిత్రక విజయాన్ని సాధించింది. 'మరాఠా సైనిక కోటలు' యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరాయి. దీంతో భారతదేశంలో ఉన్న యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ల సంఖ్య 44కు చేరింది. ఈ గుర్తింపు మరాఠా సామ్రాజ్యం యొక్క సైనిక చాతుర్యం మరియు కోటల నిర్మాణ కళను ప్రపంచానికి చాటిచెప్పింది. 17వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దం వరకు నిర్మితమైన 12 కోటల సమూహం ఈ సీరియల్ నామినేషన్‌లో భాగం. మహారాష్ట్రలోని 11 కోటలు సల్హేర్, శివనేరి, లోహగఢ్, ఖండేరి, రాయగఢ్, రాజగఢ్, ప్రతాపగఢ్, సువర్ణదుర్గ్, పన్హాలా, విజయదుర్గ్, సింధుదుర్గ్ మరియు తమిళనాడులోని జింజీ కోట ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కోటలు మరాఠా రాజులు, ముఖ్యంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క వ్యూహాత్మక సైనిక దృష్టిని మరియు స్వరాజ్య భావనను ప్రతిబింబిస్తాయి.

## అమెరికా, సౌదీలకు దీటుగా బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా



**మనామా, జూలై 14:** గల్ఫ్ దేశాల్లో శాశ్వత నివాసం కోసం చూస్తున్న వారికి బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా ఒక బంపర్ ఆఫర్ అనొచ్చు. 2022లో ప్రవేశపెట్టిన ఈ వీసా, యూఏఈ గోల్డెన్ వీసా మరియు సౌదీ అరేబియా ప్రీమియం రెసిడెన్సీ కంటే ఎక్కువ స్వేచ్ఛ, తక్కువ ఖర్చుతో కూడిన ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఈ వీసా ప్రొఫెషనల్స్, ఇన్వెస్టర్లు, రిటైర్ అయినవారికి అనువైనదిగా ఉంది. సులభమైన అర్హతలతో, సరళమైన దరఖాస్తు ప్రక్రియతో అందుబాటులోకి తెచ్చారు. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసా యొక్క ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, ఉద్యోగ స్పాన్సర్‌షిప్ లేకుండా పనిచేసే స్వేచ్ఛ. గల్ఫ్ దేశాల్లో సాధారణంగా రెసిడెన్సీ వీసా ఒక నిర్దిష్ట యజమాని లేదా ఉద్యోగ ఒప్పందంతో ముడిపడి ఉంటుంది. కానీ, బహ్రెయిన్ వీసా హోల్డర్లు ఏ యజమాని వద్దనయినా పనిచేయవచ్చు, సొంత వ్యాపారం ప్రారంభించవచ్చు లేదా ఫ్రీలాన్స్‌గా పనిచేయవచ్చు. గల్ఫ్ దేశాల్లో ఇటువంటి వెసులుబాటు చాలా అరుదైన విషయం. ఇది ప్రొఫెషనల్స్‌కు ఆకర్షణీయంగా ఉంటుంది. బహ్రెయిన్‌లో జీవన వ్యయం యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. గృహ, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు రోజువారీ ఖర్చులు చవక అని చెప్పాలి. అయినప్పటికీ ఉన్నత జీవన ప్రమాణాలు పొందవచ్చు. ఈ అంశం కుటుంబాలకు ఆర్థిక ఒత్తిడి లేకుండా దీర్ఘకాల నివాసం కోసం బహ్రెయిన్‌ను ఆకర్షణీయ గమ్యస్థానంగా చేస్తుంది. అదనంగా, ఈ వీసా కుటుంబ సభ్యులను స్పాన్సర్ చేసే సౌలభ్యాన్ని కలిగి ఉంది. ఇతర గల్ఫ్ దేశాల్లో రెసిడెన్సీని కొనసాగించడానికి నిర్దిష్ట సమయంలో దేశంలో ఉండాల్సిన అవసరం ఉంటుంది. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసాదారులకు ఈ ఇబ్బంది లేదు. వీసా హోల్డర్లు విదేశాల్లో ఎంత కాలం ఉన్నా రెసిడెన్సీ స్థితిని కోల్పోకుండా ఉండేలా చేస్తుంది. ఈ సౌలభ్యం గ్లోబల్ ప్రొఫెషనల్స్‌కు బహ్రెయిన్‌ను ఒక స్థిరమైన ఎంపికగా చేస్తుంది. బహ్రెయిన్ గోల్డెన్ రెసిడెన్సీ వీసాకు అర్హత సాధించడం సులభం మరియు సరళమైనది. ఇన్వెస్టర్లు, ప్రొఫెషనల్స్ లేదా రిటైర్ అయిన వాళ్లు ఈ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్థిక స్థిరత్వం, ఆరోగ్య బీమా మరియు నేర చరిత్ర లేని నేపథ్యం వంటివి అర్హతలుగా ఉంటాయి. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా లేదా బహ్రెయిన్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ ద్వారా జరుగుతుంది, ఇందులో ఆర్థిక పత్రాలు, గుర్తింపు పత్రాలు సమర్పించాలి. ఈ ప్రక్రియ యూఏఈ లేదా సౌదీ అరేబియా కంటే సరళమైనది మరియు వేగవంతమైనది. బహ్రెయిన్ యొక్క ఆర్థిక వైవిధ్యీకరణ వ్యూహంలో భాగంగా, విజన్ 2030 కింద ఈ వీసా ప్రవేశపెట్టారు. యూఏఈ యొక్క అధిక ఖర్చులు లేదా సౌదీ అరేబియా యొక్క కఠిన సామాజిక నిబంధనలు అడ్డంకిగా ఉన్నవారికి, బహ్రెయిన్ స్వాగతం చెపుతోంది. భారతీయులకు ఈ వీసా ఒక అందివచ్చిన అవకాశం. ఇది గల్ఫ్‌లో స్థిరమైన, సౌకర్యవంతమైన జీవనాన్ని వాగ్దానం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## ఆ స్విచ్‌లతో జాగ్రత్త.. పైలట్లకు ఎతిహాద్ ఎయిర్‌వేస్ అలర్ట్



**అబుదాబి, జూలై 14:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియాకు చెందిన ఎఐ-171 విమానం కూలిన ఘటనలో ఇంధన స్విచ్‌ల వైఫల్యం వల్ల ఇంజిన్లకు ఇంధనం సరఫరా నిలిచిపోయిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిన విషయం తెలిసిందే. దీంతో బోయింగ్ విమానాల్లో ఇంధన సరఫరా స్విచ్‌లపై చర్చలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ పైలట్లకు పలు సూచనలు జారీ చేసింది. బోయింగ్ 787 విమానాల్లో ఇంధన స్విచ్‌ల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ తమ పైలట్లకు సూచించినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఎయిర్‌లైన్స్ చెందిన అన్ని విమానాల్లో స్విచ్‌లు పనిచేస్తున్న విధానంపై కూడా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదిక వెలువడిన తర్వాత ఎతిహాద్‌దక్షిణ కొరియాకు చెందిన విమానయాన సంస్థలు కూడా తమ పైలట్లకు ఇదేవిధమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) సంస్థ 2018లోనే బోయింగ్ 737 జెట్‌లలోని ఇంధన స్విచ్‌ల వినియోగంపై హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. పలు బోయింగ్ 737 విమానాల్లో లాకింగ్ ఫీచర్‌తో ఉన్న ఇంధన నియంత్రణ స్విచ్‌లు పనిచేయట్లేదని పేర్కొంది. అయితే దీని దర్యాప్తుపై 'ఎయిర్ వర్తీనెస్ బులెటిన్' నుంచి ఆదేశాలు రాకపోవడంతో దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలో కూడా అదే స్విచ్ డిజైన్లు ఉన్నట్లు సమాచారం.

## 'నేరాల రాజధాని'గా బీహార్: రాహుల్

**పాట్నా, జులై 14:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలు విమర్శలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస హత్య ఘటనలపై కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. 'నేరాల రాజధానిగా బీహార్' మారిందని విమర్శించారు. నిరుద్యోగ యువత హత్యలు చేస్తూగూండాలుగా మారుతుంటే సిఎం నితీశ్ కుమార్ మాత్రం తన కుర్చీని కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్నారని ఆరోపించారు. ఈసారి ఓటు అనే ఆయుధాన్ని ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాకుండా బీహార్‌ను కాపాడేందుకువినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టపగలు ఓ లాయర్‌ని, అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా, బిజెపి నేత సురేంద్రకేవాట్‌లు హత్యకు గురయ్యారు. ఈ క్రమంలోనే ప్రభుత్వఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని, వచ్చే అయిదేళ్లలో కోటిమందికి ఉద్యోగాలు కల్పిస్తామని రాహుల్ కీలక ప్రకటన చేశారు.

## ఖైదీ కడుపులోంచి సెల్‌ఫోన్ బయటకు తీసిన వైద్యులు



**బెంగళూరు, జూలై 14:** కర్ణాటకలో ఓ ఖైదీ కడుపు నుంచి సెల్‌ఫోన్ బయటపడింది. కడుపునొప్పి అంటూ ఫిర్యాదు చేసిన బాధితుడిని జైలు అధికారులు ఆస్పత్రికి తరలించగా అతడి కడుపులో సెల్‌ఫోన్ కనిపించింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి సెల్‌ఫోన్ బయటికి తీశారు. భారత న్యాయ సంహితలోని పలు సెక్షన్ల ప్రకారం ఖైదీపై పోలీసు కేసు నమోదు చేశారు. కర్ణాటకకు చెందిన దౌలత్‌ఖాన్ గంజాయి అక్రమ రవాణా కేసులో దోషిగా తేలటంతో పదేళ్ల శిక్ష పడింది. అతను శివమొగ్గ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గతనెల23న కడుపునొప్పి వస్తోందని అధికారులకు ఫిర్యాదు చేశాడు. దౌలత్‌ఖాన్‌ను జైలు వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లారు. అతడిని ఏం తిన్నావని అడగగా, రాయిని మింగినట్లు చెప్పాడు. ఆ తర్వాత తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో 24న శివమొగ్గలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే నిర్వహించిన వైద్యులు ఖైదీ కడుపులో సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించారు. సెల్‌ఫోన్ బయటికి తీయాలంటే శస్త్రచికిత్స చేయాలన్నారు. ఏదో అనుకుంటే మరేదో అయిందనుకున్న ఖైదీ దౌలత్ ఖాన్ చేసేది లేక శస్త్రచికిత్సకు అంగీకరించాడు. శస్తచికిత్స చేసి ఖైదీ కడుపు నుంచి కీప్యాడ్ ఫోన్‌ను బయటికితీశారు. ఈ నెల 8న జైలు అధికారులకు సీల్డ్ కవర్‌లో దాన్ని అప్పగించారు. అదే రోజున ఖైదీని కూడా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. సిబ్బంది సహకా రంతో జైల్లో సెల్‌ఫోన్ వాడిన ఖైదీ అధికారుల సోదాల సమయంలో ఆ విషయం బయటపడ కుండా మింగినట్లు తెలుస్తోంది. ఆ విషయం చెప్పకుండా కడుపు నొప్పి అంటూ దృష్టి మరలించేందుకు ప్రయత్నం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. భారత న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద సదరు ఖైదీపై కేసు నమోదు చేశారు. నిషేధిత వస్తువుల జాబితాలో ఉన్న సెల్‌ఫోన్ కట్టుదిట్టమైన భద్రత ఉండే జైల్లోకి ఎలావచ్చిందనే అంశాన్నితేల్చును న్నట్లు చెప్పారు. జైలుసిబ్బందే ఖైదీకి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తు న్నట్లు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మిథున్ కుమార్ తెలిపారు.

## శవమై తేలిన అదృశ్యమైన ఢిల్లీ విద్యార్థిని



**న్యూఢిల్లీ, జూలై 14:** ఆరు రోజులుగా అదృశ్యమైన ఓ విద్యార్థిని యమునా నదిలో శవమై తేలింది. ఈ ఘటన దేశ రాజధాని ఢిల్లీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిపురకు చెందిన 19 ఏళ్ల స్నేహ దేబ్‌నాథ్ తన ఫ్యామిలీతో కలిసి ఢిల్లీలోని పర్యవరణ్ కాంప్లెక్స్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆత్మ రామ సనాతన్ ధర్మ కళాశాలలో బీఏ మ్యాథమెటిక్స్ చదువుతోంది. అయితే, స్నేహ జులై 7వ తేదీ ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. స్నేహితురాలు పిటునియాను కలిసేందుకు సరాయ్ రోహిల్లా రైల్వే స్టేషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఈనెల 7న ఉదయం 5:15 గంటలకు స్నేహ ఇంటి నుంచి క్యాబ్‌లో బయల్దేరింది. 8:45 గంటల సమయంలో కుటుంబ సభ్యులు స్నేహను సంప్రదించగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో వారు స్నేహ స్నేహితురాలు పిటునియాకు ఫోన్ చేయగా తన వద్దకు రాలేదని చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను సంప్రదించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్నేహ కోసం తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలో స్నేహ సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద కనిపించినట్లు స్థానికులు తెలిపారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సాయంతో యమునా నదిలో విద్యార్థిని కోసం గాలించారు. ఈ క్రమంలో అదృశ్యమైన ఆరు రోజుల తర్వాత ఆదివారం సాయంత్రం సిగ్నేచర్ బ్రిడ్జికి పది కిలోమీటర్ల దూరంలోని గీతా కాలనీ ఫ్లైవర్ సమీపంలో స్నేహ మృతదేహాన్ని గుర్తించారు. స్నేహ కొంత కాలంగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్టు ఆమె స్నేహితులు తెలిపారు.

## ఉరుములు మెరుపుల వర్షాలకు 12మంది మృతి

### మరో ఏడుగురికి తీవ్రగాయాలు



**రాంచి, జూలై 14:** జార్ఖండ్‌లోని వివిధ జిల్లాల్లో ఉరుములు మెరుపులతోకురిసిన భారీ వర్షాలకుగాను 12 మంది చనిపోయారు. మరో ఏడుగురికి తీవ్రవస్థాయిలో గాయాలు కావడంతో వారిని ఆసుపత్రులకు తరలించారు. తమ పొలాల్లో పనిచేస్తున్నపుడే పిడుగులు పడిన శబ్దాలు భారీ వర్షాలకు ఎక్కువమంది చనిపోయారని ప్రభుత్వం ప్రకటించింది. గిరిధ్, దుంకా, జిల్లాల భారీస్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ రెండుజిల్లాల్లోను ముగ్గురుచొప్పున చనిపోయార. చారాలో గీతాదేవి, అనితాదేవిలు పిడుగులుపడి చనిపోయారు. సవితాదేవి తీవ్రస్థాయిలో కాలినగాయాల పాలయ్యారు. గిరిధ్‌లో 18 ఏళ్ల దస్తగిర్ ఆలమ్ 50ఏళ్ల ఝూరియాదవ్‌లు చనిపోగా అశోక్‌మెహతో, ఆయన భార్య ప్రమీలాదేవిలకు తీవ్రగాయాలయ్యాయి. ఇక పశ్చిమ సింగ్‌భుమ్‌జిల్లాలో భరిదా నరగామంలో కూడా 14 ఏళ్ల విద్యార్థి చనిపోయారు. గతజూన్ ఒకటవ తేదీనుంచి జార్ఖండ్‌లో 510 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సగటు సాధారణ వర్షపాతంకంటే 61శాతం అదనపు వర్షపాతం నమోదయింది. అధిక వర్షాలు జనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగించారు. వ్యవసాయ పనులకు విఘాతం కలిగింది. వరిసాగు తీవ్రంగా దెబ్బతిన్నది. 25శాతం నాట్లు వరదలకారణంగా కొట్టుకొనిపోయాయి. తుపాను తరహాలోనే భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని, బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావం ఉందని వెల్లడించారు. పశ్చిమ సింగ్భుమ్, సిండేగా, కుంటి, గుమ్లా జిల్లాల్లో ఇప్పటికే ఆరెంజ్ హెచ్చరికలు జారీచేసారు. రాంచి, లోహార్‌దాగా, గిరిధ్, దేవ్ ఘర్, ధన్‌బాద్, జంతారా, సరాయికేలా, తూర్పు సింగ్‌భుంజిల్లాల్లోకూడా ఎల్లో అలర్ట్ జారీ చేసారు.

## ఈశాన్యభారత్‌లో ఉల్ఫా వేర్పాటువాదులపై భారత్ మెరుపుదాడులు

**న్యూఢిల్లీ, గువాహాటి, జూలై 13:** ఈశాన్య ప్రాంతంలోని వేర్పాటువాద గ్రూపులపై భారత సైన్యం సర్జికల్ దాడులకు దిగింది. మయన్మార్‌లోని తమ శిబిరాలపై భారత సైన్యం డ్రోన్, క్షిపణిదాడులు చేసినట్టు నిషేధిత ఉల్ఫా-ఐ (యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం-ఇండిపెండెంట్)ప్రకటించింది. ఈ దాడుల్లో ముగ్గురు సీనియర్ నాయకులను కోల్పోయామని, దాదాపు 19మంది గాయపడ్డారని వెల్లడించింది. మయన్మార్ సైన్యం సహకారంతో ఉల్ఫా, ఎన్ఎస్‌సీఎన్‌కే (నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్‌ఖప్లాంగ్) స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున భారత సైన్యం డ్రోన్ దాడులు చేసినట్టు సమాచారం. భారత సరిహద్దులోని మయన్మార్‌లో నాగా స్వయం పాలిత ప్రాంతమైన హోయత్ బస్తీలోని ఉల్ఫా తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం, వక్తం బస్తీలోని 779 శిబిరంతోపాటు మరో రెండు శిబిరాలు లక్ష్యంగా రెండు గంటలకుపైగా దాడులు జరిగాయి. ఈ దాడులకు 300కుపైగా డ్రోన్లను వినియోగించినట్టు తెలిసింది. ఈ దాడుల్లో ఉల్ఫా అగ్ర కమాండర్ నయన్ మేధి అలియాస్ నయన్ అసోం మరణించినట్టు ఉల్ఫా తెలిపింది. కాగా, మయన్మార్‌లోని నిషేధిత ఉల్ఫా-ఐ శిబిరాలపై డ్రోన్‌దాడులు చేయలేదనిభారత సైన్యం ఆదివారం స్పష్టంచేసింది. ఉల్ఫా-ఐ చేసిన ప్రకటనను భారత సైన్యం ఓ ప్రకటనలో ఖండించింది.

## భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణించొచ్చు

### విడాకుల కేసులో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు!



**న్యూఢిల్లీ, జులై 14:** భార్యాభర్తల విడాకుల కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి కేసుల్లో భాగస్వామి ఫోన్ సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణించవచ్చని వెల్లడించింది. వారి మధ్య వివాహ బంధం బలంగా లేదనే విషయాన్ని ఆ రికార్డింగ్స్ స్పష్టం చేస్తాయని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై పంజాబ్, హర్యానా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కోర్టు పక్కనపెట్టింది. పంజాబ్‌లోని బఠిండాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. తన పట్ల భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపించిన ఆయన అందుకు సాక్ష్యంగా వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులను సమర్పించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఫ్యామిలీ కోర్టు విడాకుల కేసు విచారణను ప్రారంభించింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ ఆమె పంజాబ్, హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. తన సమ్మతి లేకుండా తనకు తెలియకుండా ఆ సంభాషణలను రికార్డ్ చేశారని వాటిని సాక్ష్యంగా పరిగణిస్తే తన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లేనని వాదించారు. ఆమె అభ్యర్థనను అంగీకరించిన హైకోర్టు ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టింది. దీంతో ఆ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల మధ్య సంభాషణకు సంబంధించిన సీక్రెట్ రికార్డింగ్‌లను సాక్ష్యాలుగా పరిగణిస్తే వైవాహిక బంధాలు ప్రమాదంలో పడతాయని, భాగస్వాములపై నిఘా పెట్టడాన్ని ప్రోత్సహిం చినట్లు అవుతుందని కొందరు వాదిస్తున్నారు. కానీ ఆ వాదన సమర్థనీయమైన దని మేం భావించడం లేదు. ఒకరిపై ఒకరు నిఘా పెట్టే పరిస్థితికి వచ్చారంటే వారి మధ్య వైవాహిక బంధం ఎంతగా బీటలు వారిందో అర్థం చేసుకోవచ్చు. పరస్పరం విశ్వాసం లేదని స్పష్టమవుతోంది. అందుకే ఆ రికార్డింగ్స్‌ను సాక్ష్యాలుగా పరిగణించుకోవచ్చు అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం ఈ విడాకుల కేసులో ట్రయల్ కోర్టు తమ విచారణ కొనసాగించవచ్చని తెలిపింది.

## నెలరోజులుగా కేరళలోనే బ్రిటన్ ఫైటర్‌జెట్!

**తిరువనంతపురం, జూలై 14:** బ్రిటన్ నౌకాదళానికి చెందిన సూపర్ ఫైటర్‌జెట్ ఎఫ్-35 ఇంకా కేరళలోనే ఉంది. ఈ విమానం హైడ్రాలిక్ వ్యవస్థ విఫలం కావడంతో గతనెల 14వ తేదీ తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ లాండింగ్ అయింది. గతవారం తిరువనంతపురం వచ్చిన 24 మంది సభ్యుల బ్రిటిష్ నిపుణుల బృందం ఈ ఫైటర్‌జెట్ రిపేర్లకు కసరత్తులు చేస్తోంది. 14మంది సాంకేతికనిపుణులు, మరో పదిమంది క్రూ సిబ్బంది ఉన్నారు. నెలరోజుల్లో అనేకసార్లు హైడ్రాలిక్‌సమస్య పరిష్కారానికి యత్నించినా అన్నీ విఫలం అయ్యాయి. ప్రస్తుతం ఈ విమానం సమీపంలో బ్రిటన్‌భద్రతా సిబ్బందినే ఉంచారు. భారత సిబ్బంది దూరంగా గస్తీకాస్తున్నారు. సాంకేతిక సిబ్బంది ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే కొన్నిభాగాలు విడదీసి భారీ విమానం అయిన సి-17గ్లోబ్‌మాస్టర్‌లోకి ఎక్కించి బ్రిటన్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇది కేవలం లక్‌హీడ్‌మార్టిన్ ఇంజనీర్లకే సాధ్యం అని నిపుణులు చెపుతున్నారు.

# సంక్షిప్తంగా

## నేషనల్ హెరాల్డ్ కేసులో తీర్పు రిజర్వు




**న్యూఢిల్లీ, జూలై 14:** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌస్‌అవెన్యూ కోర్టు రిజర్వ్ చేసింది. ఈ నెల 29న దీనిపై తీర్పు వెలువరించనుంది. మనీలాండరింగ్‌కు ఇదొక 'క్లాసికల్ ఎగ్జాంపుల్' అంటూ ఇడి ఇంతకుముందు పేర్కొంది. కాంగ్రెస్ అగ్రనేతలు రూ. 2,000 కోట్ల మేరకు నేరపూరిత కుట్ర, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ వివాదానికి కీలకంగా ఉంది. ఇం దు లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి సంయుక్తంగా 76 శాతం వాటా ఉంది. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వాడుకుందని ఇడి ప్రధాన ఆరోపణగా ఉంది.

## విజయ్ బేసిక్ రాజకీయాలు తెలుసుకోవాలి



**చెన్నై, జూలై 14:** తమిళనాడు లో అజిత్ కుమార్ అనే ప్రైవేట్ సెక్యూరిటీగార్డు పోలీస్ కస్టడీలో మరణించిన ఘటన ఆ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. అధికార డీఎంకే (డిఎంకె) బాధ్యతార హిత్యంవల్లే కస్టోడియల్ డెత్స్ జరుగుతున్నాయని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తుం డటంతో ఈ ఘటన రాజకీయ రంగు పులు ముకుంది. అజిత్ కుమార్ కస్టోడియల్ డెత్‌ను నిరసిస్తూ టీవీకే పార్టీ భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టింది. టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. టీవీకే శ్రేణులు భారీ సం ఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విజయ్ అధికార డీఎంకేపై విమర్శలు గుప్పించారు. అజిత్‌కుమార్ కుటుం బానికి ముఖ్యమంత్రి స్టాలిన్ సారీచెప్పడంపై స్పందించారు. సారీ చెబితే సరిపోదని, బాధిత కుటుంబానికి న్యాయంచేయాలని డిమాండ్ చేశారు.

## స్వామినాధన్ స్మారక రూ.100ల నాణెం



**న్యూఢిల్లీ, జూలై 13:** ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూ. 100 విలువ గల నాణెం విడుదల చేస్తూ కేంద్రం అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. స్వామినాథన్‌ను భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశ పెట్టడంలో ఆయన చేసిన కృషి కారణంగా దేశం ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించగలిగింది. ఈ ప్రత్యేక నాణెం 44 మిల్లీ మీటర్ల చుట్టు కొలతతో, 35 గ్రాముల బరువుతో ఉంటుంది. ఇది 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ మిశ్రమాలతో తయారయింది.

## చికెన్ ముక్క కోసం స్నేహితుని విందులో హత్య



**బెళగావి, జూలై 14:** పెళ్లి విందులో చికెన్ ముక్క కోసం స్నేహితుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ.. చివరకు హత్యకు దారితీసింది. విస్మయానికి గురిచేసే ఈ ఘటన కర్ణాటకలోని బెళగావిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెళగావి జిల్లా యరగట్టి తాలూకాకు చెందిన అభిషేక్ కొప్పాడ్ అనే యువకుడికి కొద్ది రోజుల కిందట వివాహం జరిగింది. ఈ క్రమంలో అభిషేక్ తన ఫామ్‌లో స్నేహితులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విందుకు అతడి స్నేహితుడు వినోద్ హాజరయ్యాడు. విట్టల్ అనే వ్యక్తి వడ్డిస్తుండగా.. తనకు చికెన్ తక్కువైందని 'ఇంకొక ముక్క వేయమని' వినోద్ అడిగాడు. దీంతో విట్టల్, తోటి అతిథుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వివాదం చినికిచినికి గాలివానై పెద్ద గొడవకు దారితీసింది. ఘర్షణ పెరగడంతో చివరకు కోపంతో ఊగిపోయిన విట్టల్, పక్కనే ఉన్న ఉల్లిపాయలు కోసే కత్తి తీసుకుని వినోద్‌పై దాడి చేసి, విచక్షణా రహితంగా పొడిచాడు. తీవ్రంగా గాయపడిన వినోద్ రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

# షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

## సమష్టి కృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నదని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషిలోనే పౌష్టిక తెలంగాణ సాధ్యపడుతుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దు తామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు అనుగుణంగా అంగన్‌వాడీ సేవలను మరింత మెరుగుపరుస్తామన్నారు. రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్రస్థాయి సమావేశం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'తెలంగాణ పోషకాహార ప్రణాళిక' రూపొందిస్తామని, అంగన్‌వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీలీటర్ల విజయపాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు.

పోషకాహార తెలంగాణ నిర్మాణం దిశగా భాగస్వామ్య పక్షాలతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. నిపుణుల అభిప్రాయాలను, అనుభవాల ఆధారంగా పోషణ తెలంగాణ కోసం కార్యాచరణను రూపొందించి, అమలు చేస్తామన్నారు. తెలంగాణలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. సేవల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్‌వాడీల్లో ఎన్నో పోషకాలున్న కోడిగుడ్డు సరఫరాను నిలిపి వేయగా.. తెలంగాణలో చిన్నారులు గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. అన్ని రంగాల్లో ముందజలో ఉన్న రాష్ట్రంలో పోషకార లోపంతో పిల్లలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా స్వయం సహాయక బృందాల సహకారాన్ని తీసుకుం టామన్నారు. అంగన్‌వాడీల్లో ఆహారంతోపాటు అక్షరం, ఆరోగ్యం లభిస్తుందని పేరెంట్స్‌కు సూచించారు. ఇక నిర్మాణ సౌకర్యం లేని ప్రాంతాల్లో మొబైల్ అంగన్‌వాడీలను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇక అంగన్‌వాడీ కేంద్రా లను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆసక్తిని తెలిపిన నేపథ్యంలో అవసరమైన ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా పోషన్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూర గాయల విత్తనాలతో కూడిన సీడ్స్‌కిట్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపి ణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో పాలకూర, తోటకూర, మెంతి కూర, టమాట, వంకాయ, బెండకాయ విత్తనాలు ఉన్న ట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని పెంచి లబ్ధిదారులకు వండిపెట్టేలా చర్యలు తీసుకుం టామ న్నారు. ఈ సమావేశంలో పోషకారంపై పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్‌టిఆర్ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళాసభ ఛైర్మన్, బాలరక్ష భారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

# ఫీజులు, స్కాలర్‌షిప్‌ల బకాయిలు తక్షణమే చెల్లించాలి

### ఫీజుల కోసం బ్యాంకు ట్రస్టు ప్రతిపాదన వద్దు

### ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీతో బిసి నాయకుల చర్చలు

**హైదరాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** ఫీజులు, స్కాలర్‌షిప్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఫీజుల కోసం బ్యాంకు ట్రస్టు ప్రతిపాదన విరమించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో సోమవారం ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును సచివాలయంలో కలిసి కోరారు. పేద విద్యార్థులకు విద్యా అవకాశాలను కల్పించేందుకు 100 బీసీ కాలేజ్ హాస్టళ్లు, 120 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలి, కొనసాగుతున్న గురుకులాల్లో 30 సీట్ల చొప్పున పెంచాలని, 6000 కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, జిల్లపెల్లి అంజి, బి.కృష్ణయాదవ్, మోడీ రాందేవ్, రాఘవేందర్, అశోక్ పాల్గొన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత చదువులు మానేసి పరిస్థితి ఏర్పడిందని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు, ఒకవైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా ఇంకొక వైపు ఫీజుల స్కీములు ఎత్తివేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. వసతి సౌకర్యం ఉన్నచోట అదనపు సెక్షన్లు ప్రారంభించాలని, ప్రతి క్లాసులో 20 సీట్ల చొప్పున అదనంగా పెంచాలని కోరారు. కొత్తగా 100 బీసీ కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని కృష్ణయ్య చీఫ్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు.

# దోస్త్ దరఖాస్తు గడువును పొడిగించాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి

### బిసి సంక్షేమ సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 దరఖాస్తు గడువును పొడిగించాలని బిసి సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్‌తో కలిసి .. జాజుల లింగంగౌడ్ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ దరఖాస్తు గడువు పొడిగించాలని దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఎప్ సెట్ కౌన్సిలింగ్‌ను దృష్టి లో పెట్టుకొని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ దరఖాస్తు గడువు ను పొడిగించాలని కోరారు. పరిశీలిస్తామని కన్వీనర్ చెప్పారని ఆయన తెలిపారు.

# వరంగల్‌లో మహిళా డాక్టర్ ఆత్మహత్య

### అనాథలైన చిన్నారులు



డాక్టర్ ప్రత్యూష

**హన్మకొండ బ్యూరో, జూలై 14, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లాకు చెందిన యువ డాక్టర్ ప్రత్యూష సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాలో కలంకం రేపింది. తన భర్త సైతం డాక్టర్ కావడం అత నికి మరో స్త్రీతో అక్రమ సంబంధం ఉందని అనుమానంతో ఆత్మహత్యకు పాల్పడిందని అనుకుం టున్నారు. ప్రత్యూష తండ్రి మాత్రం తన బిడ్డను అల్లు డు వేధించి కొట్టేవాడని, మరో స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అని పోలీస్ ఫిర్యాదు పేర్కొన్నాడు. మొత్తానికి ఏదేమైనా యువడాక్టర్ ప్రత్యూష ఆత్మహత్య ఇద్దరు చిన్నారులను అనాథలుగా చేసింది. డాక్టర్ ఆత్మ హత్య స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన జాతర

### బంద్ అయిన బలిని భవిష్యవాణిలో అడిగిన అమ్మ

### అధికారులతో చర్చించి నిర్ణయిస్తాం: మంత్రి పొన్నం

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 14, ప్రభాతవార్త:** సికిందరాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆషాఢ బోనాల జాతర అంగరంగ వైభవంగా జరి గిందని, ప్రజలు, అధికారులు సహకరించారని, జాతర ప్రశాంతంగా ముగిసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రంగం కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అమ్మ వారి ఆషాడ బోనాల జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని సాక, బోనాలు సమర్పించారని, గడచిన ఏడాది కంటే ఈ ఏడాది అధికసంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారని ఆయన తెలియజేసారు. భవిష్యవాణిలో ఈ యేడాది రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని చెప్పారన్నారు. రంగం భవిష్యవాణిలో దేవాలయానికి సంబంధించి కొన్ని సూచనలు చేసారని, శాస్త్రీయంగా అన్ని రకాల పూజలు జరిగాయన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎలాంటి లోపం రానివ్వమని అన్నారు. 1815లో ఏర్పడిన ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆలయంలో ఆషాఢ బోనాల జాతర సందర్భంగా బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసామన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలన్నారు. 60, 70 సంవత్సరాల క్రితం బంద్ అయిన బలిని ప్రస్తావించారు. దేవాదాయ శాఖ అధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం. అకాల మరణాలు, అగ్నిప్రమాదాల నివారణకు అమ్మవారి ఆశీర్వాదం అడిగామని, జాతరకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలకు మంత్రి పొన్నం కృతజ్ఞతలు తెలియజేసారు.

# సిటీ టాస్క్‌ఫోర్స్‌లో మరోఅదనపు డిసిపి నియామకం



ఇక్బాల్ సిద్ధిఖీ

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్‌లో మరో అదనపు డిసిపిని నియమించారు. ఈ విభాగంలో ఇప్పటి వరకు ఒక డిసిపితో పాటు మరో అదనపు డిసిపి మాత్రమే వుండగా కొత్తగా నియామకమైన అదనపు డిసిపితో అధికారుల సంఖ్య మూడుకు చేరింది. టాస్క్‌ఫో ర్స్‌కు పూర్తిస్థాయి యూనిట్ అధికారిగా నాన్ కేడర్ ఎస్పిగా వున్న వైఎస్ సుధీంద్ర (ఈయన గ్రూప్ వన్ అధికారి) వున్నారు. ఆయన ప్రస్తుతం ఉ త్తర, పశ్చిమ, దక్షిణ పశ్చిమ, మధ్య మండలాలను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. సుధీంద్రకు సహాయకుడుగా పాతబస్తీలోని పురానిహవేలిలో గల సిటీ కమిషనర్ కార్యాలయం కేంద్రంగా పనిచేసే టాస్క్‌ఫోర్స్ విభాగం అదనపు డిసిపిగా అందె శ్రీనివాస్ వున్నారు. ఈయన 1991 బ్యాచ్ ఎస్ఐగా సి టీ పోలీసు విభాగంలో చిరపరిచితమైన అధికారి. పోలీసు శాఖలో విశేష అనుభవం వున్న అధికారి. ఈయన పరిధిలో తూర్పు, దక్షిణ, దక్షిణ, తూ ర్పు మండలాలు వున్నాయి. ఇక కొత్తగా నియామకమైన అదనపు డిసిపి సిటీ పోలీసు విభాగంలో చిరపరిచితమైన మరో అధికారి ఇక్బాల్ సిద్దిఖీ. 1989 బ్యాచ్ ఎస్ఐగా పోలీసు శాఖలో సుదీర్ఘ అనుభవం ఆయన సొంతం. ఇంతకు ముందు సిటీ పోలీసు విభాగంలో పలుచోట్ల పనిచేసి మంచి పేరు గడించారు. ప్రస్తుతం సిసిఎస్ అదనపు డిసిపిగా వున్నారు. ఇక్బాల్ సిద్ధిఖీకి పశ్చిమ, దక్షిణ, పశ్చిమ మండలాలను కేటాయించారు. ఈయన ఎక్కడ నుంచి విధులు నిర్వహిస్తారనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం లేదా ఎసి గార్డ్స్‌లోని పశ్చిమ మండల డిసిపి కార్యాలయంలో కొత్త కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి విధులు నిర్వహించే వీలుందని తెలిసింది. రెండు మూడు రోజుల్లో టాస్క్ ఫోర్స్ కొత్త అదనపు డిసిపి ఇక్బాల్ సిద్ధిఖీ బాధ్యతలు చేబట్టనున్నారు.

# 81 మంది జెఎల్స్‌కు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

### ఇంటర్ విద్య కమిషనరేట్‌లో కౌన్సెలింగ్

### కొత్త బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలి: ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణఆదిత్య


**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న సీనియర్ మోస్ట్ జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు పొందారు. 81 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యా సంచాలకులు కృష్ణ ఆదిత్య 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి జయప్రదా బాయి, మెడ్చల్, రంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు(డిఐఈవో) హాజరయ్యారు. పదోన్నతి పొందిన లెక్చరర్లను డైరెక్టర్ అభినందిస్తూ.. తమ కొత్త బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యారంగాన్ని మెరుగుపరిచే దిశగా నాయకత్వ భాధ్యతల్ని సమర్థంగా నెరవేర్చాలని ఆకాంక్షి ంచారు. పదోన్నతుల ప్రక్రియలో ప్రతిభకు, సేవలకు ప్రాధాన్యం ఇస్తూ, పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామని డైరెక్టరేట్ మరోసారి హామీ ఇస్తుందని తెలిపారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 81 మంది అర్హులైన జూనియర్ లెక్చరర్లకి ప్రిన్సిపాల్‌లుగా పదోన్నతి ఇవ్వడం కోసం సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించారు. పదోన్నతుల అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ కొనసాగుతున్నట్టు అయింది. పదోన్నతులు పొందిన వారిలో తెలంగాణ ఇంటర్ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(టిగ్లా) రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య కూడా ఉన్నారు. పదోన్నతి పొందిన అనంతరం ఆయన మహబూబ్‌నగర్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకోవడం జరిగింది. జూనియర్ లెక్చరర్స్‌కి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ విద్య డైరక్టర్ కృష్ణ ఆదిత్యకి టిగ్లా నేతలు మాచర్ల రామకృష్ణగౌడ్, నయీమ్ పాష, డాక్టర్ పరశురాములు, దుర్గాప్రసాద్, ముడి శేఖర్ దన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# మరో మహమ్మారి రాబోతోంది..

### అగ్నిప్రమాదాలు సంభవిస్తాయి.. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి

### బాలలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు

### నా రూపాన్ని ప్రతిష్ఠించండి లేదంటే రక్తం కక్కుతారు: రంగం(భవిష్యవాణి)లో స్వర్ణలత



భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 14, ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో మరో మహ మ్మారి విజృంభించనుంది. అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. బాలలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. నా రూపాన్ని ప్రతిష్టించండి. లేదంటే రక్తం కక్కుతారు అంటూ అమ్మవారు రంగం (భవిష్యవాణి) కార్యక్రమంలో స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. సికింద రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ బోనాల ఉత్సవాల్లో రెండో రోజు ప్రధాన ఘట్టమైన రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఎదురుగా పచ్చికుండపై నిల్చుని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదేనన్నారు. రాబోయే రోజుల్లో మరో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమా దాలు కూడా సంభవిస్తాయని తెలి పారు. భక్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పాడిపంటలు బాగా పండుతాయని చెప్పారు. బాలబాలికలను మీరు (తల్లిదండ్రులు) విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, కానీ నేను కడుపులో పెట్టుకుని కాపాడు కుంటున్నానని, ఈసారి చాలా సంతో షంగా పూజలు చేసారు. మీ అందరినీ సంతోషంగా చూస్తాను. మీ అరికాలిలో ముల్లు నా నాలుకతో తీస్తాను. కాలం మీరితే ఎవరు ఏది అనుభవిం చాలో అది అనుభవిస్తారు. నేను మాత్రం అడ్డురాను అంటూ స్వర్ణలత భవిష్యవాణి వినిపిం చారు. నా ప్రజలందరూ సంతోషంగా, ఆనందంగా సాకలతో ఘనంగా నన్ను వేడుకున్నారు. సంతోషంగా జాతర చేసారు. ప్రతియేటా ఏదో ఒక ఆటంకం చేస్తూనే ఉన్నారు. నన్ను లెక్క చేయ డం లేదు. ప్రతియేటా చెప్తున్నా.. నా కోరిక నెరవేర్చడం లేదు. నా బిడ్డలం దరినీ నా కడుపులో పెట్టి కాపాడుకుంటాను. బండి అంత కాకపోయినా గోరం తైనా ఇయ్యరా బాలకా. నా పూజలన్నీ సక్రమంగా జరపాలి. నాకు రక్తం చూపించమని అడుగుతున్నా, నాలుగు కాళ్లది కాకున్నా చిన్నదైనా చూపించరా బాలకా. నేను కోపం చూపడం లేదు. సక్రమంగా పూజలు జరిపించండి. కన్నెర్ర జేస్తే రక్తం కక్కుకు ఛస్తారు. నాది మాత్రం తప్పకుండా ఉంటుంది. ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు. కొద్దిగైనా నాకు రక్తం చూపించండి. వాగ్దానం తీసుకుంటున్నారు. నా రూపానికి కూడా అడ్డు పడుతున్నారని, ఈ యేడు జరిపించకపోతే వారు రక్తం కక్కుకుని ఛస్తారు. నన్నుకొలిచే వారిని చల్లంగా చూసుకుంటా. తోడు నీడై నిలబడతా. రాష్ట్రాన్ని, దేశాన్ని మహమ్మారి వెంటాడుతుంది. జాగ్రత్తగా ఉండండి. ముందే హెచ్చ రిస్తున్నా. ఈ యేడాది నాకు ఐదు వారాల పాటు పప్పుబెల్లాలతో సాక, సమర్పించండి. పసుపు, కుంకుమలతో ఆనందపర్చండి. కోరిందల్లా కొంగు బంగారం చేస్తా. నా రూపాన్ని నిలబెట్టి నాకు రక్తం చూపించకపోతే అల్ల కల్లోలం చేస్తా. ఎవరు ఆపినా ఆగను. ప్రాణానికి హానీ చేయను. రక్తం చిందిస్తాను అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

## నిందితునిపై పోక్సో కేసు నమోదు

# బాలికపై అత్యాచారయత్నం

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), జూలై 14, ప్రభాతవార్త:** యుకెజి చదువుతున్న బాలికపై స్కూల్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో యుకెజి చదువుతున్న నాలుగేళ్ల చిన్నారిని రోజుమాదిరిగా స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈ నెల 4న ఇంటి నుండి స్కూల్ కు తీసుకొచ్చాడు. అనంతరం స్కూల్‌లో మధ్యాహ్నం సమయంలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నం చేశాడు. దీంతో బాలిక భయాం దోళనకు గురై ఆరోజు ఇంటికివెళ్లి తిరిగి స్కూలుకు వెళ్లలేదు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో సోమవారం ఉదయం చిన్నారి తల్లిదండ్రులు స్కూలుకు చేరుకొని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. స్కూల్ డ్రైవర్ స్కూల్‌కి రాక పోవడంతో ఫోన్‌చేసి ప్రిన్సిపాల్ పిలిపించాడు. ఫోన్‌చేసిన గంట తర్వాత డ్రైవర్ ద్విచక్రవాహనంపై స్కూల్‌కి రావడంతో అప్పటికే కోపోద్రిక్తంగా ఉన్న తల్లిదండ్రులు, ఇతర పిల్లల తల్లిదండ్రులు డ్రైవర్ కనిపించడంతో ఒక్కసారిగా దాడికి దిగారు. దీంతో స్కూల్ యాజమాన్యం అప్పటికే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను దాడి నుండి తప్పించి పోలీసువ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఇదే విషయంపై తల్లిదండ్రులతోపాటు మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యంపై సంఘటన జరిగి ఇన్నిరోజులు కావస్తున్నా ఎందుకు స్పందిం చలేదని ప్రశ్నించడంతో తమకేమీ తెలియదంటూ తప్పుకునే ప్రయత్నం చేశారు. కాగా పోలీసులు స్కూల్లో ఉన్న సిసిటివి పుటేజి హార్డ్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకొని బాధిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం నమోదు చేసినట్లు సిఐ విజయవర్ధన్ తెలిపారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యుఎస్‌పిసి దశలవారీగా పోరాటం

### 23 నుంచే ఉద్యమం ప్రారంభం

### ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

### 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా

### యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలతోపాటు విద్యారంగ సమస్యలపై ఉద్యమబాట పట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్‌పిసి) నిర్ణయించింది. ఈ నెల 23 నుంచి ఉద్యమ కార్యాచరణను ప్రారంభించాలని ఆగస్టు 23న హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ సమావేశం ఎం సోమయ్య అధ్యక్షతన జరిగింది. యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ఎ. వెంకట్, చకినాల అనిల్‌కుమార్, నన్నెబోయిన తిరుపతి, టి లింగారెడ్డి, యస్ హరికిషన్, బి కొండయ్య, యం సైదులు, డి రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడిచినప్పటికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో తీవ్రమైన జాప్యాన్ని ప్రదర్శిస్తుందని విమర్శించారు. మేనిఫెస్టోలో పొందుపరచిన ఎన్నికల హామీలను అమలు పరచడం లేదని.. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి, నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలన్నారు.

ఉపాధ్యాయుల పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 పిఎస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, డిఎడ్, బిఎడ్ అర్హతలున్నప్రతి ఎస్‌జిటికి పిఎస్‌హెచ్‌యం ప్రమోషన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పండిట్, పిఈటిల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఒ 2, 3, 9, 10లను రద్దు చేసి జిఒ 11, 12 ల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి అనేక మార్లు ప్రాతినిధ్యం చేసినప్పటికి మంత్రులు, ఆఫీసర్ల కమిటీలు వేసినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ తీర్మానించిందని నాయకులు తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో మండల తహసీల్దార్ల ద్వారా ముఖ్యమంత్రికి మెమోరాండాలు ఇవ్వాలని, ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

# 11 స్టేషన్లలో పునరాభివృద్ధి పనుల పురోగతి భేష్

### రైల్వే కార్యకలాపాల భద్రతపై

### జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సమీక్ష

**హైదరాబాద్ (తార్నాక), జూలై 14, ప్రభాతవార్త :** రైలు కార్యకలాపాల భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, భద్రతపై సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. అదేవిధంగా మధ్య రైల్వేలో చేపట్టిన స్టేషన్ పునరాభివృద్ధి పనుల పురోగతిపై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అద నపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ అన్ని ప్రధాన విభాగాధి పతులతో పాటు పాల్గొన్నారు. సికిందరాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు మరియు నాందేడ్ వంటి ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) విడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జోన్‌లోని 119 స్టేషన్లలో సుమారు రూ. 6744 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనుల స్థితిగతులపై సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సమీక్ష నిర్వహించారు (వీటిలో, బేగంపేట, వరంగల్ కరీం నగర్ అనే 3 స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి ఇటీవల ప్రధానమంత్రిచే ప్రారంభించ బడ్డాయి). ప్రధాన కార్యాలయం ఆరు డివిజన్ల సంబంధిత అధికారులు పునరాభివృద్ధి కోసం గుర్తించిన స్టేష న్లపై వాటి డివిజన్, ప్రాజెక్ట్ ఖర్చు, పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్న తేదీ, పని యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరణాత్మక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జోన్ వ్యాప్తంగా 11 స్టేషన్లలో ప్రధానంగా చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతి స్థితిపై జీఎం ప్రశంసించారు. ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి పనుల వేగంతో కొనసాగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించాలని మరియు పనుల నాణ్యతను తప్పకుండా నిర్ధారించాలని కూడా ఆయన అధికారులకు సూచించారు. ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పని ప్రదేశాలలో సరైన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

సమావేశంలో, జోన్ అంతటా లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద అనుసరిస్తున్న భద్రతా జాగ్రత్తలను సంజయ్ కుమార్ సమీక్షించారు. గుర్తించబడిన ప్రమాదలకు అవకాశం గల లెవెల్ క్రాసింగ్ గేట్లపై ఆయన ప్రత్యేక దృష్టి సారించాలని క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, సిబ్బందికి కౌన్సిల్ ఇవ్వాలని, అన్ని భద్రతా విధానాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్‌ల భద్రత, పరికరాల లభ్యత మొదలైన వాటికి సంబంధించి జోన్ చేపట్టిన వివిధ భద్రతా డ్రైవ్‌ల స్థితిని కూడా జనరల్ మేనేజర్ సమీక్షించారు. అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాక్ భద్రత, విద్యుత్ మరియు సిగ్నలింగ్, మెకానికల్ వస్తువులు, వర్షాకాలంలో పాటించవలసిన జాగ్రత్తలపై జీఎం సుచనలు చేశారు.

**అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : శ్రీవాత్సవ**

**అడ్డగుట్ట :** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజీమ్ కుమార్ శ్రీ వాత స్వ రైల్వే ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్, సర్క్యూలేటింగ్ ఏరియాల్లో చేపడుతున్న అభివృద్ధి చర్యలపై అధికారులు, ఇంజనీర్లతో చరి ్చంచారు. రైల్వే స్టేషన్ పున నిర్మాణ ప్రణాళికలు, పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిఎంకు వివరించారు. అదే విధంగా ఫ్లాట్ ఫారమ్ 1 నుంచి, ఫ్లాట్ నెం 10 వరకు ఇరువైపుల జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. ప్రయాణికుల రద్దీ నిర్వాహన, భద్రత, సహాయక చర్యలపై ప్రత్యేక దృషి ్ట పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్.ఎం. బర్తేష్ కుమార్ జైన్, సీనియర్ అధికారులు జిఎం వెంట ఉన్నారు.




సమీక్ష సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

# పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే కొత్త అటెండెన్స్ వ్యవస్థ!

**న్యూఢిల్లీ, జూలై 14:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే నూతన హాజరు వ్యవస్థను అందుబాటులోకి కేంద్రం తీసుకువస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం ఇకపై లాబీలో కాకుండా సభ్యులకు కేటాయించిన సీటు వద్దే హాజరు వేయాల్సి ఉంటుందని వివరించింది. కొన్ని సార్లు లాబీలు ఎంపీలతో నిండి ఉంటాయని, ఇలాంటి సందర్భాల్లో సమయం ఆదా అవుతుందని పేర్కొంది. ఇంకా కొంత మంది ఎంపీలు లాబీలోనే అంటెండెన్స్ వేసి కార్యకలాపాల్లో పాల్గొనకుండా వెళ్లిపోతున్నారని తెలిపింది. ఈ కొత్త అటెండెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు స్పీకర్ ఓం బిర్లా ఆసక్తి చూపుతున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే కొంత కాలం పాటు ఎంపీలకు అలవాటు అయ్యే వరకు పూర్వం లాగే లాబీలోనూ అటెండెన్స్ పద్ధతి కొనసాగుతుందని వివరించాయి. పార్లమెంట్‌ను పేపర్‌లెస్ మార్చే ప్రయత్నాల్లో అటెండెన్స్‌ను కూడా డిజిటల్ పద్ధతిలోకి మారుస్తామని గతేడాది స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇందులో భాగంగా మంత్రులు, ప్రతిపక్ష నేత హాజరులో సంతకం చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో రోజువారీ భత్యాలను పొందేందుకు సభ్యులు తమ హాజరును గుర్తించాల్సి ఉంటుంది.
ఎంపీలు సభలో, చర్చల్లో ఎంత సమయం పాల్గొన్నారనే విషయం తెలుసుకునేందుకు హాజరును లెక్కిస్తారు. కాగా, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు సాగనున్నాయి. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా ఆగస్టు 13,14 తేదీల్లో సమావేశాలు ఉండవు అని రిజిజు వివరించారు. వర్షాకాల పార్లమెంట్ సెషన్ నేపథ్యంలో జులై 19న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12తో ముగియనున్నట్లు పేర్కొంది. కానీ ఇప్పుడు మరో వారం రోజుల పాటు పొడిగిస్తూ నిర్ణయించింది. ప్రభుత్వం ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టేందుకు కసరత్తులు చేస్తోంది.



# ఎయు స్మాల్ ఫైనాన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ఎల్ఐసి



**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** దేశంలోని అతిపెద్ద జీవిత బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ ఏజెన్సీ ఏర్పాటు కింద భారతదేశంలోని ప్రముఖ చిన్న ఫైనాన్స్ బ్యాంకులలో ఒకటైన ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించి రెండు సంస్థల సీనియర్ ప్రతినిధులు తమ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంతో ఆర్థికంగా ఇటు ఏయు ఫైనాన్స్ సంస్థకు అటు బీమా పరంగా ఎల్ఐసికి సంస్థకు ఎంతో దోహదపడుతుంది. అంతే కాకుండా ఏయు స్మాల్ ఫైనాన్స్ సంస్థ బలమైన గుర్తింపు పొందుతుంది. అంతే కాకుండగా గ్రామాల్లో అధికంగా ఉండే పేదలకు ఏయు సంస్థ ద్వారా బీమా సౌకర్యాన్ని కల్పించ వచ్చు. ఈ రెండు సంస్థలు ఇటు బ్యాంకింగ్ రంగంలోనే కాకుండా అటు బీమా రంగంలో కూడా ఒకదానికి ఒకటి అండగా నిలిచేందుకు అవకాశం ఉంటుంది. ఎల్ఐసికి దేశవ్యాప్తంగా 3600 బ్రాంచ్‌లు ఉండగా, ఏయు ఫైనాన్స్ సంస్థకు 3600 దేశ వ్యాప్తంగా 2500 టచ్ పాయింట్లు ఉన్నాయి. ఈ రెండు సంస్థలు 2047 నాటికి తమ సంస్థల అభివృద్ధే లక్ష్యంగా సాగుతాయని ఆయ సంస్థల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్ర ఎన్నికల సంఘం ఇన్‌చార్జ్ సెక్రటరీగా మకరంద్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 14:** రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి మంద మకరంద్ నియమితులయ్యారు. సోమవారం మసాబ్యాంక్లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్‌కు చెందిన మకరంద్ ప్రస్తుతం సీసీఎల్ఏ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఎన్నికల సంఘం కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఐఏఎస్ అధికారికి కార్యదర్శిగాబాధ్యతలు అప్పగించారు.

## పబ్లిక్ హెల్త్, మున్సిపల్‌లో 44 మంది ఎఇఇలకు డిఇఇలుగా ప్రమోషన్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 14:** చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్ల సమస్య కొలిక్కి వచ్చింది. తెలంగాణ పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని 44 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినర్లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా ప్రమోషన్లు కల్పించారు. దీంతోపాటు ప్రమోషన్లు పొందిన 20డీఈఈలకు జీహెచ్ఎంసీలో పోస్టింగ్ ఇచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీ దవలప్ మెంట్ ఆథారిటీ(ఎఫ్సీడీఏ)లో ఒకరు, హైడ్రాలో ఇద్దరికి పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన నిజామాబాద్, రామగుండం, వనపర్తితోపాటు ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో డీఈఈలకు పోస్టింగ్ ఇచ్చినట్టు ఈఎన్సీ ఎస్.భాస్కర్ రెడ్డి తెలిపారు. డీఈఈ నుంచి ఈఈ, ఈఈ నుంచి ఎస్ఈ లకు సంబంధించిన ప్రమోషన్లను సైతం ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి 453మంది ఇంజినీర్లు కావాలని రాష్ట్రప్రభుత్వానికి గతంలో లేఖ రాశారు. అయితే జనాభా పెరుగుదల, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా అప్ గ్రేడ్ చేసిన సందర్భంగా అదనపు పోస్టుల కోసం మరోసారి ప్రతిపాదనలు పంపించాలని నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ఇంజినీర్లను ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడంతోపాటు ఆర్థికశాఖ క్లియరెన్స్ కూడా ఇచ్చింది.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 17 వరకు దరఖాస్తు చేసుకోవాలి

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధాయులు, ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 కోసం ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య డైరక్టర్ ఉపాధ్యాయులకి సూచించారు. దరఖాస్తు దారులు తమ డాక్యుమెంట్లను ఈ నెల 20 వరకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. 2025 సంవత్సరానికిగాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లిటరసీ, గవర్నమెంట్ అఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారు నిర్వహిస్తున్న అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మార్గదర్శకాల కొరకు పైన పేర్కొన్న మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ లిటరసీ, గవర్నమెంట్ అఫ్ ఇండియా, న్యూఢిల్లీ వెబ్ సైట్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఉత్సాహం ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## రోగి ముందే భార్యపై వార్డుబాయ్ అత్యాచారయత్నం

### నిందితుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్త ఎదుటనే భార్యపై వార్డుబాయ్ అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సదరు బాధితురాలు కేకలు వేయడంతో తోటి రోగుల బంధువులు అప్రమత్తమై కామంధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన సీతారాం (23) విద్యా నగర్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ఆసుపత్రిలో వార్డుభాయ్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఉప్పల్‌కు చెందిన దంపతుల్లో భర్తకు హైబీపీ ఉండడంతో రెండు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరాడు. ఐసీయూలో చికిత్స పొంది సాధారణ వార్డులోకి మార్చారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సదరు రోగి అయిన భర్త బెడ్‌పై పడుకోవడాన్ని వార్డుబాయ్ గమనించి బెడ్‌షీట్ మార్చాలనే సాకుతో గదిలోకి వచ్చాడు. రోగి గాఢా నిద్రపోతున్న సమయాన్ని భావించి అతడి భార్య చేతిని పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా అత్యాచారయత్నానికి పాల్పడడంతో రోగి భార్య మేలుకొని గట్టిక కేకలు వేయడంతో పక్క రూంలోని ఉన్న రోగి బంధువులు, సిబ్బంది హుటాహుటీన వచ్చారు. విషయాన్ని చెప్పడంతో సదరు సీతారంను చితకబాదారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఏసీపీ జగన్, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రావు ఆసుపత్రికి వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు సీతారాం

**వార్డుభాయ్ మానసిక రోగి అని తెలిసింది: డా.ఉమాపతి**

వార్డుభాయ్ మానసిక రోగి అని బంధువులు చెప్పే తెలిసింది. గత కొంతకాలంగా ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రిలో చికిత్స పొంది మందులు వాడుతున్నాడని చెప్పారు. ఇటీవల నుంచి వాడడం లేదు. ఇందుకు సంబంధించిన ప్రిస్కిప్షన్లు, మందులు చూపించారు. ముందు తమకు తెలిస్తే ఉద్యోగంలోకి తీసుకోకుండ ఉండేవాళ్లమని ఉమాపతి పేర్కొన్నారు.

# రేషన్ కార్డుల పంపిణీ దేశ చరిత్రలో చరిత్రాత్మకం

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** నిరుపేదలకు తెల్లరేషన్ కార్డుల మంజూరులో యావత్ భారత దేశంలో నే తెలంగాణా రాష్ట్రం రోల్ మోడల్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర చరిత్రలోనే చరిత్రాత్మక సందర్భంగా ఆయన అభివర్ణించారు. ఏక కాలంలో 5.61 లక్షల పై చిలుకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసి రాష్ట్ర జనాభాలో 80!! నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చెస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణా నిలిచిందని ఆయన తెలిపారు. సూర్యపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి లో సోమవారం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు మందుల సామేల్ అధ్య క్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగిస్తూ అర్హులైన వారందరికీ రేషన్ కార్డు లను అంద జేస్తామని, కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసా గుతుందన్నారు. ఆహార భద్రతకు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పెద్ద పీట వేయడంతో పాటు యూ.పి.ఏ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందని ఆయన గుర్తుచేశారు. అధినేత్రి సోనియాగాంధీ ఆలోచనా విదానాన్ని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అమలులోకి తెచ్చామన్నారు. పదేళ్ల బి.ఆర్ ఎస్ పాలనలో అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయక పోగా కనీసంలో కనీసం అప్పటికే ఉన్న తెల్ల రేషన్ కార్డులలో కొత్త సబ్యులను చేర్పించ లేకపోయారని ఆయన మండిపడ్డారు. 11 సంవత్సరాల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరు వంటి విపలవాత్మకమైన నిర్ణయం తీసుకున్న మీదట రాష్ట్రంలో లబ్ధిదారుల సంఖ్య 3.09 కోట్లకు చేరుకుందన్నారు. తెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ రాష్ట్రంలో మహత్తరమైన మార్పుకు సంకేతంగా నిలిచి పోతుందన్నారు.

## ప్రముఖ మోడల్ సాన్‌రేచల్‌గాంధీ ఆత్మహత్య

**పుదుచ్చేరి, జూలై 14:** పుదుచ్చేరికి చెందిన ప్రముఖ మోడల్, సోషల్ మీడియా పర్సనాలిటీ సాన్ రేచల్ గాంధీ (26) ఆత్మహత్య చేసుకున్నారు. ఏడాది క్రితం వివాహం చేసుకున్న రేచల్ పుదుచ్చేరి కారామణికుప్పంలోని ఆమె నివాసంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. భారతీయ సినిమా, ఫ్యాషన్ పరిశ్రమలో వర్ణవివక్షకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించడంలో రేచల్ ముందున్నారు. 2022లో ఆమె మిస్ పుదుచ్చేరి టైటిల్‌ను గెలుచుకు న్నారు. అలాగే మిస్ బెస్ట్ యాటిట్యూడ్ 2019, మిస్ డార్క్ క్వీన్ తమిళనాడు 2019, క్వీన్ ఆఫ్ మద్రాస్ 2022 వంటి అవార్డులను కూడా సొంతం చేసుకున్నారు. తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి, లెక్కకు మించిన అప్పుల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సాన్ రేచల్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారని, భారీ అప్పుల కారణంగా ఆమె మానసిక ఒత్తిడిలో ఉన్నట్టు అనుమానిస్తున్నారు. ఫ్యాషన్ షోలు నిర్వహిం చడంలో జరిగిన నష్టాలు ఈ ఆర్థిక సమస్యలకు దారితీసినట్టు తెలుస్తోంది. ఆమె ఆరోగ్య సమస్య లతో బాధపడుతూ చికిత్స పొందు తున్నట్టు ఆమె సోషల్‌మీడియా పోస్టులు సూచిస్తు న్నాయి. ఇది ఆమె మానసిక ఒత్తిడిని మరింత పెంచి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలం లో సూసైడ్ నోట్ లభించినట్టు తెలిసింది.

# రైతు సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయం

### సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి



**కూసుమంచి, జూలై 14, ప్రభాతవార్త :** కృష్ణా నది నీటిని తెలంగాణ రాష్ట్రం సమృద్ధిగా వినియోగించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డిప్యూటీ సీఎం, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి, కూసుమంచి మండలంలో సోమవారం పర్యటించి, పాలేరు వద్ద పాలేరు రిజర్వాయర్ నుండి నాగార్జున సాగర్ లెఫ్ట్ లాల్ బహదూర్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు ఖరీఫ్ సాగుకు సాగు నీటిని విడుదల చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాగార్జున సాగర్ జోన్ 2, పాలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు నేడు విడుదల చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ రంగం, విద్యుత్, బహుళ సార్థక ప్రాజెక్టులకు మన ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. రాష్ట్రంలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడంలో రైతాంగం 65శాతంమంది వ్యవసాయం పై ఆధారపడి ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాలేరు రిజర్వాయర్ కింద ఉన్న 2 లక్షల 53 వేల ఎకరాల నాగార్జున సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేశామని అన్నారు. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, నాగార్జునసాగర్ ప్రధాన కాలువ, అనేక యూటీ లు కొట్టుకు పోయాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చేశామని తెలిపారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని, క్రమ పద్ధతిలో 5 రోజులలో పూర్తి సామర్థంతో నీటి విడుదల చేయడం జరుగుతుందని అన్నారు.

# మన ఊరు-మన బడి బిల్లులను వెంటనే చెల్లించాలి

### పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం ముందు కాంట్రాక్టర్ల ధర్నా

### రూ. 1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయంటున్న కాంట్రాక్టర్లు

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన ఊరు- మన బడి కార్యక్రమంలో పాఠశాలల పనులను నిర్వహించిన కాంట్రాక్ట్లర్లు ధర్నాకి దిగారు. పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మన ఊరు- మన బడి కాంట్రాక్టర్లు సోమవారం పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. తమకు రూ. 1000 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు రావాలని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్య డైరక్టర్ కార్యాలయం ముందు ఎప్పుడు విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు ధర్నాలు చేపట్టగా.. సోమవారం ఏకంగా కాంట్రాక్టర్లే ధర్నాకు దిగారు. కాంట్రాక్టర్లు ధర్నాకు దిగడంతో పోలీసులు ఎవరినీ డైరక్టర్ కార్యాలయంలోనికి అనుమతించకుండా వారందరినీ గేటు ముందే ఆపేశారు. లోపలికి వెళ్లడానికి కాంట్రాక్టర్లు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తమ సమస్యను వినతిపత్రం రూపంలో పాఠశాల విద్య డైరక్టర్‌కి ఇవ్వడానికి కొందరిని అనుమతిస్తామని పోలీసులు తెలిపారు. దీంతో కొందరు కాంట్రాక్టర్లు తమ సమస్యపై డైరక్టర్ వినతిపత్రం సమర్పించినట్టు ధర్నాకి హాజరైన కాంట్రాక్టర్లు తెలిపారు. మన ఊరు- మన బడి పథకం కింద పనిచేసిన ఆయా జిల్లాల కాంట్రాక్టర్లు తెలంగాణ విద్య డైరక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. నిరసన వ్యక్తం చేశాము. కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 1000 స్కూళ్లకు పైగా మన ఊరు- మనబడి పథ కం కింద పలురకాల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు రాక 10 మందికి పైగా కాంట్రా క్టర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మన ఊరు- మన బడి పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ. 1000 కోట్లకు పైగా ప్రభుత్వం బిల్లలు చెల్లించాల్సి ఉందన్నారు.

# పోరాడి ఓడిన భారత్

### 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌దే విజయం



**లార్డ్స్(లండన్), జూలై 14:** ఇంగ్లండ్ వేదికగా లార్డ్స్ మైదానంలో ఉత్కంఠ భరితంగా సాగిన మూడో టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. 22 పరుగుల తేడాతో భారత్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. టీమిండియా తరఫున ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చేసిన ఒంటరి పోరాటం వృథా అయ్యింది. ఈ మ్యాచ్‌లో విజయంతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 21 తేడాతో ఆధిక్యంలోకి ఉన్నది. బెన్ స్టోక్స్ నేతృత్వంలోని జట్టు లీడ్స్ టెస్ట్‌లో భారత్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. శుభ్‌మన్ నేతృత్వంలోని భారత జట్టు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 336 పరుగుల తేడాతో గెలిచింది. లార్డ్స్ టెస్ట్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పది వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. జోరూట్ (104), జేమీ స్మిత్ (51), బ్రైడన్ కార్స్ (21) పరుగులు చేశారు. టీమిండియా సైతం తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 192 పరుగులకు కుప్పకూలింది. టీమిండి యాకు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత జట్టు కేవలం 170 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. రవీంద్ర జడేజా (61నాటౌట్), కేఎల్ రాహుల్ (39) మినహా ఎవరూ రాణించలేదు. జడేజా బుమ్రా, సిరాజ్‌తో కలిసి టీమిండియాను గెలిపించేందుకు కష్టపడ్డా అతని శ్రమ అంతా వృథా అయ్యింది. 74.5 ఓవర్‌లో షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ అవుట్ అవడంతో టీమిండియా పోరాటం ముగిసింది. షోయబ్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ, బంతి బ్యాట్‌పై నుంచి క్రీజులో పడి స్టంప్స్‌ను తాకింది. బంతి వికెట్లను తాకడంతో సిరాజ్ సైతం షాక్‌కు గురయ్యాడు. దాంతో ఇంగ్లండ్ ప్లేయర్స్ సంబరాల్లో మునిగిపోగా టీమిండియా ప్లేయర్స్ అంతా షాక్ అయ్యారు. ఇక ఇంగ్లండ్‌భారత్ మధ్య నాలుగో టెస్ట్ ఈ నెల 23,27 తేదీల మధ్య మాంచెస్టర్‌లో ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరుగుతుంది.

## బోగస్ ఐటి రాయితీలపై ఐటి శాఖ దేశవ్యాప్త సోదాలు!

**న్యూఢిల్లీ, జూలై 14:** ఆదాయపు పన్ను మినహాయింపులు అక్రమమార్గాల్లో పొందే విషయంలో పన్ను చెల్లింపుదారులకు సాయంచేసే వ్యక్తులు, సంస్థలపై ఐటి విభాగం నిఘా పెంచింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సోమవారం దాడులుచేపట్టింది. పన్ను మినహాయింపులు పొందేందుకు అవసరమైన బోగస్ పత్రాలు సమకూర్చడంలో వ్యక్తులు సంస్థలు సాయపడుతున్నాయన్న సమాచారంతో ఐటి విభాగం సోదాలుచేసింది. రాజకీయ పార్టీలకు విరాళాలు, ట్యూషన్‌ఫీజులు, వైద్యఖర్చులపేరిట నకిలీ బిల్లులు కూడా సమకూరుస్తున్నట్లు ఐటి అధికారులు గుర్తించారు. పాత పన్ను వ్యవస్థలో సెక్షన్ 80 జిజిసి కింద వ్యక్తులు ఎవరైనా రాజకీయ పార్టీకి విరాళం ఇవ్వవచ్చు. ఈ మొత్తాన్ని ఆదాయపు పన్నునుంచి మినహాయింపుగా చూపించుకోవచ్చు. ఇదే అదనుగా కొందరు మధ్యవర్తులు బోగస్ డొనేషన్లు పన్ను చెల్లింపుదారులకు సమకూరుస్తున్నట్లు ఐటివిభాగం గుర్తించింది. ఆపరేషన్‌లోభాగంగా సంస్థలతోపాటు పన్ను సలహాదారులు, అకౌంటెంట్ల కార్యాలయాల్లోకూడా తనిఖీలుచేసింది. అనుమానిత మినహాయింపులు ఉన్నాయని, రివైజ్, అప్‌డేట్‌చేసిన రిటర్నులు దాఖలుచేయాలని ఐటి అధికారులు సూచించినా కొందరు ట్యాక్స్‌పేయర్స్ పెడచెవిన పెట్టడంతో దేశవ్యాప్తంగా ఈ సోదాలునిర్వహిస్తోంది.



## భారత్‌తో బంధం కోసం మామిడిపండ్ల దౌత్యం

**ఢాకా, జూలై 14:** షేక్ హసీనా సర్కారు కూలిన తర్వాత బంగ్లాదేశ్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడాన్ని బంగ్లాదేశ్‌లోని మధ్యంతర ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. ఓ వైపు భారత్‌తో వైరుధ్యాలను కొనసాగిస్తూనే, మరోవైపు మామిడి దౌత్యానికి మహ్మద్ యూనుస్ సర్కారు తెరతీసింది. షేక్ హసీనా బాటలో పయనిస్తూ ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి 1000 కేజీల హారీభంగా రకం మామిడి పండ్లను పంపింది. అవి దిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ కార్యాలయానికి చేరుకున్నాయని సమాచారం. ఒకటి, రెండు రోజుల్లోగా ఆ మామిడి పండ్లను భారత ప్రధానమంత్రి కార్యాలయం, భారత దౌత్యవేత్తలు, ఇతర ఉన్నతాధికారులకు పంపించనున్నారు. సరిహద్దు రాష్ట్రం త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహాకు 300 కేజీల హారీభంగా మామిడిని బంగ్లాదేశ్‌లోని మహ్మద్ యూనస్ సర్కారు పంపింది. మరో సరిహద్దు రాష్ట్రం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి కూడా సెపరేటుగా మామిడి పండ్లను పంపుతారని సమాచారం. వాస్తవానికి ఈ సంప్రదాయాన్ని బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనానే ప్రారంభించారు. అప్పట్లో భారత్, బంగ్లాదేశ్ మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలు ఉండేవి. విశ్వసనీయ మిత్రదేశంగా బంగ్లాదేశ్‌ను భారత్ పరిగణించేది. దీంతో ఆనాడు భారత ప్రధానికి, సరిహద్దు రాష్ట్రాల సీఎంలకు హసీనా పంపిన హారీభంగా మామిడి పండ్లకు ఒక అర్థం ఉండేది. అయితే ఇప్పుడు బంగ్లాదేశ్‌లో పూర్తి భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉన్నాయి.

## ఉద్యోగుల లెక్క తేల్చే పనిలో శాంతికుమారి కమిటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై14:** ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో,కార్పొరేషన్లలో, ప్రభుత్వ రంగ సంస్థల్లో, స్థానిక సంస్థలలో, సొసైటీల్లో,విశ్వవిద్యాలయాల్లో,వివిధ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య తేల్చే పనిలో శాంతికుమారి కమిటీ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పశసంవర్ధక, అటవీ శాఖలపై తొలుత కసరత్తు చేయాలని కమిటీ నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సంఖ్యపై లెక్క తెల్చేందుకు మాజీ సీఎస్ శాంతి కుమారి నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఈనెల 9న నియమించింది. ఈ కమిటీ తొలిసారిగా సోమవారం ఆన్‌లైన్‌లో జరిగింది. కమిటీ తమ పని పరిధి, బాధ్యతల గురించి చర్చించింది. కమిటీ మొదటగా రెండు శాఖల్లోని ఉద్యోగుల సంఖ్యను తేల్చాలని నిర్ణయించింది. వీటిలో పశుసంవర్ధక, పర్యావరణం, అటవీ శాఖల్లోని ఉద్యోగులను లెక్కలను తెల్చాలని నిర్ణయించింది. ఈ శాఖలలో ప్రస్తుత ఉద్యోగులు, సిబ్బంది గురించి అవసరమైన డేటాను రాబోయే రెండు రోజుల్లో ఆర్థికశాఖ సిద్ధం చేయనుంది. ఈ తర్వాత కమిటీ ఈ వారంలో మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ కమిటీలో మాజీ సీఎస్ శాంతి కుమారి(విసి,డిజి ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)తో పాటుగా మాజీ ఐఏఎస్ ఎన్.శివశంకర్(పే రివిజన్ కమిషనర్), ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావులు ఉన్నారు. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

## బిజెపిలోని బిసి బిడ్డలు ఫ్యూడలిస్ట్ సిద్ధాంతాలతో అడ్డుపడొద్దు

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 14, ప్రభాతవార్త:** బిజెపిలోని బిసి బిడ్డలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, ఆర్ కృష్ణయ్య,లక్ష్మణ్‌లు ఫ్యూడలిస్ట్ సిద్ధాంతాలతో 42శాతం రిజర్వేషనన అమలు చేయకుండా అడ్డుపడకండని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హితవు చెప్పారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మీరు బిసి బిడ్డలు అని మరిచిపోయి కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడకండని సూచించారు. కేంద్రప్రభుత్వం నడిపే పార్టీలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడినమీరు బిసిల లకు అన్యాయం చేయకుండా చూడండి అని పొన్నం ప్రాధేయపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామి ప్రకారం అధికారంలోకి రాగానే న్యాయపరమైన అవకాశాలు వినియోగించుకుని కుల సర్వే నిర్వహించినామని వివరించారు. రిజర్వేషన్ కేటగిరికి తల్లిలాంటి రాష్ట్రపతి గవర్నర్ పంపిన చట్టాన్ని ఆమోదించాలని మేం వేడుకొంటున్నామని పొన్నంప్రభాకర్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రామాణిక సర్వే ప్రకారం గతంలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు, న్యాయ మూర్తుల సలహాలు తీసుకొని శాసన సభలో తీర్మానం చేశామని చరిత్రను మంత్రి పొన్నం వివరించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగలేదనే మిషాతో మీరే నిధులు ఆపారు బలహీన వర్గాల పట్ల మీకు ఉన్న అభిప్రా యాలు ఏంటి అని రవాణాశాఖమంత్రి నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని సంఘాలు జెఎసిలుగా గా ఏర్పడినట్లు రిజర్వేషన్లు కాపాడడానికి ఒక్కతాటికి రావాలని అపుడే కేంద్రంపై ఒత్తిడి పెంచి చట్టబద్ధత కల్పించుకొని బిసి రిజర్వేషన్లు సాధిస్తాం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# తెర

## బుట్టబొమ్మకు



తాజాగా వరుస ఫ్లాపులతో డీలా పడిపోయిన కన్నడ బ్యూటీ పూజా హెగ్డేకు టాలీవుడ్‌లో మళ్లీ ఒక మంచి అవకాశం వచ్చింది. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వారసుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన దుల్కర్ సల్మాన్ హీరో నుంచి స్టార్ హీరో రేంజ్‌కి వడివడిగా అడుగులు వేస్తున్నాడు. అయితే మలయాళంలో కంటే తెలుగులోనే అతడికి మంచి ఛాన్సులు వస్తున్నాయి. సీతారామం, లక్కీ భాస్కర్ చిత్రాలతో బ్లాక్‌బస్టర్లు అందుకున్న దుల్కర్ తెలుగులో తీయబోతన్న సినిమాలో పూజా హెగ్డేని హీరోయిన్‌గా తీసుకునేందుకు మేకర్స్ నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకి కథ వినిపించగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై తర్వలోనే మేకర్స్ అఫిషియల్‌గా అనౌన్స్‌మెంట్ చేయనున్నారు. ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు.

టాలీవుడ్‌లో ఛాన్సులు లేకపోవడంతో కోలీవుడ్‌లో ప్రయత్నిస్తే అక్కడా బీస్ట్ రూపంలో భారీ దెబ్బ తగిలింది రెట్రోతో సూర్య అయినా తన లక్ మారుస్తాడని ఆశ పెట్టుకోగా అదికూడా వర్కౌట్ కాలేదు. దీంతో కోలీవుడ్‌లోనూ రూటు మార్చి ఐటమ్ గర్ల్‌గా మారింది. తాజాగా రజినీకాంత్ కూలీ చిత్రంలో ఐటెమ్ సాంగ్ చేసిన పూజా రెడ్ కలర్ డ్రెస్‌లో గ్లామర్ చూపిస్తూ రెచ్చిపోయింది. వయ్యారాలు ఒలకబోస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు బాగానే కష్టపడింది. తెలుగులో మళ్లీ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తానని రెట్రో పమోషన్లలో చెప్పిన బుట్టబొమ్మ ఆ ప్రయత్నంలో తొలి అడుగు బలంగానే వేసినట్లు కనిపిస్తోంది. తాజాగా టాలీవుడ్‌లో ఓ బంపరాఫర్‌ని పట్టేసిందని టాక్ వినిపిస్తోంది.

## అలరిస్తున్న రంగనాయకి..

రానా నిర్మాతగా వ్యవహరిస్తున్న కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమా జులై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదల చేసిన ట్రైలర్ అద్భుత రెస్పాన్స్ దక్కించుకుంది. అయితే.. తాజాగా ఈ మూవీ నుంచి రంగనాయకి అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ అభిమానులను అలరిస్తోంది. ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా మణిశర్మ సంగీతంలో ధనుంజయ ఆలపించారు. కేరాఫ్ కంచరపాలెం ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య చిత్రాలతో మంచి విజయంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న నిర్మాత, నటి ప్రవీణ పరుచూరి తాజాగా ఓ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సారి తానే స్వయంగా దర్శకత్వం వహిస్తూ కొత్తపల్లిలో ఒకప్పుడు అనే సినిమాను రూపొందించింది. మనోజ్ చంద్ర, మోనిక, ఉషా బోనెల హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుండగా రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి కీలక పాత్రల్లో నటించారు.



## విశాల్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం


ప్రముఖ కథానాయకుడు విశాల్ హీరోగా 35వ చిత్రం మొదలైంది. దీనిని సీనియర్ నిర్మాత ఆర్.బి. చౌదరి తన సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌లో నిర్మిస్తుండటం విశేషం. 1990లో పుదు వసంతంతో సూపర్ గుడ్ ఫిలిమ్స్ సంస్థ మొదలైంది. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఆర్. బి. చౌదరి 98 చిత్రాలు నిర్మించారు. ఆయన బ్యానర్ నుండి వస్తున్న 99వ చిత్రం ఇది. విశాల్ హీరోగా ఆర్.బి. చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమంలో జులై 14 ఉదయం అట్టహాసంగా చెన్నయ్‌లో జరిగాయి. దర్శకుడు వెట్రిమారన్, శరవణ సుబ్బయ్య, మణిమారన్, వెంకట్ మోహన్, శరవణన్ దీనికి హాజరయ్యారు. అలానే హీరోలు కార్తీ, జీవా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాకు రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. విశాల్, రవి అరసు కాంబోలో వస్తున్న తొలి చిత్రం ఇది. ఈ సినిమాలో దుషార విజయన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ యేడాది సంక్రాంతి కానుకగా విడుదలైన మదగజరాజాకు రిచర్డ్ ఎం. నాథన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యహరించారు. ఆయనే ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నారు. అలానే విశాల్ మార్క్ ఆంటోనీకి సంగీతం అందించిన జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ తాజా చిత్రానికి స్వరాలు సమకూర్చుతున్నారు. తంబి రామయ్య, అర్జై ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ చెన్నయ్ లోనే జరుగునుంది. సింగిల్ షెడ్యూల్ లో 45 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు.

## రిస్కీ స్టంట్ చేస్తూ ఫైట్ మాస్టర్ రాజు మృతి

తమిళ హీరో ఆర్య, పా రంజిత్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రంలో స్టంట్ మాస్టర్ రాజు ప్రాణాలు కోల్పోయారు. కార్ ఫ్లింగ్ స్టంట్‌ను చేస్తుండగా అదుపుతప్పిన ప్రమాదానికి దారి తీసింది. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. స్టంట్లలో అనుభవం ఉన్న రాజు మృతి వార్తతో తమిళ సినీ పరిశ్రమ విషాదంలో మునిగిపోయింది. పలువురు సినీ ప్రముఖులు ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సినీ షూటింగుల్లో యాక్షన్ సీన్స్ తీయడం ఎంత ప్రమాదకరమో తెలిసిందే. ఏమాత్రం తేడా వచ్చినా.. ఒక్క పొరపాటు జరిగినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. తాజాగా తమిళ సినీ పరిశ్రమలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. ప్రముఖ స్టంట్ మాస్టర్ రాజు సినిమా షూటింగులో ప్రమాదవశాత్తూ మరణించడం అందరినీ కలిచివేస్తోంది. కోలీవుడ్ హీరో ఆర్య, పా రంజిత్ కాంబినేషన్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా దీనికి సంబంధించి యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కార్ స్టంట్ చేస్తుండగా ఊహించని విధంగా రాజు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో తమిళ సినీ ఇండస్ట్రీ ఒక్కసారిగా షాకైంది. హీరోలు, దర్శకులు, టెక్నీషియన్స్ ఇలా ఎంతోమంది రాజు మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు.



## ఈసారి ఒక్కొక్కడికి బుర్రపాడు..



తాజాగా కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రాల్లో కె ర్యాంప్ ఒకటి. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రాజేష్ దండా, శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో కిరణ్ సరసన యుక్తి తరేజా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. క సినిమా తరువాత నుంచి కిరణ్ పై అభిమానులు భారీ అంచనాలనే పెట్టుకుంటున్నారు. సోమవారం కిరణ్ పుట్టినరోజు కావడంతో కె ర్యాంప్ నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేసి బర్త్ డే విషెస్ చెప్పుకొచ్చారు మేకర్స్. కె ర్యాంప్ గ్లింప్స్ మొత్తాన్ని బూతులతో నింపేశాడు డైరెక్టర్. ఈసారి ఒక్కొక్కడికి బుర్రపాడు.. బుడ్డలు జారుడే అనే డైలాగ్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకుంది. గ్లింప్స్‌లో బూతు పదాలు మాట్లాడుతూ కిరణ్ కనిపించాడు. కుమార్ లైఫ్ ఎలా ఉంది అని అడిగిన ప్రశ్నకు.. ప్రతిసారి కిరణ్ బూతుమాటను మింగేయడం.. బార్‌లో తాగుతూ ఫైట్ చేయడం లాంటి సీన్స్‌ను చూపించారు.

# అస్తమించిన మరో వెలుగు తార



**తెలుగు, తమిళ, కన్నడ, హిందీ సినిమాలలో మెరిసిన ఓ వెలుగు తార బి. సరోజా దేవి. ఆమె చూపులో కాంతి, మాటల్లో మాధుర్యం, అభినయంలో చిలిపితనం, చింతనలో చైతన్యం.. తన చిరునవ్వుతో వెండితెరకు జీవం పోసిన నటి. ఒకరికి కాదు.. ఏడు దశాబ్దాల సినీ అభిమానులకు గుర్తుండిపోయే పేరు. చిన్న వయసులోనే కళలకు లోనైన మనోహర నటీమణి, తన నాట్యనైపుణ్యంతో తొలిచూపులోనే హృదయాలను గెలుచుకుంది. 1950లలో తెరంగేట్రం చేసిన ఆమె, నటనకు అర్థం చెప్పిన కళాకారిణి. పచ్చని పల్లెపట్నం నుంచి వచ్చినా - మహానగరాల వెండితెర మీద వెలిగిన చుక్కంత చుక్క. అభినయంలో ఆవేశం ఉండేది కాదు.. ఆహ్లాదం ఉండేది. ప్రతి పాత్రను హృదయంతో తలదన్నేది. ఆమె చెప్పిన ప్రతి మాట, పలికిన ప్రతి భావం మనసుని తాకేది. ఆమె చూపు చుక్కలు కథ చెప్పేవి... చిరునవ్వు ఓ పాటల మాదిరిగా అనిపించేది. జీవితంలో ఆనందాలు, విషాదాలు ఎదురైనప్పటికీ - ఆమె అణకువతనంతో, శాంత స్వభావంతో ముందుకు సాగారు. భార్యగా, నటిగా, దేశాభిమానిగా తన పాత్రలను సమంగా నెరవేర్చారు. ఆమె జీవితం - ఒక అందమైన పద్యం, ఆమె ప్రయాణం - ఒక స్ఫూర్తిదాయక కథనం, ఆమె వ్యక్తిత్వం - ఒక ఆదర్శ స్త్రీకి నిలువెత్తు ఉదాహరణ. సరోజాదేవి ఇక లేరు అన్న నిజం దక్షిణాది చిత్ర రంగాలకు దిగ్భ్రాంతికి గురి చేసింది.**

కన్నడ నాట పుట్టినా తెలుగువారిని అందాల అభినయంతో ఆకట్టుకున్నారు బి.సరోజాదేవి... నాటి మేటి నటుల చిత్రాలలో సరోజాదేవి అందం చిందులు వేసిన తీరు మరపురానిది... మరువలేనిది. చిలుక పలుకులు వల్లిస్తూ, నవ్వులు చిందిస్తూ చూపరులను ఇట్టే ఆకట్టుకొనే రూపంతో తెలుగు చిత్రసీమలో తనదైన బాణీ పలికించారు బి.సరోజాదేవి. కన్నడ సీమలో పుట్టిన సరోజాదేవి తెలుగు పదాలు పట్టి పట్టి పలికేవారు. అయినా అది ఆమె బాణీగా భాసిల్లింది. ఆ ముద్దుమోములో పలికే తెలుగు పలుకు మరింత ముద్దుగా ఉండేదని ఆ నాటి అభిమానులు ఈ నాటికీ గుర్తు చేసుకుంటారు. సరోజాదేవి ఆమె కన్నవారికి నాల్గవ సంతానం. ఆమె తండ్రి భైరయ్య పోలీస్ డిపార్ట్ మెంట్ లో పనిచేసేవారు. నలుగురిని పోషించే స్తోమత లేదని భైరయ్య తండ్రి సరోజాదేవిని వేరేవారికి దత్తత ఇవ్వాలని చూశారు. అయితే భైరయ్య మాత్రం తన కూతురును తానే పోషిస్తానని, చిన్నతనంలోనే డాన్స్ నేర్పించారు. అదే సరోజాదేవిని చిత్రసీమ వైపు ఆకర్షించేలా చేసింది..

చిట పట చినుకులు పడుతూ ఉంటే.. అంటూ హుషారైన పాటలతో కుర్రకారును ఉర్రూతలూగించారు అలనాటి అందాల తార బి.సరోజాదేవి. కథానాయికగా ఎన్నో పాత్రలకు ప్రాణం పోసి తనదైన శైలి ముద్ర వేశారు. వృద్ధాప్య సమస్యతో సోమవారం ఉదయం బెంగుళూరులోని తన నివాసంలో మరణించారు. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన ఆమె నటించారు. 13 ఏళ్ల వయసులో చిత్ర రంగంలో అడుగుపెట్టిన సరోజాదేవి దాదాపు 200 చిత్రాల్లో నటించి అభినయ సరస్వతిగా గుర్తింపు పొందారు. సరోజాదేవి ఇక లేరు అన్న నిజం దక్షిణాది చిత్ర రంగాలకు దిగ్భ్రాంతికి గురి చేసింది.



### దేవి పాత్రల్లోనూ ఒదిగి పోయి...

అందాలతారగా అభిమానుల మదిని దోచుకున్న బి.సరోజాదేవి హున్నప్ప భాగవతార్ నటించి, రూపొందించిన మహాకవి కాళిదాసుఖి అనే కన్నడ చిత్రంతో తెరకు పరిచయమయ్యారు. వరుసగా కొన్ని కన్నడ చిత్రాల్లో నటించిన తరువాత ఓ తమిళ సినిమాలోనూ సరోజా అందం మురిపించింది. ఆ తరువాత ఎన్టీఆర్ తన సొంత చిత్రం పాండురంగ మహాత్మం తో తెలుగు తెరకు సరోజాదేవిని పరిచయం చేశారు. పాండురంగ మహాత్మం సమయంలో భూ కైలాస్‌లో పార్వతి దేవి గా నటించారు సరోజాదేవి. ఆ తరువాత ఏయన్నార్ పెళ్లి సందడిలో ఓ పాత్ర పోషించారు. కానీ, ఏయన్నార్‌తో ఆమె నటించిన పెళ్ళికానుక నటిగా సరోజా దేవికి మంచి మార్కులు సంపాదించి పెట్టింది.

### వాన పాటతో కుర్రకారు మురిపెం

పెళ్ళికానుక సమయంలోనే యన్టీఆర్ దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రం సీతారామ కళ్యాణంలో రామారావు రావణునిగా నటించగా, సరోజాదేవి మండోదరిగా అభినయించారు. ఈ చిత్రం విడుదలైన ఇరవై రోజులకే యన్టీఆర్, సరోజాదేవి జంటగా తెరకెక్కిన ఇంటికి దీపం ఇల్లాలే విడుదలయింది. అందులోనూ సరోజాదేవి గ్లామర్ గమ్మత్తుగా జనాన్ని ఆకట్టుకుంది. దక్షిణాదిన నాటి మేటి హీరోలందరి సరసన సరోజాదేవి అభినయించి అలరించారు. సరోజాదేవి నవ్వు మోము చూస్తే చాలు అనుకొనేవారు ఆమె నటించిన చిత్రాలను చూడటానికి థియేటర్లకు పరుగులు తీశారు. ఏయన్నార్‌తో సరోజాదేవి నటించిన చిత్రాలు జనాన్ని విశేషంగా అలరించాయి. వారిద్దరిపై ఆత్మబలం చిత్రం కోసం చిత్రీకరించిన వాన పాట అప్పట్లో కుర్రకారును కిర్రెక్కించింది. ఆ పాట ఈ నాటికీ అభిమానులను మురిపిస్తూనే ఉండడం విశేషం. సరోజాదేవిని తెలుగు సినిమా రంగానికి యన్టీఆర్ పరిచయం చేయగా, ఆయనతో అనేక చిత్రాల్లో నాయికగా నటించి మురిపించారామె.

చిన్న వయసులోనే కళలకు లోనైన మనోహర నటీమణి

ఏడు దశాబ్దాల సినీ అభిమానులకు కలల రాణి

తరగని కాంతి.. కరగని కీర్తి సరోజాదేవి సొంతం

అలనాటి లేడీ సూపర్‌స్టార్ మృతితో దక్షిణాది చిత్ర రంగాల దిగ్భ్రాంతి



### ఎన్టీఆర్‌తో చిత్ర బంధం

అయితే ఎన్టీఆర్‌కు చెల్లెలిగా, ఏయన్నార్‌కు హీరోయిన్‌గా సరోజాదేవి నటించిన శ్రీకృష్ణార్జున యుద్ధం జనాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఇందులోని పాటలు ఈ నాటికీ జనాన్ని మురిపిస్తూనే ఉన్నాయి. ఎన్టీఆర్‌తో బాపు తెరకెక్కించిన శ్రీరామాంజనేయ



యుద్ధంలో సీతమ్మగానూ సరోజాదేవి అలరించారు. రామారావు దర్శకత్వంలో రూపొందిన చివరి చిత్రం శ్రీమద్విరాట్ ఖిస్రామాట్ అశోకలోనూ సరోజాదేవికి తగిన పాత్ర నిచ్చి గౌరవించారు. యన్టీఆర్ నటించిన జానపద, పౌరాణిక, సాంఘిక, చారిత్రకాల్లో సరోజాదేవికి తగిన పాత్రలే లభించాయి. యన్టీఆర్ జగదేకవీరుని కథలో దేవకన్యగా సరోజాదేవిని చూసి నిజంగా మానవమాత్రురాలు కాదనీ ఆ నాటి జనం భావించారు. అంటే సరోజా అందంలోని బంధం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. సరోజాదేవి పలు భాషల్లో ఎంతోమంది టాప్ స్టార్స్‌తో నటించి మురిపించారు. అయితే ఆమె అభిమాన నటుడు మాత్రం ఎన్టీఆరేనని పలు మార్లు చెప్పుకున్నారు. అదే తీరున వారిద్దరికీ చిత్ర బంధం కూడా నెలకొనడం విశేషం.

ఉత్తరాదిన సైతం సరోజాదేవి అందం జనానికి బంధం వేసింది. దిలీప్ కుమార్, వైజయంతీ మాల నటించిన పైఘమ్ చిత్రంతో తొలిసారి హిందీ తెరపై వెలిగింది బి.సరోజాదేవి. వైజయంతీమాలకు, సరోజాదేవికి కొన్ని పోలికలు ఉండడంతో అందరూ వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్ళు గా భావించేవారు. ఉత్తరాదిన సైతం బి.సరోజాదేవి అందం చిందులు వేసింది. ఆ నాటి హిందీ సినిమా టాప్ స్టార్స్ తో సరోజాదేవి జోడీ కట్టి కనువిందు చేశారు. 2009 సంవత్సరం యన్టీఆర్ జాతీయ అవార్డునూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి సరోజాదేవి అందుకోవడం మరింత విశేషం. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఆమెను 1969లో పద్మశ్రీతో, 1992లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. నాటి అందాల అభినేత్రి సరోజాదేవి కీర్తి కిరీటంలో ఎన్నెన్నో మేలిమి రత్నాలు. అవి నేటికీ విరజిల్లుతూనే ఉన్నాయి... ఆ కాంతి తరిగిపోదు... సరోజాదేవి కీర్తి కరిగిపోదు.

పౌరాణిక, జానపద, సాంఘికాల్లో యన్టీఆర్ సరసన నటించి విజయాలు చూసిన సరోజాదేవికి రామారావుతో ఓ తీరని కోరిక మిగిలింది. అదేమిటంటే వెండితెర శ్రీకృష్ణునిలా అనితరసాధ్యంగా సాగిన యన్టీఆర్ శ్రీకృష్ణ పాత్ర ధరించిన చిత్రంలో తాను ఆయనకు జోడీగా నటించాలన్నది సరోజాదేవి అభిలాష. యన్టీఆర్ శ్రీకృష్ణ పాత్ర ధరించిన శ్రీకృష్ణార్జునయుద్ధం, దానవీరశూర కర్ణ చిత్రాలలో సరోజాదేవి నటించినా శ్రీకృష్ణ పాత్రకు జంటగా నటించలేదు. అందువల్లే అది తనకు తీరని కోరికగా చెప్పుకొనేవారు సరోజాదేవి.



## ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వైజాగ్ వేదిక



పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ జంటగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం ఈ నెల 24న రిలీజ్‌కి సిద్ధమైంది. విడుదలకు ఇంకా 10 రోజుల సమయమే ఉండటంతో మేకర్స్ ప్రమోషన్ల జోరు పెంచారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 20న వైజాలగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని గ్రాండ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాజమౌళి, త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఈ ఈవెంట్ ముందుగా తిరుపతి, విజయవాడలో నిర్వహించాలనుకున్నా చివరికి వైజాగ్ ఫిక్స్ చేశారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి చాన్నాళ్ల తర్వాత వస్తోన్న హరిహర వీరమల్లు చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సుమారు ఐదేళ్లుగా సెట్స్ మీదున్న ఈ చిత్రం ఎన్నో అవాంతరాలు, సమస్యలు ఎదుర్కొని ఎట్టకేలకు ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే ఎన్నో వాయిదాలు పడటంతో మొన్నటివరకు ఈ ప్రాజెక్టుని ఎవరూ పట్టించుకోలేదు. అయితే ట్రైలర్ రిలీజ్ అయ్యిందో లేదో అంచనాలు పీక్స్‌కి చేరిపోయాయి. అంతేకాదు 24 గంటల్లో అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా పుష్ప2ను పక్కకు నెట్టేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ మూవీలో ధర్మ పరిరక్షకుడిగా, చారిత్రక యోధుడిగా పవన్ కళ్యాణ్ కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్ కాగా, బాబీ డియోల్ ఔరంగజేబు పాత్రలో ప్రతినాయకుడిగా కనిపిస్తున్నారు. ఏఎం రత్నం నిర్మిస్తోన్న పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ హరిహర వీరమల్లు: పార్ట్ 1 - స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్ పేరుతో విడుదల కానుంది.

## రాయలవారి బయోపిక్



చరిత్రలో ఎందరో రాజులు వచ్చారు.. వెళ్లారు.. అయితే విజయనగర సామ్రాజానికి చెంది శ్రీకృష్ణదేవరాయలు మాత్రం తానే ఓ చరిత్ర సృష్టించారు. ఆంధ్రభోజుడుగా ప్రసిద్ది చెందిన ఆయన పరిపాలనా నైపుణ్యం, సాహిత్య ప్రోత్సాహం, ధర్మపాలనతో మహోన్నత చక్రవర్తిగా కీర్తి గడించారు. తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు 1471లో జన్మించారు. 1509లో రాజ్యాధికారాన్ని చేపట్టి 1529 వరకు అంటే 20 ఏళ్లు దిగ్విజయంగా పరిపాలన సాగించారు. ఆయన పాలనని తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగంగా అభివర్ణిస్తారు చరిత్రకారులు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండే ఎనిమిది మంది కవులను అష్టదిగ్గజాలు అని పిలిచేవారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, ధూర్జటి, అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, రామరాజ భూషణుడు.. వీరే ఆ అష్ట దిగ్గజాలు. రిషబ్ శెట్టి.. ఆంధ్ర భోజుడుగా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల బయోపిక్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరాఠా యోధుడు శివాజీ పాత్రలో నటిస్తోన్న రిషబ్ శెట్టి.. ఆంధ్ర భోజుడుగా ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణదేవరాయల బయోపిక్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అశుతోష్ గోవారికర్ దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. రిషబ్ శెట్టి ప్రస్తుతం దర్శకత్వం వహిస్తూ నటిస్తోన్న కాంతార 2 ఈ ఏడాది అక్టోబర్ 2న విడుదల కానుంది. కాంతారకి ప్రీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి.

## ప్రియదర్శి థ్రిల్ ప్రాప్తిరస్తు..

ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న చిత్రం ప్రేమంటే. థ్రిల్ ప్రాప్తిరస్తు అనేది ఉపశీర్షిక. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నా ఈ చిత్రం లవ్, కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో రూపొందుతుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. హీరో నాగచైతన్య ఈ సినిమా ఫస్ట్‌లుక్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేసి టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# మన ఉత్పత్తులు ప్రతిష్ట



- నర్సాపురం లేసు ఉత్పత్తులు
- బొబ్బిలి వీణ

ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డు పథకం క్రింద 2024-25 సం.లకు నరసాపురం లేసు అల్లికకు, బొబ్బిలి వీణలకు ఎంపికయ్యాయి. నరసాపురం లేసుకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం లేసు పార్కును సందర్శించి లేసు ఉత్పత్తులను కొనకుండా వెళ్లరు. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం లేసు ఉత్పత్తుల అలంకరణ కనపడుతోంది. ఇతర రాష్ట్రాలు, దేశాలకు లేసు అల్లికలు ఆన్‌లైన్ ప్లాట్ ఫారం ద్వారా ఎగుమతి అవుతున్నాయి. లేసు అల్లికలకు గత కొద్ది నెలల నక్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. ఇప్పుడు లేస్ ఉత్పత్తులకు పూర్వ వైభవం కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయి. అందుకే వాటి ప్రాభవం ఎన్నటికీ తగ్గదు.

'ఒన్ డిస్ట్రిక్ట్.. ఒన్ ప్రొడక్ట్' కింద బొబ్బిలి నమూనా వీణ, నర్సాపురం లేసు ఉత్పత్తులకు పురస్కారాలు అందాయి. కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడి నాగరాణిలు పురస్కాలు అందుకున్నారు.

నర్సాపురం లేసు ఉత్పత్తులు, బొబ్బిలి వీణకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి నుంచి వచ్చిన సాంప్రదాయ సరస్వతి వీణ విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. సర్వస్వతి వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతి, జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలూ ఇవ్వడం ఆనవాయితీ బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి బొబ్బిలి వీణల తయారీకి ఆలవాలం వీణల తయారీ ఒక అరుదైన హస్త కళ. దాదాపు 300 కుటుంబాలు గత 100 సంవత్సరాలకు పైగానే తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నాయి. □

# ఉద్యాన రంగంలో బంగారు పతకాలు

యువత అంతా కంప్యూటర్ విద్య, ఏఐ సాంకేతికత వైపు పరుగులు తీస్తోంటే.. ఈ ఇద్దరమ్మాయిలూ సాగు విద్యలో చేరారు. ఉద్యాన రంగంలో భవిష్యత్తు కోసం కలలు కన్నారు. అనుకున్నది సాధించడానికి ఇష్టపడి చదివారు. ఆ శ్రమకు ఫలితంగానే జి. చైతన్య, అచ్యుత మోనికా శ్రీనాగిని బంగారు పతకాలు సాధించారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా వాటిని అందుకున్నారు.

**మొక్కల డాక్టర్ కావాలని..**

**జి. చైతన్య.............**

మాది వ్యవసాయ కుటుంబం కాదు. అయినా ఎంతో ఇష్టంగా ఉద్యాన కోర్సులో చేరాను. మేముండేది. హైదరాబాద్‌లోని చందానగర్. నాన్న రమణారెడ్డి చిరుద్యోగి, అమ్మ పద్మ గృహిణి. ఇంట్లో ఇద్దరాడపిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు. పేదరికంలో ఉన్నా నా చదువుకోసం వారు ఎంతగానో కష్టపడ్డారు. నేను చిన్నప్పటి నుంచీ మెరిట్ స్టూడెంట్‌ని ఇంటర్ తర్వాత డాక్టర్ కావాలనుకుని నీట్ పరీక్ష రాశా ప్రైవేటు కళాశాలలో సీటు వచ్చింది. ఆర్థికస్థోమత లేకపోవడంతో మనుషుల డాక్టర్‌ను కాకపోయినా మొక్కల (ప్లాంట్) డాక్టర్ కావాలనుకున్నా. ఇంట్లో ఒప్పించి తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హార్టీకల్చర్) కోర్సులో చేరారు. ప్రణాళికాబద్ధంగా చదివి నాలుగు బంగారు పతకాలను సాధించా, విశ్వవిద్యాలయ చరిత్రలో నాలుగు పతకాలు సాధించిన మొదటి విద్యార్థిని నేనే కావడం గర్వంగా ఉంది. యూనివర్సిటీలో చేరాకు... వ్యవసాయం, ఉద్యాన పంటలు, రైతుల జీవన స్థితిగతులపై అవగాహన ఏర్పడింది. ఈ రంగంలోనే శాస్త్రవేత్తగా ఎదుగుతా అన్నదాతలకు అన్ని విధాల అండగా నిలుస్తా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టిసారిస్తా. నాలాంటి పేద విద్యార్థులు ఉద్యాన విద్యను అభ్యసించేందుకు సహకరిస్తా.





**రైతుల కోసం.... - అచ్యుత మోనికా శ్రీనాగిని...**

తాడేపల్లిగూడెం సమీపంలోని ఆవపాడు మా స్వస్థలం. నాన్న కలికిమూర్తి, అమ్మ అనంతలక్ష్మి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. చిన్నప్పటి నుంచీ వారితో పాటు పొలాల్లో తిరిగేదా అన్నదాతల కష్టాలను దగ్గరగా చూడడంతో... ఎప్పటికైనా వాటిని దూరం చేయాలనుకున్నా. అందుకే, ఇంటర్ తర్వాత ఎంసెట్ రాసి ఏపీలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఈ (హార్టీకల్చర్) కోర్సు పూర్తి చేశాను. ఈ డిగ్రీతోనూ ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నా... శాస్త్రవేత్త కావాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీజీ సీటు పొంది ఎమ్మెస్సీ పూర్తి చేయడంతో ఉద్యాన రంగంలో సంపూర్ణ అవగాహన కలిగింది. రెండు బంగారు. పతకాలను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. నేను నేర్చుకున్న జ్ఞానాన్ని మా నాన్న లాంటి రైతులకు అందించి, వారి అభ్యున్నతికి కృషి చేస్తాను. □

# పొట్ట తగ్గడం ఎలా?

చాలామంది అమ్మాయిలు ఇబ్బంది పడే అంశాల్లో పొట్ట దగ్గర కొవ్వు. అది తగ్గడం కోసం కడుపు మాడ్చుకోవడం, కెలొరీలు లెక్కేసుకొని తినడం, కిలోమీటర్ల కొద్దీ నడవడం వంటివెన్నో చేస్తారు. అవసరమైన పోషకాలు అందక కొత్త సమస్యలు తెచ్చుకుంటారు. అలా కాకూడదంటే కొన్ని అలవాట్లు చేసుకుని, క్రమంగా పాటించాలి అంటున్నారు నిపుణులు. అవేంటంటే...

- అల్పాహారం మానొద్దు. ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బొహైడ్రేట్లు, పీచు ఎక్కువగా ఉండే గుడ్లు, ఓట్స్, రాగి, తాజాపండ్లు, నట్స్ వంటివాటికి దానిలో చోటివ్వాలి. ఇవి మెటబాలిజాన్ని మెరుగుపరుస్తాయి. శరీరానికి కావల్సిన శక్తినివ్వడంతోపాటు జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. రోగనిరోధకతనూ పెంచుతాయి.
- రోజూ కొద్దిసేపైనా వ్యాయామానికి చోటివ్వాలి. మధ్యస్థ స్థాయి వాటికి వారంలో రెండున్నర. గంటలైనా కేటాయించాలి. కండలతో మాకేం పని అనుకోకుండా రోజూ కొంచెం సేపు బరువులు ఎత్తి దించండి. డంబుల్స్ వగైరా కొనాల్సిన పనిలేదు కానీ. రెండు వాటర్ బాటిళ్లతో చేసినా సరే! ఇంకా గుంజీళ్లనూ జోడించుకుంటే మేలు. ఇవి కొవ్వును కరిగిస్తూనే మెటబాలిజాన్నీ మెరుగుపరుస్తాయి.
- బోర్ కొట్టినా, ఒత్తిడి పెరిగినా చిరుతిళ్లవైపు మనసు మళ్లుతుంది. అందుబాటులో బాదం, తాజా పండ్లు, క్యారెట్, కీర వంటి కాయగూరల ముక్కలను దగ్గర ఉంచుకొని తింటే సరి. ఇవి ఆకలిని అదుపు చేయడమే కాదు, జీర్ణక్రియనీ మెరుగుపరుస్తాయి.
- నీళ్లు బాగానే తాగుతున్నారా? ఇదీ 'పొట్ట'కు కారణమే! కనీసం 2 లీటర్లు తాగుతున్నారో లేదో చూసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేస్తూనే ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తాయి. మజ్జిగ, హెర్బల్ టీ, పండ్ల రసాల రూపంలో తీసుకున్నా మంచిదే. ఇంకా ఏం తింటున్నాం, తాగుతున్నాం అన్నది గమనించుకుంటే ఉండాలి. కాబట్టి, తినేటప్పుడు ఫోన్, టీ, పుస్తకాలను దూరంగా ఉండాలి.
- చివరగా ఒత్తిడి కూడా ఈ సమస్యకు మూలమే. పైగా త్వరగా కొవ్వు కరగకుండా చేస్తుంది. కాబట్టి, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వగైరా చేస్తూ దాన్నీ అదుపులో పెట్టుకోండి. శారీరకరంగా, మానసికంగా ఆరోగ్యంగా అవ్వడమే కాదు.. పొట్టదగ్గర సహా అనవసరం కొవ్వు కరగడం ఖాయం. □



# మౌనానికి కారణం

**కొంత మంది అమ్మాయలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధానమివ్వకుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో చెబుతున్నారు నిపుణులు.**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవుతుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేకపోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వకపోవడం వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిసానతరు. అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలే గుర్తించగలగాలి. ఆపై ముందు వాళ్ల మనసు తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని ఏది ఏమైనా మేమున్నామనే బరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్నివవ్వగలగాలి.

**నిందించకూడదు..**

ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేకపోయినా.. పిల్లలను వెంటనే నిందించకూడదు. నిన్ను చదివించడానికి మేమెంత కష్టపడుతున్నాము.. నీకు చదువు



వృథా వంటి మాటలతో గాయపరచకూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటువంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగలమనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతికూలతగా ఆలోచించకుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది.

**స్ఫూర్తి నింపాలి...** ఏ విషయాన్నైతే తమ సమస్యగా భావిస్తున్నారో దాన్ని పరిష్కరించుకునే పలు మార్గాలను వారెదుట ఉంచాలి. తీరని సమస్య అంటూ లేదని అవగాహన కలిగించాలి. ఇవన్నీ వారిలోని ఆత్మన్యూనతను దూరం చేసి, ప్రేరణ పొందేలా చేస్తాయి. అంతేకాదు, దేన్నైనా సాధించగలిగే సామర్థ్యం నీలో ఉందంటూ ఉత్సాహపరచాలి. గతంలో తను చేసిన సాధనలను గుర్తు చేసి ప్రశంసించాలి. ప్రతిభను మెచ్చుకుంటూ.. ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తే చాలు. చదువులోనే కాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ ఎదురు నిలిచి పోరాడే తత్వాన్ని నేర్చుకుంటారు. అనుకున్నవన్నీ సాధించి విజేతలుగా నిలుస్తారు. □

**ప్లాస్టిక్ వినియోగం విషయంలో** చాలామందికి ఈ సందేహం ఉంటుంది. ప్లాస్టిక్, క్యాన్సర్ మధ్య గల సంబంధాన్ని పరిశీలిస్తే.. ప్లాస్టిక్ తయారీ వాడే రసాయన సమ్మేళనాలు ఇందుకు కారణమవుతుంటాయి.

# ప్లాస్టిక్‌తో ముప్పు



ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. వాటిని పీల్చినప్పుడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఫుడ్ గ్రేడ్ కాని ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను పెట్టకపోవడం, అవెన్‌లో పెట్టి వేడి చేయకపోవడం, అలాంటి వస్తువులను వాడకపోవడం మంచిది. అలాగే క్యాన్సర్‌ను కారణమయ్యే రసాయనాలను విడుదల చేసే పరిశ్రమలకు దూరంగా ఉండడం అన్ని రకాలుగానూ మంచిది. ఏ రకంగా సర్వే ప్లాస్టిక్ వినియోగానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉన్నప్పుడే ఇటు క్యాన్సర్ అటు ఇతర ఆర్యోగాల ముప్పును తగ్గించుకోవచ్చు. □

## చెలి చిట్కా

- కొత్తచీపురు ఎక్కువ కాలంరావాలంటే కొంచెం నీటిలో ఉప్పు వేసి వేడి చేయండి వేడి చేసిన నీటిలో చీపురుమొదళ్ళను నానబెట్టండి.
- పసుపు చందనం రెండింటిని పాలమీద మీగడతో బాగా కలిపి స్నానానికి అరగంటముందు ముఖానికి పట్టంచి చన్నీళ్ళతో కడిగితే ముఖవర్చస్సు పెరుగుతుంది. □

# పొదుపు పాఠాలు నేర్పిద్దాం !



**పిల్లలకు ఎప్పే ముఖ్య మైన అంశాల్లో డబ్బు పొదుపు చేయడం ఒకటి.. చిన్న పిల్లలే అప్పుడే ఎందుకు అనుకుంటే పొరపాటే ఈ కాలం పిల్లలకు ఆది ముఖ్యం అంటున్నారు. ఆర్థిక నిపుణులు.**

జీవితంలో ఏ సమస్యలోనైనా ముందుకు వెళ్లాలంటే డబ్బు ప్రాధాన్యతను తెలుసుకోవాలట అందుకే నిపుణులు లక్ష జ్ఞానంతో పాటు, ఆర్థిక పరిజ్ఞానం కూడా చిన్నారులకు అలవాటు కావాలి. చిన్న వయసు నుంచే ఆర్థిక లక్ష్యాలను ఎలా చేరుకోవాలో వారికి చిన్న పిల్లల బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయమంటున్నారు. వారికి స్పష్టమైన లక్ష్యాలను ఎలా ఏర్పరచుకోవాలో వివరించాలి. ఈ కాలంలో పిల్లలు దేన్నైనా శ్రద్ధగా నేర్చుకుంటున్నారు. అందుకే మీరు వారికి బహుమతిగా ఇచ్చే డబ్బును పొదుపు చేయమని ప్రోత్సహించండి. ప్రతి నెలా ఆ మొత్తం ఐదు శాతం పెంచుతామని చెప్పండి. ఇది వారి పొదుపు చేయాలనే ఆసక్తిని పెంచుతుంది. ఒకవేళ పాకెట్ మనీ ఖర్చు పెడితే.. ఓ డైరీ రాయండి. నెల చివరిలో ఎంత ఖర్చు చేశారో లెక్కలు వేయమంటే సరి, అవసరం, అత్యవసరం, అనవసరమైన ఖర్చుల గురించి అర్థమయ్యేలా వివరించాలి. అనవసర ఖర్చులు అనే వారిని ప్రోత్సహించాలి ఇలా ఆదాయ, వ్యయాలను చిన్నప్పటి నుంచే చిన్నారుల డైరీలో రాయడం వల్ల ఆర్థిక క్రమశిక్షణా అలవడుతుంది. □




# 'రామభక్త హనుమాన్'

రామనామాన్ని స్మరించినంతలో ఆ రామునికన్నా ముందుగా ఆంజనేయుడు పలుకుతాడని నమ్ముతారు భక్తులు. 'రామభక్త హనుమాన్' అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. తమను సర్వదా రక్షిస్తాడని నిండైన భక్తితో ఆరాధిస్తారు. భక్తి నవవిధాలు. అందులో స్మరణ భక్తికి, ధ్యానభక్తికి ఆంజనేయుడు ప్రబల ప్రతీక. అంజనీదేవి పుత్రుడు కనుక ఆంజనేయుడని, వాయుదేవుని అంశతో పుట్టినవాడు కనుక మారుతి, పావని అని, హనువు (దవడ) దెబ్బతిన్న కారణంగా హనుమతుడని ఆ పవన తనయుడికి ఎన్ని పేర్లో! హనుమంతుడు జన్మతంః వానరం. పరమశివుని మరో రూపమైన రుద్రుని అంశతో, అగ్నితేజంతో, వాయుబలంతో జన్మించినవాడు. పసివాడుగానే ఆకాశంలోకి ఒక్క ఎగురు ఎగిరి, భానుడి వద్దకు వెళ్లాడు. ఏకంగా 24 లోకాలను తల్లడిల్ల చేయగల మహోగ్ర తేజోసంపన్నమైన సూర్య బింబాన్నే మింగబోయాడు మహాశక్తిమంతదూర ఆంజనేయుడు. జ్ఞానం, బలం, ధైర్యం, వీరం, సాహసం, యోగం, వేగం, భక్తి, శక్తి-ఇలా అన్నిటినీ కలిగి ఉన్న పరాక్రమశాలి హను మంతుడు. లోకైక శక్తికి ఏకైక ప్రతీక హనుమ. అందుకే దైహిక శక్తినిచ్చే వ్యాయామ శాలలకు 'హనుమాన్' అని పేరు పెట్టుకుంటారు. □



ఆధ్యాత్మికం

# ఆరోగ్యానికి ఆవ ఆకు



**తాలింపులో వేసే అర చెంచా ఆవాలు కూర,** చారుల రుచిని అమాంతం పెంచేస్తాయి. ఆవాల పొడి వేయడం వల్లే కూరగాయ పచ్చళ్ల గొప్పగా ఘుమాయిస్తాయి. ఇలా మన ప్రాంతాల్లో ఆవాలను ఎక్కువగానే ఉపయోగిస్తాం. కానీ ఆ ఆకు తినే అలవాటు పెద్దగా లేదు. నిజానికి ఇది చాలా మంచిదంటున్నారు ఆహార నిపుణులు. పాలకూర, మెంతికూరల్లా ఆవాకు కూడా శ్రేష్ఠమైందని, వీలైనప్పుడల్లా ఏదో ఒక రూపంలో తినేందుకు ప్రయత్నించమని చెబుతున్నారు. ఆవాకును కంది, పెసర, శనగ, పప్పులతో కలిపి వండొచ్చు. దీన్నిఆలివ్ నూనెలో వేయించి, కారం, ఉప్పు, వెల్లుల్లి, నిమ్మరసం వేస్తే సైడ్ డిష్ అయిపోతుంది. సలాడ్ రూపంలో అయితే పిల్లలూ పెద్దలూ అందరికీ చేసేబజ్జీలు పాలకూర పకోడీల్లానే ఘుమాయిస్తాయి. ఆవాకు ఎ, బి1, బి3, బి6, సి, ఇ, కె మిటమిన్లు, ప్రొటీన్లు, కాపర్ ఇలా శరీరానికి అవసరమైనవెన్నో ఉన్నాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను తరిమి కొట్టేయాంటీఆక్సిడెంట్స్ ఆవాకులో విస్తారంగా ఉన్నాయి. ఇది టైప్-2 డయాబెటిస్, గుండెజబ్బులను నిరోధిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తం గడ్డకుండా చేస్తుంది. ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. కంటిచూపును మెరుగుపరుస్తుంది. ఆవాకు మతిమరపును కూడా తగ్గిస్తుందని ఇటీవలి పరిశోధనల్లో తేలింది. ఇన్ని లాభాలున్న ఈ ఆకును మనమూ తిందామా. □

# ఒకే టెస్ట్‌లో 400 పైగా రన్స్


గ్రహం గూచ్


శుభమన్ గిల్


మార్క్ టేలర్


కుమార్ సంగక్కర

## వరల్డ్ టాప్ 1, 2లో గూచ్, గిల్

**న్యూఢిల్లీ:** అత్యంత ప్రతిష్టాత్మకమైన టెస్ట్ క్రికెట్ ఫార్మాట్లలో బ్యాట్స్‌మెన్‌లు సత్తా చూపిస్తుంటారు. ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం, అత్యంత కఠినమైన పరిస్థితులలో బ్యాట్స్‌మెన్‌ల నైపుణ్యంతో ఒకే టెస్ట్‌లో 400 పరుగుల మార్కును అధిగమించిన రికార్డు సాధించారు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ గ్రాహం గూచ్ ఒకే టెస్ట్‌లో 400 కంటే ఎక్కువ రన్స్ చేసి చరిత్ర సృష్టించిన టాప్ 4 బ్యాట్స్‌మెన్‌ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. 1973-1997 వరకు గూచ్ 118 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 42.6 సగటు, 49.2 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో రికార్డు స్థాయిలో 8,900 పరుగులు చేశాడు. లండన్‌లో 1990 జూలైలో ఇండియా సిరీస్ ఫస్ట్ టెస్ట్ మ్యాచ్‌లో గూచ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 43 బౌండరీలు, 3 హై ఫ్లయింగ్ సిక్సర్లతో సహా 333 రన్స్ చేశాడు. కపిల్ దేవ్, అనిల్ కుంబ్లే దాడిని ఎదుర్కొని అద్భుతంగా రాణించి 2వ ఇన్నింగ్స్‌లో 113 బంతుల్లో 123 పరుగులు చేశాడు. మొత్తం 456 పరుగుల్లో గూచ్ 247 రన్స్ భారీ తేడాతో భారత్ ఓటమికి కారణమయ్యాడు. ఇక ఈ జాబితాలో 2వ ప్లేస్‌లో భారత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 34 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 42.7 సగటు, 62.7 స్ట్రైక్ రేట్‌తో 2,578 పరుగులు సాధించాడు. గిల్ ప్రస్తుత ఇంగ్లాండ్‌లో 2వ టెస్ట్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. తొలిఇన్నింగ్స్‌లో 269రన్స్, 2వ ఇన్నింగ్స్‌లో 161 పరుగులతో ఒకే టెస్ట్‌లో అత్యధిక రన్స్ చేసి వరల్డ్‌లో 2వఆటగాడిగా నిలిచాడు. అదనంగా ఎడ్జ్‌బాస్టన్‌లో ఇంగ్లాండ్‌పై 430 రన్స్ చేసిన తర్వాత, ఒకే టెస్ట్‌లో 400పరుగుల బెంచ్‌మార్క్‌ను దాటిన తొలి భారత్‌కెప్టెన్‌గా కూడా రికార్డు సాధించాడు. అలాగే 1996 వరల్డ్ కప్ రన్నరప్ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మార్క్ టేలర్ 3వ స్థానంలో ఉన్నాడు. 1989-1999 వరకు తన కెరీర్‌లో మార్క్ 104 టెస్ట్‌లలో 43.5 సగటు, 41.5 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 7,525 పరుగులు సాధించాడు. పాకిస్తాన్‌పై మార్క్ 426 పరుగులు చేశాడు. కాగా శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార్ సంగక్కర ఉన్నాడు. 2000-2015 వరకు అన్ని ఫార్మాట్లలో లంకకు ప్రాతినిధ్యం వహించాడు. ఆల్ టైమ్‌లో అత్యంత ఫలవంతమైన వికెట్ కీపింగ్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా సంగక్కర మొత్తం 134 టెస్ట్ మ్యాచ్‌లుఆడి 57.4 సగటు 54.2 స్ట్రైక్ రేట్‌తో రికార్డు స్థాయిలో 12,400 రన్స్ సాధించాడు. బంగ్లాదేశ్‌పై, సంగక్కర 2వ ఇన్నింగ్స్‌లో 144 బంతుల్లో 105 రన్స్‌చేసి, అదే మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ మరియు సెంచరీ చేసిన రెండవ ఆటగాడిగా నిలిచాడు.



## మహిళల ఆసియా కప్‌లో..
# భారత్ శుభారంభం

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ డివిజన్2 తొలి మ్యాచ్‌లో కజకిస్తాన్‌ను ఓడించి, భారత మహిళల బాస్కెట్‌బాల్ జట్టు నాలుగు సంవత్సరాల తర్వాత కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లోకి తిరిగి వచ్చింది. 2023 ఆసియా క్రీడల తర్వాత తొలిసారిగా దక్షిణాసియా వెలుపల పోటీ పడుతున్న ఆ జట్టు నెమ్మదిగా ఆటను ప్రారంభించినా ఆ తర్వాత వేగం పెంచింది. దీంతో కజకిస్తాన్‌పై 85-68 తేడాతో విజయాన్ని సాధించి అద్భుతమైన పునరాగమనం చేసింది. పుష్ప సెంథిల్ కుమార్ 23 పాయింట్లతో స్కోరింగ్ చార్టులలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 76.92 శాతం మార్పిడి రేటుతో పది 2పాయింటర్లను తగ్గించింది. ఆమెకు తన సహచరులు శ్రీకళా రాణి, సత్య కృష్ణమూర్తి నుండి మద్దతు లభించింది. వారు చెరో 15 పాయింట్లు సాధించారు. ఇదే సమయంలో కజకిస్తాన్ ఆట అద్భుతంగా ప్రారంభించి మొదటి క్వార్టర్ (20-14) తర్వాత 6 పాయింట్ల ఆధిక్యంలో ఉంది. భారత ఆటగాళ్ల నుండి కొన్ని సాధారణ ఫౌల్‌లు జరిగిన ఫలితంగా కజకిస్థాన్‌కు బహుళ ఫ్రీత్రోలు వచ్చాయి. అయితే, భారత జట్టు స్వల్ప సమయంలో బలంగా పుంజుకుని తరువాతి రెండు క్వార్టర్లలో ఆధిపత్యం చెలాయించింది. వరుసగా 12 మరియు 16 పాయింట్ల తేడాతో రెండింటినీ గెలుచుకుంది, చివరి క్వార్టర్‌కు వెళ్లే ముందు 22 పాయింట్ల భారీ ఆధిక్యాన్ని పొందింది. చివరి క్వార్టర్‌లో 21-16 తేడాతో గెలిచిన కజకిస్తాన్ చివరి దశలో పుంజుకున్నప్పటికీ, ఈ ఆధిక్యం భారత్ విజయం సాధించడానికి సరిపోయింది.

## వింబుల్డన్ మహిళల డబుల్స్‌లో..
# కుడెర్మెటోవా, మెర్టెన్స్ జోడీకి టైటిల్



**న్యూఢిల్లీ:** వింబుల్డన్ ఛాంపియన్‌షిప్-2025ను వరల్డ్ నెంబర్ 8 సీడ్లు వెరోనికా కుడెర్మెటోవా-ఎలిస్ మెర్టెన్స్ జోడీ గెలుచుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఉత్కంఠ భరితమైన ఫైనల్‌లో మహిళల డబుల్స్ టైటిల్‌ను ఈ జోడీ కైవసం చేసుకుంది. 2 గంటల 23 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో వారు నెంబర్ 4 సీడ్లు హ్సీహ్ సువీ-జెలెనా ఒస్టాపెంకోలను 3-6, 6-2, 6-4 తేడాతో ఓడించి నాటకీయ పునరాగమనం చేశారు. తొలి సెట్‌ను కోల్పోయిన తర్వాత, కుడెర్మెటోవా-మెర్టెన్స్ దృఢత్వాన్ని ప్రదర్శించారు. రెండవ సెట్‌లో హ్సీహ్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి మ్యాచ్‌ను సమం చేశారు. కుడెర్మెటోవా నెట్ ప్లే, మెర్టెన్స్ స్థిరమైన బేస్‌లైన్ స్థిరత్వం వారికి అనుకూలంగా ఊపును మార్చడం ప్రారంభించాయి. అయితే, మూడవ సెట్‌లో సీహ్ మరియు ఒస్టాపెంకో 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లడంతో మరోమలుపు తిరిగింది. కుడెర్మెటోవా ఛాంపియన్‌షిప్ పాయింట్‌పై వాలీ విజేతతో విజయాన్ని నమోదు చేసింది, చివరికి ఆమె మొదటి గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. 2021 వింబుల్డన్ ఫైనల్‌లో ఓడిపోయిన కుడెర్మెటోవాకు ఈ విజయం ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. అదే సమయంలో ఆమె భాగస్వామి మెర్టెన్స్ తన 5వ మేజర్ డబుల్స్ టైటిల్, వింబుల్డన్‌లో తన 2వ టైటిల్‌ను గెలుచుకుంది.

## షూటింగ్ ప్రపంచ కప్‌లో..
# ముగిసిన భారత్ పోరు
### నీరు, సంధు జోడీలు విఫలం





**న్యూఢిల్లీ:** షూటింగ్ ప్రపంచ కప్ 2025లో భారత్ పోరు ముగిసింది. లక్షయ్ షెయోరాన్ (22,19,25)-నీరు దండా (25,24, 25) జంట మూడవ సిరీస్‌ను షూట్ చేసి నప్పటికీ, ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ పతక రౌండ్లలో విఫలమైన తర్వాత అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్ షాట్‌గన్‌లో భారత్ ప్రచారం ముగించింది. వారు అర్హత రౌండ్‌లో సాధ్యమయ్యే 150లో 140 పాయింట్లు సాధించి 54 జతలలో 10వ స్థానంలో నిలిచారు. ఇక భారత రెండోజత జోరావర్ సింగ్ సంధు (21,23,24)-ప్రీతి రాజక్ (23,24, 23) కలిసి 138 పాయింట్లతో 22వ స్థానంలో నిలిచారు. ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్ మరియు రెండు స్పానిష్ జట్లు అర్హత పోటీలలో 143 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాయి. గత నికోసియా షాట్‌గన్ ప్రపంచ కప్‌లో ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జంట కైనన్ చెనై మరియు సబీరా హారిస్ కాంస్య పతకం గెలుచుకున్నారు. జాతీయ క్రీడల ఛాంపియన్ నీరు దండా తొలిసారిగా ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని, చివరి రోజు మహిళల ట్రాప్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం న్యూఢిల్లీ ప్రపంచ కప్ ఫైనల్ విజేత అలెస్సియా ఇజ్జీ (ఇటలీ)పై షూట్‌ఆఫ్ (21) గెలవడం ద్వారా ఆరో మరియు చివరి అర్హత స్థానాన్ని పొందిన నీరు చివరికి అధిక బిబ్ సంఖ్య కారణంగా నిష్క్రమించింది. కాగా స్ట్రేలియాకు చెందిన లైటిషా స్కాన్లాన్ 45 హిట్‌లతో స్వర్ణం గెలుచుకుంది. ఒక రోజు ముందు మహిళల ట్రాప్‌లో నీరూ తన అద్భుతమైన నాల్గవ స్థానం నుండి తన 75 లక్ష్యాలలో ఒక లక్ష్యాన్ని మాత్రమే కోల్పోగా, లక్ష్యయ్ రెండవ సిరీస్‌లో ఒక చిన్న తప్పు చేసింది, అక్కడ అతను ఆరు లక్ష్యాలను మిస్ చేశాడు, చివరికి పోడియం ముగింపులో ఒక షాట్ కోల్పోయింది.

# ఛాంపియన్‌గా ముంబై ఇండియన్స్



### 5 రన్స్ తేడాతో ఓడిన వాషింగ్టన్

**న్యూఢిల్లీ:** మేజర్ లీగ్ క్రికెట్-2025 ఎడిషన్ విజేతగా ముంబై ఇండియన్స్ న్యూయార్క్ అవతరించింది. ఓవరాల్‌గా పొట్టి క్రికెట్‌లో ముంబై ఇండియన్స్‌కు ఇది 13వ టైటిల్. ఈ సీజన్‌లో నికోలస్ పూరన్ నేతృత్వంలో ముంబై బరిలోకి దిగింది. పూరన్ ముంబై ఫ్రాంచైజీ తరపున మూడో టైటిల్ సాధించాడు. అయితే ముంబైకు అత్యధికంగా 6 టైటిళ్లు అందించిన ఘనత భారత్ కెప్టెన్ రోహిత్ శర్మకు దక్కింది. మ్యాచ్ విషయానికి వస్తే డల్లాస్ వేదికగా హోరా హోరీగా జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ వాషింగ్టన్ ఫ్రీడంను 5 పరుగుల తేడాతో చిత్తు చేసింది.
ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 180 పరుగులు చేసింది. డికాక్ 77 పరుగులతో మెరుపు అర్ధ సెంచరీ చేసి సత్తా చాటి ముంబైకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ముంబై ఇన్నింగ్స్‌లో మోనాంక్ పటేల్ 28, తజిందర్ డిల్లాన్ 14, పూరన్ 21, పోలార్డ్ 0, బ్రేస్‌వెల్ 4, కన్వర్‌జీత్ సింగ్ 22 (నాటౌట్), ట్రిస్టన్ లస్ 2 (నాటౌట్) పరుగులు చేశారు. వాషింగ్టన్ బౌలర్లలో లోకి ఫెర్గూసన్ 3, నేత్రావల్కర్, మ్యాక్స్‌వెల్, జాక్ ఎడ్వర్డ్స్, హోలాండ్ తలా వికెట్ తీశారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన వాషింగ్టన్ చివరి వరకూ గెలుపు కోసం పోరాడింది. రచిన్ రవీంద్ర (70). గ్లెన్ ఫిలిప్స్ (48 నాటౌట్), జాక్ ఎడ్వర్ట్స్ (33) వాషింగ్టన్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశారు. చివరి ఓవర్‌లో వాషింగ్టన్ గెలుపునకు 12 పరుగులు అవసరం కాగా, 22 ఏళ్ల కుర్ర పేసర్ రుషి ఉగార్కర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మ్యాక్స్‌వెల్, గ్లిన్ ఫిలిప్స్ లాంటి విధ్వంసకర బ్యాటర్లను సైలెంట్ చేసి ముంబైకి అద్భుత విజయాన్ని అందించాడు. చివరి ఓవర్లో ఉగార్కర్ మ్యాక్స్‌వెల్‌ను (15) ఔట్ చేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఫలితంగా ముంబై రెండోసారి ఛాంపియన్‌షిప్‌ను చేజిక్కించుకుంది.

# దిగివచ్చిన రిటైల్ ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ, జూలై 14:** మే నెలలో 2.82శాతంగా ఉన్న భారత్ రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 2.1శాతానికి తగ్గింది. అదేవిధంగా సిపిఐ బాస్కెట్‌లో ప్రధాన భాగమైన ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. ప్రధానంగా కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాల ధరలు తగ్గడం విశేషం. ప్రపంచ ముడి చమురు ధరలు సాపేక్షంగా స్థిరంగా ఉన్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల ధర, తయారీ,లాజిస్టిక్స్ కోసం ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణం నియంత్రణకు దోహదపడ్డాయి. జూన్ 2024లో ద్రవ్యోల్బణం రేటు సాపేక్షంగా ఎక్కువగా ఉంది. ఇది జూన్ 2025 డేటాకు అనుకూలమైన బేస్‌ను సృష్టిస్తుంది. ఇది సంవత్సరానికి ద్రవ్యోల్బణ సంఖ్య తగ్గడానికి దారితీసింది. ద్రవ్యోల్బణం దాని లక్ష్యం కంటే చాలా తక్కువగా ఉండడంతో, ఆర్థిక వృద్ధిని ప్రేరేపించడానికి ఆర్‌బిఐ మరింత వడ్డీ రేటు కోతలను పరిగణనలోకి తీసుకునేందుకు మరింత వెసులుబాటును కలిగి ఉంది. వ్యాపారాలు, పెట్టుబడులకు సానుకూలంగా తక్కువ ద్రవ్యోల్బణం వ్యాపారాలు లాభాల మార్జిన్‌లను నిర్వహించడానికి,



పెంచడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలదు. ఇది దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలదని అప్‌స్టాక్స్ తెలిపింది. ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు కూడా దోహదం చేస్తాయి. ఇది ఆర్‌బిఐకి సవాలుగా నిలుస్తుంది. భారతదేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల పరిణామం, ఇది మరింత స్థిరమైన ఆర్థిక వాతావరణాన్ని సూచిస్తుంది. అయితే ఆర్‌బిఐ అప్రమత్తంగా ఉండి, సంభావ్య ప్రమాదాలను పరిష్కరించడానికి, స్థిరమైన ధర స్థిరత్వం, ఆర్థిక వృద్ధిని నిర్ధారించడానికి దాని విధానాలను స్వీకరించాల్సిన అవసరం ఉంది.

# ఎస్క్రో ఖాతాలో రూ.4,800 కోట్లు: జేన్ స్ట్రీట్ డిపాజిట్

**వాషింగ్టన్, జూలై 14:** అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్‌స్ట్రీల్ సెబి ఆదేశాల మేరకు రూ.4,843 కోట్ల సొమ్మును ఎస్క్రో ఖాతాలో జమ చేసినట్లు కొన్ని కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సంస్థ ఇక్కడి మార్కెట్లలో ఇప్పుడే ట్రేడింగ్ చేసే అవకాశం లేదని తెలుస్తోంది. కాకపోతే, సెబి ఆదేశాలను మాత్రం న్యాయ స్థానంలో సవాలు చేసే అవకాశాలున్నా యి. ఇప్పటికే జూలై 3వ తేదీన ఆ సంస్థ మార్కెట్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సెక్యూరిటీల కొను గోళ్లు, అమ్మకాలకు పాల్పడ కుండా నిషేధం విధించింది. దీంతో పాటు జేస్ స్ట్రీట్ ఆస్తులకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరగ కుండా బ్యాంకులు, కస్టోడియన్స్, డిపాజిటర్లు, రిజి స్ట్రార్‌లు, ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లకు ఆదేశాలు జారీచేసింది. నియంత్రణ సంస్థ నిబంధనల ప్రకారం నగదు డిపాజిట్ చేయడంతో భారత మార్కెట్లలో తిరిగి ట్రేడింగ్‌ను మొదలు పెట్టేందుకు మార్గం సుగమమం అయింది.



అయితే సెబి అభ్యంతరం తెలిపిన వ్యూహాన్ని మాత్రం ఆ సంస్థ అమలు చేయకూడదని పేర్కొంది. దీంతో పాటు ఈ సంస్థ భవిష్యత్తు కార్యకలాపాలను జాగ్రత్తగా గమనించాలని స్టాక్ ఎక్స్చేంజీలను సెబి ఆదేశించింది. ప్రొప్రైటరీ ట్రేడింగ్ సేవల సంస్థ అయిన జేన్ స్ట్రీట్ గ్రూపు రెండు వేల సంవత్సరంలో ఏర్పాటైంది. అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లో ఈ సంస్థ కార్యాలయాల్లో 2,600 మంది సిబ్బంది పని చేస్తున్నారు. జేన్ స్ట్రీల్ భారత మార్కెట్లలో దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబి నిర్ధారించింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే, నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించారు. మన దేశంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ తరగతి కిందకు వచ్చే ఈ సంస్థ, నగదు, ఫ్యూచర్స్, ఆప్షన్స్ విభాగాల్లో ట్రేడింగ్ చేసే క్రమంలో ఎఫ్‌పిఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు సెబి గుర్తించింది. దాదాపు 21 సందర్భాల్లో లావాదేవీలు సాగించి, భారీ మొత్తాలు ఆర్జించినట్లు నిర్ధారించింది. దీనిపై సెబి దర్యాప్తును కొనసాగిస్తోంది. ఈ సంస్థ రూ.4,843 కోట్ల సొమ్మును జరిమానాగా చెల్లించాలని సెబి ఆదేశం చింది. దేశీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలో సెబి ఇంత పెద్ద మొత్తాన్ని పెనాల్టీ రూపంలో రాబట్టాలని నిర్ణయించడం ఇదే ప్రథమం.

# ఒక్క బిట్‌కాయిన్..రూ.కోటి నాలుగు లక్షలు!



**న్యూఢిల్లీ, జూలై 14:** పర్సనల్ ఫైనాన్సింగ్ కేటగిరీలో బిట్‌కాయిన్ సరికొత్త పెట్టుబడి ఎంపికగా మారిపోయింది. దీంతో క్రిప్టో కాయిన్ రేటు తన సుదీర్ఘ ప్రయాణంలో లక్ష20వేల డాలర్ల జీవితకాల గరిష్టాలకు చేరుకుంది. అయితే ఇన్వెస్టర్లలో వచ్చిన అవగాహన, క్రిప్టోల వైపు వారి అడుగులు పెద్ద మార్పుగా పరిగణిస్తున్నట్లు ప్రముఖ క్రిప్టో ఎక్చేంజీ సంస్థ పేర్కొంది. ఒకప్పుడు ఇంట్రాడే ట్రేడింగ్ కోసం క్రిప్టోల్లోకి వచ్చిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం దానిని ఒక వ్యూహాత్మక దీర్ఘకాలిక అసెట్ క్లాస్ కింద పరిగణిస్తున్నట్లు వాలెట్ చేరికల్లో పెరుగుదల సూచిస్తోందని క్రిప్టో ఎక్చేంజీ వెల్లడించింది. ప్రస్తుతం వచ్చిన మార్పులు బిట్‌కాయిన్ వేగంగా సంపద సృష్టికి పునాది స్తంభంగా మారుతుందనే లోతైన మార్కెట్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొంది. ఇటీవల బిట్‌కాయిన్ తన టెక్నికల్ రెసిస్టెన్స్ లెవెల్ లక్షా10వేల డాలర్ల మార్కును అధిగమించడం మరింత ర్యాలీకి కారణంగా మారింది. దీనికి తోడు ఎథెరియం, సోలానా, కార్డానో,సుయి వంటి ఇతర కాయిన్స్ కూడా క్రిప్టో ఇన్వెస్టర్ల నుంచి మంచి ఆదరణను పొందుతున్నాయి. డేటా ప్రకారం ఈ యేడాది బలమైన ట్రెండ్ కొనసాగే అవకాశంఉందని ఊహించబడింది. ఈ క్రమంలో చిన్న చిన్న ఒడుదుడుకులు ఉన్నప్పటికీ క్రిప్టోల ప్రాభల్యం పెట్టుబడుల ప్రపంచంలో సుస్థిరంగా ముందుకు సాగుతుందని కూడా భావిస్తోంది. ఈ క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లలో ఉండే అనుమానం బిట్‌కాయిన్ ర్యాలీ ఇంకెంత వరకు చేరుకుంటుంది అన్నదు. దీనికి జియోటస్ సిఇఒ విక్రమ్ సుబ్బురాజ్ అంచనాలను చూస్తే ఇకపై బిట్‌కాయిన్ ధర లక్షా35వేల డాలర్ల రేటు వద్ద నిరోధాన్ని ఎదుర్కొంటుందని తెలుస్తోంది. ఇదే క్రమంలో క్రిప్టో ఇటిఎఫ్ పెట్టుబడులు పెరిగితే ఒక్కో బిట్‌కాయిన్ రేటు ఏకంగా లక్షా50వేల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉందని కూడా విక్రమ్ చెబుతున్నారు.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 14:** దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ట్రేడ్ వార్ భయాలు సూచీలను పడేశాయి. యూరోపియన్ యూనియన్, మెక్సికోపై ఆగస్టు 1 నుంచి 30 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించడం ఇందుకు కారణం. దీనికి తోడు త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండడం మరో కారణం. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఈ క్రమంలోనే నిఫ్టీ 25,100 దిగువకు చేరింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు రాణించడం విశేషం. సెన్సెక్స్ ఉదయం 82,537.87 పాయింట్ల వద్ద స్వల్పలాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.38 వద్ద కనిష్ఠాన్ని తాకినసూచీ.. చివరికి247.01 పాయింట్ల నష్టంతో 82,253.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.55 పాయింట్ల నష్టంతో 25,082.30 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఏషియన్ పెయింట్స్, టెక్‌మహీంద్రా, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎటర్నల్, టైటాన్, సన్‌ఫార్మా, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.44 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,385 డాలర్ల వద్ద ట్రేడయింది.



# ఓలా ఎలక్ట్రిక్ నష్టం రూ.428కోట్లు

**ముంబై, జూలై 14:** ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.428 కోట్ల నికర నష్టాన్ని కంపెనీ నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.347 కోట్లతో పోలిస్తే నష్టం మరింత పెరిగింది. అయినప్పటికీ కంపెనీ షేర్లు రాణిస్తుండడం గమనార్హం. ఓలా నష్టాలు పెరిగినప్పటికీ.. లాభదాయకత దిశగా కంపెనీ అడుగులు వేస్తోందన్న సంకేతాలు స్టాక్‌లో పాజిటివ్ రియాక్షన్‌కు కారణమైంది. ఓలా ఎలక్ట్రిక్ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1644 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది ఆ మొత్తం రూ.828 కోట్లకు తగ్గింది. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో (క్యూ4) పోలిస్తే ఈ మొత్తం పెరగడం ఓలా షేర్ల పెరుగుదలకు మరో కారణం. గత త్రైమాసికంలో రూ.611 కోట్లుగా ఉన్న ఆదాయం జూన్‌తో (క్యూ1) ముగిసిన త్రైమాసికానికి 35.5 శాతానికి పెరిగింది. క్యూ4లో 51,375 యూనిట్లను విక్రయించిన ఓలా, సమీక్షా త్రైమాసికంలో 68,192 యూనిట్లను విక్రయించినట్లు తెలిపింది. జూన్ నెలలో పాజిటివ్ ఎబీటా సాధించినట్లు కంపెనీ తెలిపింది. ప్రాజెక్ట్ లక్ష్యలో భాగంగా చేపట్టిన చర్యల వల్ల నిర్వహణ ఖర్చులు నెలకు రూ.178 కోట్ల నుంచి రూ.105 కోట్లకు తగ్గుముఖం పట్టాయని ఓలా పేర్కొంది. మొత్తం ఖర్చులు నెలకు రూ.150 కోట్లుగా ఉండగా.. రూ.130 కోట్లకు తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.25 లక్షల నుంచి 3.75 లక్షల వావానాలను విక్రయించాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని, తద్వారా రూ.4200 రూ.4700 కోట్ల ఆదాయం సమకూరుతుతుందని పేర్కొంది. క్యూ2 నుంచి తమ జనరేషన్3 స్కూటర్లకు పీఎల్ఐ ప్రయోజనాలు అందుతాయని, తద్వారా స్థూల మార్జిన్లు 3540 శాతం మేర పెరుగుతాయని అంచనా వేస్తోంది. పూర్తి ఏడాదికి 5 శాతం ఎబీటా సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమ్ముడవుతున్న మొత్తం వాహనాల్లో జనరేషన్3 మోడళ్లే 80 శాతం వరకు ఉంటున్నాయని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్ల వల్ల మార్జిన్లు పెరగడంతో పాటు వారెంటీ క్లెయిమ్‌లు కూడా తగ్గుముఖం పడతాయని తెలిపింది. 200స్టోర్లలో ప్రస్తుతం రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్ సైకిల్ లభిస్తోంది.



# వాణిజ్యం

## ఎన్‌ఎస్‌ఇకి గ్లోబల్ 4 ర్యాంక్

**ముంబై, జూన్ 14:** ఈ యేడాది తొలి అర్ధభాగంలో ఐపిఒ నిధుల సేకరణలో గ్లోబల్‌లోనే ఎన్‌ఎస్‌ఇ 4వ స్థానాన్ని దక్కించుకుంది. ఎస్అండ్‌పి గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ నిధుల సేకరణలో 5.51 బిలియన్ డాలర్లను అందించింది. ఎన్‌ఎస్‌ఇ యొక్కఅద్భుతమైన ప్రదర్శన నాస్‌డాక్ గ్లోబల్ మార్కెట్, ఎన్వైఎస్‌ఇ, నాస్‌డాక్ గ్లోబల్ సెలెక్ట్ మార్కెట్ల కంటే కొంచెం వెనకబడి ఉంది. ఇవి అమెరికాకు చెందిన 3 ఎక్చేంజీలు, ఇవి మొదటి అర్ధభాగం-25లో సమిష్టిగా 28.95 బిలియన్ డాలర్లను సేకరించాయి. ఇది ప్రపంచ మొత్తంలో 46.73శాతం ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే ఐపిఒల సంఖ్యపరంగా, ఎన్‌ఎస్‌ఇ ఈ కాలంలో 73ఐపిఒలను నిర్వహించడం ద్వారా అన్ని



గ్లోబల్ ఎక్చేంజీలను అధిగమించింది. నాస్‌డాక్ గ్లోబల్‌యొక్క 66ని అధిగమించింది. ఎన్‌ఎస్‌ఇ యొక్క ప్రపంచ ర్యాంక్ దాటి, భారతదేశం యొక్క మొత్తం ఐపిఒ కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. 2౦25 మొదటి ఆరు నెలల్లో భారతీయ ఎక్చేంజీలలో మొత్తం 119 ఐపిఒలు ప్రారంభించబడ్డాయి. సమిష్టిగా 51,150 కోట్లు సేకరించాయి. 2024 ఇదే కాలంలో 157 లిస్టింగ్‌ల నుంచి వచ్చిన 37,682 కోట్లతో పోలిస్తే, సేకరించిన మూలధనంలో ఇది సంవత్సరానికి గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. లిస్టింగ్‌ల సంఖ్య కొద్దిగా తగ్గినప్పటికీ, సేకరించిన నిధుల పెరుగుదల పెద్ద ఆఫర్‌ల ఉనికిని, పెరిగిన పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూపిస్తుంది. ముఖ్యంగా ఎన్‌ఎస్‌ఇ ద్వారా, దేశ ఆర్థిక స్థితిస్థాపకతను మాత్రమే కాకుండా ప్రపంచ పెట్టుబడి దృశ్యంలో దాని పెరుగుతున్న ప్రాముఖ్యతను కూడా ప్రతిబింబిస్తుంది. భారతీయ ఈక్విటీల పట్ల పెట్టుబడిదారుల ఆకలి బలపడడం, దేశ మూలధన మార్కెట్లు అభివృద్ధి చెందుతున్నప్పుడు, భారతదేశం ప్రపంచంలోని ప్రముఖ ఐపిఒ గమ్యస్థానాలలో తన స్థానాన్ని కొనసాగించే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.